తెలంగాణ తెరకు తొలి వెలుగు

# బి.నరసింగరావు

## జీవిత కళా చలనచిత్ర యాత్ర



హెచ్.రమేష్‌బాబు

## తెలంగాణ తెరకు తొలి వెలుగు

# బి.నరసింగరావు

## జీవిత కళా చలన చిత్ర యాత్ర

హెచ్. రమేష్ బాబు

DECCAN
ACADEMY
"BHOOPATHI SADAN" 3-6-716, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.
Telangana, INDIA.
Phone: 040-27635644
E-mail: vedakumar52@gmail.com

**తెలంగాణ తెరకు తొలి వెలుగు**

# బి. నరసింగరావు

**జీవిత కళా చలన చిత్ర యాత్ర**

*First Edition : 15th December 2017*
*(Prapancha Telugu Maha Sabhalu)*

*Copies : 2000*

© *Deccan Academy*

*Published by :*
***Deccan Academy***
*Himayatnagar, Hyderabad,*
*Telangana State, India.*

*For Copies :*
**Deccan Academy**
"BHOOPATHI SADAN"
*3-6-716, 12th Street,*
*Himayatnagar, Hyderabad-500029.*
TELANGANA.
Phone: 040-27635644
email: vedakumar52@gmail.com

*Cover Photo :* M. Vedakumar

*Cover Design :* Ramanajeevi

*Layout :* **Charita Impressions**, Azamabad Industrial Area, Hyderabad - 500 020.

*Printed at :*
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph.+91-040-27678411
e-mail : deccan.press@yahoo.com



# తెలంగాణ తెరకు తొలి వెలుగు

బి. నరసింగరావు జీవిత కళా చలన చిత్ర యాత్ర

-హెచ్.రమేష్‌బాబు

**సినిమాలు వినోదం కోసమే కాదు సమాజ చిత్రణకోసం కూడా**

- బిమల్‌రాయ్

**అం**తర్జాతీయ ఖ్యాతిగాంచిన సుప్రసిద్ధ తెలుగు నవ్య సినిమా దర్శకుడు బి.నరసింగరావుది కూడా ఇదే దృక్పథం. కాకపోతే మరో నాలుగడుగులు ముందున్నాడు. ఆయనేమంటారంటే "సినిమా అనేది సాధారణ ప్రేక్షకులకి, జనాలకి నచ్చడం అనే విషయంపై నాకెలాంటి భేదాభిప్రాయం లేదు. కానీ, సినిమా విజ్ఞులైన వాళ్ళకి, హృదయం పెట్టి చూసేవాళ్ళకి నచ్చాలి, కదిలించాలి అనేది నా ఆలోచన".



'మాభూమి చిత్రం'లో : నాగయ్య పాత్రలో బి. నరసింగరావు





ఢిల్లీలో కుతుబ్ మినార్ వద్ద బి. నరసింగరావు

భారతీయ చలనచిత్ర రంగంలో 85 ఏండ్ల టాకీల శకంలో బి.నరసింగరావుది ఒక ప్రత్యేకస్థానం. తెలుగు సినిమా పరిశ్రమలో ఎవరో తెలియకుండానే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెప్పొందిన సినిమాలు తీశారు. 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి' అనేది తెలుగులో పాపులరైన సామెత. కానీ ఈ సామెతను అక్షరాల తిరగరాసి రచ్చగెలిచాకనే ఇంట గెలిచిన దర్శకులు బి.నరసింగ రావు. అయితే 1950ల నుండి తెలుగు సినిమాకు బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డి, ఆదుర్తి వంటి వారివల్ల జాతీయ స్థాయికి కొన్ని సినిమాలు వెళ్ళినవి. కానీ అవన్నీకూడా వ్యాపార విలువలు పుష్కలంగా ఉన్న సినిమాలే. అయితే బి.నరసింగరావు సినిమాలు పూర్తిగా సామాజిక జీవన చిత్రణలతో కూడుకున్నవి. పైగా అవేవీ వందలు, యాభైలు, డజన్లు కూడా కావు. కానీ తీసినవన్నీ సంచలన చిత్రాలే. ఇవే భారతీయ న్యూవేవ్ చిత్రాల నిర్మాతల సరసన ఆయనకు సమున్నత స్థానాన్ని సంపాదించిపెట్టినవి.

బి.నరసింగరావు 1946, డిసెంబరు 26న మెదక్ జిల్లా ప్రజ్ఞాపూర్‌లో భూస్వామ్య కుటుంబంలో పుట్టారు. ప్రజ్ఞాపూర్‌కి దగ్గర్లోని గజ్వేల్‌లో హైస్కూల్‌లో తొలుత చేరారు. కాగా 12 ఏండ్ల వయసులో తన పిన తండ్రి దత్తత తీసుకోవడంతో సికిందరాబాదు కు దగ్గరలోని ఆల్వాల్‌కి ఆయన మకాం మారింది. ఆల్వాల్‌లోనే హైస్కూలు పూర్తి చేశారు. అయితే తను పుట్టిన ఊరును విడిచినా– ఆ పల్లెటూరును, అక్కడి వాతావరణాన్ని మాత్రం మరువలేదు. నోట్లో బంగారు చెంచాతో పుట్టినా మట్టి వాసనల గుభాళింపులోని సౌందర్యాన్ని అన్వేషించడం మొదలుపెట్టారు. పల్లెటూరు బతుకుల, అందులోని అతుకులను, గతుకులను, సంఘర్షణలను నిశితంగా పరిశీలించడం చిన్నతనాన్నే అలవరుచుకున్నారు. మనుషుల జీవితాల్లోని అసమానతలు, ఆవేదనలు, మీదుమిక్కిలి స్త్రీల జీవితాల్లో కనిపించని కోణాలను అన్వేషించడం, ఆ తరువాత ఆయన తీసిన సినిమాల్లో కనిపిస్తుంది.

"పల్లె ఎంత అందంగా ఉంటుంది, దుమ్ము రేగే రోడ్లు, మేతకోసం వెళ్ళే పశువుల మందలు, చేత్తో కర్ర పట్టుకుని భుజం మీద గొంగడి వేసుకుని, ముంజేతికి వెండి కడియాలు తొడుక్కుని, పెదవుల నడుమ ఎర్రగా వెలిగే 'చుట్ట'ని కరచి పట్టుకుని, 'తృప్తి'కి మారు పేరుగా తన బతుకు పరిధులకు తానే మహారాజుగా" ...... ఇట్లా ఎన్నెన్నో తన పల్లె జ్ఞాపకాలు ఆయనను విడువలేదు. ఇంకా తను చూసి పదిలంగా దాచుకున్న పల్లె జీవన వైభవాన్ని ఒక సందర్భంలో ఇట్లా చెబుతారాయన.

"నిజంగా కూడా పెట్టి పుట్టాలి. అలాంటి అనుభవాలను పోగు చేసుకోవాలంటే రకరకాల ప్రజలు, సంప్రదాయమైన వారి వృత్తులూ, మదారీలు, తోలుబొమ్మలాటల కళాకారులు, జానపదాలు, వీధి నాటకాలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, ఫకీర్లు,

వీధుల్లో తిరుగుతూ అవీ ఇవీ అమ్ముకునేవారు....వీరందరినీ చూసి అనుభవించితేగాని తెలుస్తుంది వాటి గొప్పతనం. అదొక అచ్చమైన తెలంగాణా సాంస్కృతిక జీవనశైలి. ఏదో అలా, సాదా సీదాగా ఉండదు. పల్లెలో జరిగే ప్రతి పనికీ ఒక 'లయ' ఉంటుంది. కడవల్లో పెరుగు కవ్వంతో చిలికిన వెన్న తీయడమైనా, కల్లంలో వొడ్లు తూర్పారబట్టడమైనా, జొన్నలు విసుర్రాయిలో విసరడం, దంచడం, బట్టలుతకడం, బావుల్లో నీళ్ళు తోడడం, అన్ని పనులను ఆడవాళ్ళు ఆట పాటలతో అలసట తెలియకుండా, ఆనందంగా చేసే తీరుతెన్నులను కండ్లారా చూసితీరాల్సిందే."

బి.నరసింగరావు ఉన్నత కుటుంబంలో పుట్టినా ఆయనలో ఆధునిక అభ్యుదయ ప్రగతిశీల భావాలు పొడసుపడానికి కారణం ఆయన బాల్యమే. ఆ బాల్యం గురించి ఆయన మాటల్లోనే.......

"మా అమ్మకు మేము అయిదుమందిమి మొగ పిల్లలు, ఒక ఆడ కూతురు. మాది పెద్ద గడీ. నేను దొర బిడ్డను. 50 మంది జీత గాళ్ళు మావద్ద పనిచేసేవాళ్ళు. వందలు వందలుగా గొర్రెలు, మేకలు, పశువులు మాఇంట ఉండేవి. మా నాయన దొర అయినా ఆయన సంస్కారం గొప్పది. ఆయన ఆర్య సమాజంలో చురుకైన కార్యకర్త. అందువల్ల ప్రోగ్రెసివ్‌గా ఉండే వారు. మా గడీలో ఏ ఆంక్షలూ ఉండే వి కావు. మానాన్న అలా మంచం మీద పడుకునిఉ ంటేమాల, మాది గలు కూడా మా ఇంట్లో ఎంతో స్వంతంగా తిరుగులాడేవాళ్ళు.

మా అమ్మ కూడా మా నాయినకు తగిన ఇల్లాలే. నన్ను గడీలో ఎప్పుడూ బంధించలేదు. వేళకు నేను అన్నం తింటేచాలు. ఆ పని చేయకపోతే మాత్రం నన్ను దండించేది. ఆతర్వాత నా చిన్ననాటి తిరుగుళ్ళకి ఆమె ఎప్పుడూ అడ్డు తగిలేది కాదు. నేను పగలంతా వూరు తిరిగేవాణ్ణి. వూరంతా నాదిగానే వుండేది. కుమ్మరి మట్టి ముద్దను సారె మీద పెట్టి కుండ చేస్తూవుంటే– నేనాయన్ని బ్రహ్మ దేవుణ్ణి చూసినట్టు చూస్తూ ఉండిపోయేవాణ్ణి. కంసాలి నాగలి కర్రు కొలిమిలో నుంచి తీసి సమ్మెట దెబ్బ వేస్తూ ఉంటే ఆ రసరమ్య సంగీతంలో నేను ఓలలాడేవాణ్ణి. పద్మశాలి నేత, బ్రాహ్మల ఇళ్ళల్లో పూజలూ... అన్నీ నెను దిగ్భ్రమతో గమనించాను.

మాల మాదిగల ఇళ్ళలోకి వెళ్ళి వాళ్ళను తాకినా.. ఆకాలం 1952లో మా అమ్మ నాకు తలంటలేదు. మాఇంట్లో ఉదయం మాఅమ్మ స్వయంగా చల్ల చేసేది. వూర్లో ఎందరో వచ్చి మా ఆమ్మ చేత చల్ల పోయించుకునిపోయేవాళ్ళు. మాకు పండని పంట లేదు. పంటల కాలంలో మా గడీ యావత్తు వడ్లు, రాగులు, కందులు,పెసలు, అల్లం, వుల్లి, పసుపుతో...కళకళలాడిపోయేది. మిరప చేలో బంతిపూల మొక్కలు వేస్తాంకదా.. ఆ బంతిపూలు మాఇంట్లో ఒక కుప్పలా వుండేవి. ఇంటికి ఎవరొచ్చినా మాఅమ్మ చల్లపోసి, వారి దోసిట్లో బంతిపూలు కూడా పోసేది. మా ఇల్లు ఎప్పుడూ 'సోషల్ యాక్టివిటీ సెంటర్'లా ఉండేది.

పొలాలంతా నేనే తిరిగెవాణ్ణి. ఏ కాలంలో ఏ పంట ఎలా

బి. నరసింగరావుకి నార్త్‌ఈస్ట్ యువతను పరిచయం చేస్తున్న ఆనంద్ పట్‌వర్ధన్





ఉంటుందో నాకు తెలుసు. గాలీ వానకు తడిసిన – మిరప్పొందు రంగు ఎంత మిలమిలమంటుందో నాకు తెలుసు. నేను అదృష్టవంతుణ్ణి. మావూరికి కరంటు రానప్పుడు నేను 'బాల్యం' ఒక కావ్యంలా అనుభవించాను. విద్యుత్ దీపం స్విచ్ వేయగానే గదంతా ఒకేసారి వెలుతురు పరుచుకుంటుంది. మట్టి దీపం ఆలా కాదు. మట్టి దీపపు వెలుగులో ఒకరకం చీకటి కలగలసి ఉంటుంది. నా బాల్యం లాంతరు వెలుగులో గడిచింది. వత్తి చిమ్మే వెలుగులో ఒక ఇల్లు ఎలా వుంటుందో నాకు తెలుసు. 'దాసి' సినిమాలో ఈ అనుభవంతోనే 'లో లైట్ కండిషన్స్' ని చూపించాను.

12 ఏళ్ళ ప్రాయంలో నేను 'ఆల్వాల్' కొచ్చేసాను. మా చిన్నాన్న పెంపకానికి. ఇక్కడ నేను ఇమడలేక పోయాను. ఎప్పుడూ ఏదో ఒక 'తపన'తో ఉండేవాణ్ణి. మా చిన్నాన్న కోరుకున్నట్టుగా నేను పెరగలేకపొయ్యాను. ఎప్పుడూ ఆల్వాల్‌లో నాకు దిగులే. కళాత్మకంగా ఏదో చెయ్యాలన్న తపన. ఏం చేయాలో తెలిసేది కాదు. పిల్లల్లేక మా చిన్నాన్న– నేనేదో ఉద్ధరిస్తానని తెచ్చుకుంటే నేనిలా తయారయ్యాను. ఇల్లొదిలి వెళ్ళిపోదామను కున్నాను. మా అమ్మ అప్పుడప్పుడు వచ్చి నాకు బుద్ధిమాటలు చెప్పి నన్ను ఓదార్చేది.

అయినా నాకు ఆల్వాల్‌లో ఉండ బుద్ధేసేది కాదు. ఎప్పుడూ అగ్ని పర్వతంలా మండుతుండేవాణ్ణి. సిటీలోకొచ్చి ఎప్పుడూ నాటకాలూ.. స్నేహితులూ... రిహార్సల్సూ... ఇదే నా వ్యాపకం. ఆల్వాల్‌లో 'బాగుపడాలను కున్న'వాళ్ళు కాంట్రాక్టులూ అవీ చేసి బాగా గడించేవాళ్ళు. లేదా లా, డాక్టరు, ఇంజనీరు కోర్సులు చేసేవాళ్ళు. మనకవి నచ్చలేదు.

మా చినాన్నకు నా తీరు – మనస్తాపంగా ఉండేది. వ్యవసాయం చేయడు. చేయకపోగా, ఇప్పుడున్న వ్యవస్థే బాగాలేదు, దీన్ని మార్చాలి అంటాడు., అని కష్టపెట్టుకునేవాడు.

మా అమ్మ, నాయినలు నా చిన్నప్పుడు నాకిచ్చిన సంస్కారాన్ని జాగ్రత్తగా ఆల్వాల్‌లో కూడా కాపాడుకుంటూ వచ్చాను. కాబట్టే ఆల్వాల్‌లో నాకు మొదటి మిత్రుడు ముత్యాలే అయ్యాడు. అతను మాదిగ.

'లా'కోర్సు చేయకుండా నేను పెయింటింగ్ కోర్సులో చేరాను. ఆల్వాల్‌లో మా భూములవద్ద లకముక బావి ఉండేది. "పెయింటింగ్ కోర్సులో చేరావే! లకముక బావి దగ్గిర బొమ్మలు గీసుకుంటావా?" అని మా అమ్మ తమాష పడేది.

"ఆ కాలేజీలో ఆర్కిటెక్చర్ కూడా వుంది. కాబట్టి నేను పెద్ద ఆర్కిటెక్ట్‌నై కాంట్రాక్టులు చేస్తాలే" అని మావాళ్ళకు అబద్ధం చెప్పేవాణ్ణి. మా నాన్నకు కూడా నాటకాలు వేయడం ఇష్టం ఉండేది కాదు. "మన జీవనాధారం వ్యవసాయం. అది చెయ్" అనేవారు.

నా 17వ ఏట నాకు పెళ్ళయింది. 1968లో మానాన్న మావూళ్ళో ఒక నాటకం వేయించాడు. అప్పుడు మాత్రం "వాణ్ణి రమ్మనండి. వీళ్ళకి గైడ్ చేస్తాడు."అని నన్ను పిలిపించారు.

తర్వాత తర్వాత నేను 'దాసి', 'రంగుల కల', 'మాభూమి' సినిమాలు తీసి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నాను. ఒకసారి 'హిందూ'లో 1992లో అనుకుంటాను ఎవరో "హూ ఈజ్ ఆఫ్టర్ సత్యజిత్ రే?" అని వ్యాసం వ్రాస్తూ నా పేరు కూడా మెన్షన్ చేశారు. మానాన్న ఫ్రెండొకాయన దీన్ని చదివి, మా నాన్నను కౌగిలించుకుని, "నర్సన్నను కన్న నీ జన్మ ధన్యం." అన్నారు. అప్పుడు మానాన్న పడ్డ ఆనందం అంతా ఇంతా కాదు.

మా అమ్మ కూడా నా సినిమాలు అన్నీ చూసింది. ఆమె సినిమా చూస్తూ వుంటే, సినిమాను శ్రద్ధగా చూస్తున్న ఆమెను నేను చూస్తుండిపోయేవాడిని.

'దాసి' సినిమా చూసి అందులోని పరిస్థితులకు మా అమ్మ బాగా బాధపడింది.

నా చిన్నతనంలో ఒకసారి మేం హైదరాబాద్ ఎగ్జిబిషన్ కొచ్చాం. అక్కడ నేను తప్పిపోయాను. గంటపాటు మా అమ్మకు ఊపిరాడలేదు. "అప్పుడు నువ్వు నాకు మళ్ళీ దొరక్కపోతే నువ్వీ సినిమా తీసేవాడివా బిడ్డా!" అంది అమ్మ. మా అమ్మ నన్ను 'నర్సన్నా!' అని నోరారా పిలిచేది."

బి.నరసింగరావు సిరియస్ సినిమాలు తీయడానికి చిన్ననాట తనకున్న సినిమా అభిరుచే ప్రధాన కారణం. పదేళ్ళుకూడా నిండని వయసులో తండ్రివెంట తన అన్నతో కలిసి మొదటిసారిగా సినిమాకెళ్ళిన జ్ఞాపకం ఆయన మనసులో ఇంకా పదిలంగానే ఉంది. ఆలా ఆయన చూసిన మొదటి సినిమా 'మేనరికం' (1954). అదొక మధురమైన జ్ఞాపకం. విచిత్రమైన ఆలోచనలు ఆయనకు జన్మతహా వచ్చినవేమోగానీ వాటికి తన చుట్టూ ఉన్న సమాజం, అంటే ప్రకృతి, పశువులు అదొక ప్రపంచం. ఇంకా అనేక విషయాలు అతణ్ణి ప్రభావితం చేశాయి. ఎప్పుడో ఒక్కోసారి తండ్రివెంట హైదరాబాదు వచ్చి వెళ్ళడం జరిగేది. అయితే నగర వాతావరణం, జన జీవనశైలి తానున్న గ్రామీణ జీవనానికి భిన్నంగా కనిపించేవి. విచిత్రంగానూ, వింతగానూ అనిపించేవి. పల్లెకు, పట్నానికి చాలా వ్యత్యాసం కనిపించేది. అలా చిన్ననాటినుండి తన ఆలోచనల్లో భిన్న పార్శ్వాలుగా నిక్షిప్తమైన దృశ్యాల సమ్మేళనమే ఆ తరువాత ఆయన తీసిన "ది సిటీ", 'మా ఊరు', ఆకృతి డాక్యుమెంటరీలు.

మళ్ళీ నరసింగరావు చిన్ననాటి సినిమాలోచనలు, అనుభవాలలోకి వద్దాం. చిన్నప్పుడు వాళ్ళ తాలూకా కేంద్రంలో చిన్న తడకల సినిమా థియేటర్ ఒకటుండేది. అక్కడ చిన్న చిన్న సినిమా రీళ్ళు ముక్కలు కనిపిస్తే వాటన్నింటినీ పోగుచేసుకుని ఇంటికి తెచ్చుకున్నాడాయన. రీళ్ళలో అయిదు పది దృశ్యాలతో కూడినవి ఉండేవి. వాటిని ఎండలో పెట్టి చూస్తే ఒక బొమ్మ





**సినిమా చిత్రీకరణ సందర్భంలో: ఏ.కె.బీర్, కౌల్‌లతో బి. నరసింగరావు**

తరువాత మరొక బొమ్మ అట్ల చాలా బొమ్మలు కనిపించేవి. అవన్నీ పాజిటివ్ ఇమేజెస్. ఈ ఏరిన ముక్కలను ఒక వరుస క్రమంలో చేర్చి సినిమా టాకీస్‌లో వేస్తే అది ఒక చలన చిత్రంగా అనిపిస్తుందని చిన్నతనంలోనే అర్థం చేసుకున్నారు. ఇలా దొరికినవాటిని ఆయన భద్రంగా దాచుకోవడమేగాదు, కొన్ని ఫిలింస్ట్రిప్స్ దుకాణాలలో అమ్మేవారు. వాటినీ కొని దాచుకునేవారు. అప్పుడప్పుడు హైదరాబాదు నుండి తన అన్నయ్య కూడా కొన్ని సినిమా రీళ్ళ స్ట్రిప్స్ తెచ్చి బి.ఎన్.కి ఇచ్చేవారు. చిన్నతనం నుండీ ఎన్ని వీలైతే అన్ని సేకరించుకుని వీలున్నపుడల్లా వాటిని వెలుతురుకుపెట్టి చూసేవారు. అది ఆయనకొక హాబీ. అలా చూస్తూ ఎంత ఆనందపడేవాడో ఆయన మాటల్లో తెలుస్తుంది. ఆ చిన్నతనాన సినిమా అన్న ఒక వింతదైన విచిత్రమైన అనుభూతి కలిగిందాయనకు. ఆ పసితనాన ఆయన మనసులోపల మరువలేని జ్ఞాపకాలైనవి ఆ సినిమా రీళ్ళు. దీంతోబాటు ఆయన అన్నగారు సిటీ వెళ్లి వచ్చిన ప్రతిసారీ సినిమారీళ్ళతోబాటు సినిమా బ్రోచర్లు, ఫోటోలు, పాటల పుస్తకాలు, సినిమా పాటల రికార్డులు సినిమా ప్రపంచాన్ని తెచ్చే తన లేత హృదయానికి చేరువచేసినవి.

సెలవుల్లో ఆయితే బాల నరసింగరావు అన్న అట్టముక్కలు జతచేసి ఒక చిన్న సినిమా టాకీసులాంటిది చేసి ఇచ్చేవాడు. సినిమా కరపత్రాలను కత్తిరించి వాటిని బానర్స్‌లా, పోస్టర్స్‌లాగ అతికించేవారు. అట్ల తాను అట్టలతో నిర్మించిన సినిమా హాల్‌ను చూసి మురిసిపోయేవారు. తమ ఇంట్లో ఒక పక్కగా ఉన్న రూమ్‌లో తోటి పిల్లలతో ఆడుకుంటు న్నపుడు ఒక కన్నంలోంచి సూర్యకాంతి గదిలోకి రావడానికి అనుకూలంగా ఉండేది. ఆ గదిలోనే తలుపులు వేసిన తరువాత కిటికీ రంధ్రం గుండా వెలుతురు పడటాన్ని గమనించి దానికి అడ్డంగా ఒక ఫిలిమ్‌స్టిప్‌ని పెట్టేవాడు. అపుడు ఆ రీలులోని దృశ్యం ఎదురుగా ఉన్న గోడమీద ప్రాజెక్ట్ అయ్యేది. అదొక చిత్రమైన అచ్చెరువొందే అనుభూతి అయనకు. అట్లా ఎన్ని గంటలపాటు సినిమా దృశ్యాలు చూస్తూ గడిపేవారో పిచ్చిగా. ఆ తరువాత ఒక భూతద్దాన్ని తెచ్చి వెలుతురు అడ్డంగా పెట్టి రీలును ముందుగా పెడితే పెద్ద సినిమా దృశ్యం గోడమీద పడింది. వారి సినీ శోధనలో అదొక గొప్ప విషయంగా ఉప్పొంగిపోయేవారు. ముందుగా బొమ్మ తలకిందులుగా పడింది. ఆశ్చర్యపోయి వెంటనే తలకిందులుగా ఉంచితే బొమ్మ సవ్యంగా పడింది. దీంతో ఫిలింఫ్రేమ్ ఉల్టా పెడితే బొమ్మ ఆనేది సీదాగా పడుతుందని అర్థమైపోయింది. గోడ చదునుగా లేకపోవడంతో తండ్రిగారి తెల్లని సెల్లా తెచ్చి గోడకు ఆనించడంతో సినిమా బొమ్మ తెరపై కనిపించినంత అనుభూతి కలిగింది. తనకు తెలయకుండానే తాను సినిమా బొమ్మలను తెరపై వేయగలిగిన ప్రతిభను సాధించాననే భావన ఆయనలో చోటుచేసుకుంది.

సినిమాలు గ్రామాలకు పాకని ఆరోజుల్లో బి.ఎన్. కి ఇదే తన సినిమా ప్రపంచం అయింది. చుట్టుప్రక్కల పిల్లల్ని, తన వయసువారినే కాదు చిన్నపిల్లలను కూడా పిలిచి ఒకచోట కూర్చోబెట్టి వాళ్ళకి ఈ బొమ్మలతో కూడిన స్క్రీనింగ్ చేసేవారు. వాళ్ళందరికీ అదొక సంబరం. అందరికీ ఇది నిత్యకృత్యం అయిపోయింది. అలా ఆడి పాడే పసి వయసులోనే ఒక సినిమా ప్రదర్శన విధానాన్ని ఆకళింపు చేసుకుని ఆవిష్కరించారు బి.ఎన్. ఆ చిన్నతనంలోనే ఆయన మెదడులో కదిలే బొమ్మల సంగతులు స్థిరపడిపోయాయి. మొదలు – సినిమా అన్నా, దాని విషయాలన్నా, సినిమాతో ముడిపడిన నటన, సంగీతం, ఫిల్మ్ పరిజ్ఞానం మొదలైనవన్నీ అతనికి ఇష్టమైన అభిరుచులైనవి.

1970లో బి. నర్సింగరావుకి జి.రవీంద్రనాథ్ అనే ఒక మిత్రుడు పరిచయమయ్యాడు. ఆయన ఇంజనీరింగ్ చదువు తున్నాడు. ఆయన అభ్యుదయ భావాలు నిండిన వ్యక్తి. ఆ పరిచయమే నర్సింగరావు కళా జీవితాన్ని మలుపు తిప్పిందని చెప్పాలి. ఆ తరువాత వాళ్ళు మళ్ళీ ఏడేళ్ళపాటు కలుసుకోలేదు. 1977లో మళ్ళీ కలుసుకున్నారు. ఆ సమయంలో మృణాల్ సేన్‌తో జి.రవీంద్రనాథ్ 'ఒక వూరి కథ', సినిమాకు పనిచేస్తున్నాడు. అప్పటికే రవీంద్రనాథ్ మృణాల్ దా 'మృగయా' అనే హిందీ చిత్ర నిర్మాణంలో పాలుపంచుకుని ఉన్నారు. ఈసారి కల్సుకున్నపుడు పలకరింపుల తరువాత బి.ఎన్.ని ఏం చేస్తున్నావు అని అడిగారు. ఆ రోజుల్లో స్థిరపడాలని బి.నరసింగరావు సరైన వేదిక, అవకాశం కోసం చూస్తున్నారు. అదే విషయం రవీంద్రనాథ్ గారితో చెప్పారు. దాంతో 'ఒక వూరి కథ' తరువాత మనం ఇద్దరం కలసి సినిమా నిర్మాణం చేపడదాం అన్నారాయన. అక్కడ బి.ఎన్. సినిమా ప్రయాణానికి తొలి అడుగు పడింది. ఈ నిర్ణయానికి ముందు జన నాట్య మండలి కార్యకర్తగా ఆయన నిర్వహించిన భూమిక వల్ల ఎమర్జెన్సీ రోజుల్లో రహస్య జీవితం గడపవలసిన పరిస్థితులు ఏర్పడినవి. ఆయన జీవితంలోకి ప్రవేశించిన కళలు, సంఘర్షణలు అన్నీ కూడా ఆ తరువాత ఆయన తీసిన సినిమాల్లో ప్రతిబింబిస్తవి.

భారతదేశంలో నవ్య సినిమా ప్రభావం క్రమంగా మరాఠి, ఒరియా, అస్సామి రంగాలకు పాకినా దక్షిణాదిని తాకింది 1970 ప్రారంభంలో. అదీ మలయాళ రంగాన్ని. అప్పటికే రామూ కారియత్ వంటివారు 'నీలక్కుయిల్' (1954), 'చెమ్మీన్' (65), పి.రాందాస్ 'న్యూస్‌పేపర్ బాయ్' (1954) వంటి ఆలోచనాత్మక చిత్రాలు మలయాళంలో వచ్చినవి. అయితే ఆదూర్ గోపాల కృష్ణన్ మలయాళ చిత్రరంగ ప్రవేశం మలయాళ సినిమా రంగాన్ని మహత్తరమైన మలుపు తిప్పింది. 1972లో 'స్వయంవరం' సినిమా తీసి జాతీయ స్థాయిలో ఏకంగా నాలుగు అవార్డులు పొంది సంచలనం సృష్టించారు. ఈయన కోవలోనే అరవిందన్ వచ్చి 'ఉత్తరాయణం' తీశారు.

వీటన్నింటి ప్రభావం మద్రాసును తాకలేదు కానీ

**ఏ.కె.బీర్‌తో.. బి. నరసింగరావు**





'రంగుల కల' చిత్రంలో బి. నరసింగరావు

హైదరాబాదును తాకినవి. అది సికిందరాబాదు ఆల్వాల్‌లో పుట్టి పెరిగిన 'శ్యాం బెనగల్'ని ప్రభావితం చేశాయి.

అప్పటివరకూ వాణిజ్య ప్రకటనలు రూపొందించిన శ్యాంబెనగల్ అచ్చు తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, 'అంకుర్' సినిమాగా 1974లో తీశారు. తెలంగాణలోని భూస్వాముల దౌర్జన్యాలు, స్త్రీలపట్ల అమానవీయంగా ప్రవర్తించే తీరుకు దృశ్యరూపం ఇస్తూ ఈ సినిమా తీశారాయన. జాతీయస్థాయిలో అది ఉత్తమ చిత్రం, ఉత్తమ నటీ నటుల అవార్డులను సాధించింది. అట్లా సమాంతర సినిమాకు హైదరాబాదు తొలి బీజం వేసింది. శ్యాంబెనగల్ తెలంగాణ గడీల దొరల కథతో 'నిశాంత్' తీశారు.

సరిగ్గా ఇదే కాలంలో వరంగల్‌కు చెందిన, టి.మాధవరావు దాశరథి రంగాచార్య రాసిన 'చిల్లర దేవుళ్ళు నవలను అదే పేరుతో తెరకెక్కించారు. ప్రయత్నం మెచ్చుకోదగినదే అయినా ఫిలిం మేకింగ్ సరిగ్గా లేకపోవడంతో ఫెయిలయింది. కానీ తెలంగాణ భాష, యాస, కథతో తెలుగులో తయారైన తొలి చిత్రంగా "చిల్లర దేవుళ్ళు' (1977) చరిత్రకెక్కింది. ఇటు డైబ్బైల్లో తెలుగు సినిమా పతన దశకు చేరుకున్నది. అగ్ర హీరోలుగా ఉన్న ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు స్టెప్పులు, ఫైట్లు చేస్తూ కొత్తతరంతో పోటీపడుతూ ఉంటే సినిమా రంగం సంక్షోభిత కాలంలోకి వెళ్ళిపోయిన పరిస్థితి అది. సరిగ్గా ఈ సమయంలోనే సికింద్రాబాద్ అల్వాల్‌కే చెందిన బి.నరసింగరావు సినీరంగ ప్రవేశం జరిగింది.

సహజసిద్ధమైన ప్రకృతి మనిషే ఆ తరువాత బి.నరసింగరావు సృజనకు కథా వస్తువులైనవి. ఆయనకు చిన్నతనం నుండి చిత్రకళ అంటే అభిమానం ఏర్పడింది. పి.యు.సి. పూర్తవగానే హైదరాబాదులోని గవర్నమెంట్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో పెయింటింగ్‌లో డిప్లొమా కోర్సులో చేరారు. తన అభిరుచులన్నింటికీ చిత్రకళ వేదికైంది. సంగీతం, రంగస్థలం, కవిత్వం, జానపదాలు, పల్లె జీవన సంస్కృతులన్నింటినీ తన చిత్రకళలో ప్రతిబింబింప జేయడం మొదలుపెట్టారు. తన భావనాత్మక ప్రపంచంలోని ఎన్నో నైరూప్య భావాలకు దృశ్యరూపం కల్పించారాయన.

ఈ విధంగా బి.ఎన్.కి చిత్రకళ మొదటి ప్రాధాన్యంలో ఉండింది. 1971లో హైదరాబాదులోని కళాభవన్‌లో తొలి స్వతంత్ర చిత్రకళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆ తరువాత ముంబై తాజ్ ఆర్ట్ గ్యాలరీలో 'కన్‌స్టర్ ఇన్ కలర్స్' పేరున మరో 'వన్‌మాన్ షో' ని 1997లో నిర్వహించారు.

డాయిరా ఆర్ట్ గ్యాలరీలో (2006) మరో సోలో, ఇంకా ఆక్సిస్ (1994), గ్రాండ్ కాకతీయ హైదరాబాదులో (2005), హైదరాబాదు ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో 2011, 2015లో ఇంకా శిల్పారామం, సాలార్జంగ్ మ్యూజియంలో మిత్రులతోపాటు తన చిత్రకళా ప్రదర్శనలను నిర్వహించారు.

నర్సింగరావు కళాజీవన ప్రవాదులు ఆయనలోని రచయిత, కవిలో ఉన్నవి. 1966లో ఔత్సాహిక రచయితలు, కవులు, కళాకారుల సమ్మేళనంగా 'ఆర్ట్ లవర్స్' అనే సంస్థనొకదానిని ప్రారంభించారు. 'ఆర్ట్ లవర్స్' సంస్థ జననాట్యమండలిగా మారి నాటి ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నాటకాలు, పాటలు, ప్రజా కళారూపాలను ప్రదర్శించింది. 1972లో గుమ్మడి విఠల్ 'గద్దర్' గా మారి ఈ జన నాట్యమండలిలో కీలక పాత్ర పోషించారు. భూపాల్ రెడ్డి నటుడుగా, రచయితగా పనిచేశారు. ఈ సంస్థలో బి.యన్ చాలా నాటకాలు, పాటలు, స్క్రిప్టులు రాయడమే గాక ఆర్టిస్టులకు మేకప్ చేయడం, సంగీతం, డైరెక్షన్ నిర్వహణా బాధ్యతలెన్నో నిర్వహించారు. వర్గస్ కలం పేరుతో పాటలు రాశారు. ముత్యాల సరాల మాదిరి 'ఇంద్రవెల్లి అడవుల గురించి 'టేకూ వనమూలోన ఆకులూగినాయి' వంటి చరణాలున్న పాటలు చాలా రాశారు.

ఆయన రచనలో 'కొత్త మనిషి' (1973) ఒగ్గు కథ, 'రైతు కూలీ విజయం' (1974) బుర్రకథ, ఒగ్గుకథ, జముకుల కథ మూడు ప్రక్రియల్లోనూ, క్షమ(1969), సమాధి, అసావేరి (1971), బీదలపాట్లు(1972) వంటి నాటకాలు, 'జననం' (1978), రంగులు రాగాలు(1997), రసరూప (1999), అనూహ్య, అద్దం, సృష్టి, గ్రహణం వంటి కావ్యాలు వెలువరించారు. ఇంకా నాటకరంగంపై రాసిన వ్యాసాలను 'వర్గీస్ వ్యాసాలు', పాటలను 'వర్గీస్ పాటలు' పేరున వెలువరించారు. ఇంకా ఇవేగాకుండా ఇతరులవి 20 పుస్తకాల వరకూ వీరి సంపాదకత్వంలో వెలువడినవి. వీటిలో 'ఆర్ట్ ఎట్ తెలంగాణ' 'గాడెస్ ఆఫ్ ఫోక్', కాఫీ టేబుల్ బుక్స్ తెలంగాణ లోని చిత్ర కళా చరిత్రపై, సమ్మక్క సారలమ్మ జాతరపై వెలువడిన పుస్తకాలు చాలా ప్రఖ్యాతిగాంచాయి.

**మాభూమి :**

**వెండితెరపై తెలంగాణ మట్టివాసనల ఆవిష్కరణ**

మా భూమి సినిమా 1980లో వచ్చినా దాని నిర్మాణ ప్రయత్నాలు 1977లోనే మొదలైనవి. అయితే 'ఒక వూరి కథ' విడుదలై పరాజయంపాలైంది. కానీ తెలంగాణలో సినిమా రంగానికి మాత్రం ఊతమిచ్చింది. దీని ఫలితం ఎలా ఉన్నా మళ్ళీ మృణాల్ సేన్ తో తమ సినిమాను దర్శకత్వం చేయించాలని రవీంద్రనాథ్-బి.నరసింగరావులు అనుకున్నారు. అనుకున్నట్లుగానే ఇద్దరూ వెళ్ళి మద్రాసులో ఉన్న మృణాల్‌సేన్‌ను అడిగారు. ఆయన బడ్జెట్ ఎంతపెడతారని అడిగితే నరసింగరావు తను అనుకున్న బడ్జెట్ చెప్పారు. ఆయన దృష్టిలో అది చాలా చిన్న బడ్జెట్ అనిపించడంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత తక్కువ బడ్జెట్‌లో నేను సినిమా తీసిపెట్టలేనని చెప్పారు. అయితే మళ్ళీ ఆయనే మీకు సరిపోయె దర్శకుడు బెంగాల్‌లో ఒకడున్నాడు. అతనిప్పటికే డాక్యుమెంటరీలు తీసి మంచి పేరు తెచ్చుకున్నాడని గౌతంఘోష్ పేరును

'మాభూమి' చిత్రంలో సాయిచంద్





'మాభూమి' చిత్రంలో గద్దర్‌తో బి. నరసింగరావు

సూచించారు. గౌతంఘోష్ అప్పటికే 'హంగ్రీ ఆటమ్', 'ది న్యూ ఎర్త్' డాక్యుమెంటరీలు తీసి జాతీయ స్థాయిలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు, ప్రశంసలు అందుకున్న యువ దర్శకుడు. మృణాల్‌సేన్ సలహా మేరకు 'మాభూమి' సినిమా కోసం దర్శకుడిని ఎంపిక చేయడానికి నరసింగరావు–రవీంద్రనాథ్‌ల బృందం కలకత్తా వెళ్ళింది. అదే రోజుల్లో అక్కడ జరిగిన ఒక సినిమా కార్యక్రమంలో వీరు కూడా వెళ్ళి పాల్గొన్నారు. ముందు వరుసలో సీటు ఒకటి ఖాళీగా ఉంటే నర్సింగరావు వెళ్ళి కూర్చున్నారు. కొద్దిసేపటి తర్వాత పక్కకు తిరిగి చూస్తే ఆయనప్రక్క విశ్వ విఖ్యాత దర్శకుడు 'సత్యజిత్‌రాయ్'. ఆశ్చర్యపోవడం బి.ఎన్. వంతయింది. బి.ఎన్.కు అదొక అనిర్వచనీయ అనుభవం. పరస్పర నమస్కార ప్రతి నమస్కారాలు జరిగినవి. అంతే! కానీ ఆ తరువాత చారిత్రక సందర్భానికి ఇక్కడే బీజాపన జరిగిందని అప్పట్లో బి.నరసింగరావు ఊహించి ఉండలేదు.

తెలుగు సినిమా రంగంలో 1970లో మొదలైన పతనదశ 1980 నాటికి క్రమంగా తన ఆధిపత్యాన్ని పెంచుకుంటున్న సమయం అది. తెరనిండా హత్యలు, దోపిడీలు వికృత నృత్యాలు, ద్వంద్వార్థాల పాటలు ఆ తరానికి చెడుపు చేసే కథలు, విలయతాండవం చేస్తున్న కాలమది. అప్పటి దాకా (1970) కాల్పనిక కథలే అయినా సమాజానికి చెరుపు చేయని చిత్రీకరణ కొంత ఉండేది. సంగీత, సాహిత్యాల విలువల గురించి కొద్దిగా బాధ్యతలుండేవి. కానీ ఆ తరువాత అవన్నీ సినిమాకు అంటరానివైనవి. ఇలాంటి తరుణంలో ఒక కొత్త ప్రత్యామ్నాయాన్ని, విభిన్నతను ఇంకా చెప్పాలంటే ఒక వాస్తవిక సమాజాన్ని తెరకెక్కించాలని ప్రజలు తమ కోసం చేసిన ఒక మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని దృశ్యమానం చేస్తూ కొందరు ఔత్సాహిక ప్రగతిశీల వాదులు చేసిన అపూర్వ ప్రయత్నమే 'మా భూమి' సినిమా.

గౌతంఘోష్ సినిమా తీయడానికి ఒప్పుకున్నాడు. అయితే కథ ఏమిటనే చర్చ మొదలైంది. తెలంగాణ ఇతివృత్తంగా ఉండాలన్నది మొదటి ప్రాధాన్యం. దాంతో కిషన్ చందర్ ఉర్దూలో రాసిన 'జబ్ ఖేత్ జాగే' నవలను సినిమాగా తీయడానికి నిర్ణయమైంది. ఈ నవల అప్పటికే 'జైత్రయాత్ర' పేరుతో తెలుగులోకి అనువాదమైంది. దీనికి కింద ట్యాగ్‌లైన్ 'పొలాలు మేల్కొన్నప్పుడు". హిందీలో కొంత ప్రవేశం ఉన్న గౌతంఘోష్ 'జబ్ ఖేత్ జాగే' నవల ఆధారంగా ఒక స్క్రీన్‌ప్లే రాసుకుని హైదరాబాదు వచ్చారు.

"అయితే ఆయన తయారుచేసిన స్క్రిప్టు మాకు నచ్చలేదు. తెలంగాణలో చోటుచేసుకున్న సంఘటనల గురించి 'మగ్దూం మొయినుద్దీన్ చెప్పిన విషయాల ఆధారంగానే కిషన్ చందర్ 'జబ్ ఖేత్ జాగే' నవలను రాశారు. ఆ నవలలోని కొన్ని విషయాలు

అశాస్త్రీయంగా అనిపిస్తాయి. గౌతం బెంగాలీ కావడం తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర గురించి తెలియనివాడవటంతో ఆ నవలలో ఉన్న అంశాల ఆధారంగానే తన స్క్రిప్టు తయారు చేసుకున్నాడు. అందుకే మేం ఆ స్క్రిప్టును ప్రక్కనపెట్టి అందరం కలిసి తెలంగాణలో సాయుధ పోరాటం జరిగిన కొన్ని ప్రాంతాలలో తిరగాలని నిర్ణయించుకున్నాం. అనుకున్నట్లు గానే సూర్యాపేట, బైరాన్‌పల్లి, బాలముల, కడవెండి, నల్గొండ, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలు తిరిగాం. తెలంగాణ పోరాటంలో పాల్గొన్న వాళ్ళని ప్రత్యక్షంగా కలుసుకుని వాళ్ళ అనుభవాలను తెలుసుకున్నాం. వీటికితోడు లైబ్రరీల్లో 1940 ల నాటి మీజాన్ డెక్కన్ క్రానికల్, గోల్కొండ పత్రికల్ని తిరగేశాం. సాయుధ పోరాటంపై నాయకులు, రచయితలు రాసిన పుస్తకాలు సేకరించాము. ఫోటోల్ని సేకరించాము. సమాచార సేకరణ పూర్తయ్యాక నేను, గౌతం, పార్థా బెనర్జీ, ప్రాణ్‌రావు కూర్చుని స్క్రిప్టు సిద్ధం చేశాం. గ్రామీణ జీవితంలో అనుభవజ్ఞుడైన లక్ష్మారెడ్డిని పిలిపించి స్క్రిప్టులో అశాస్త్రీయమైనవి ఏవైనా ఉంటే చెప్పమని సలహాలు తీసుకుని ఫైనల్ స్క్రిప్టు సిద్ధం చేశాం" అంటారు బి.ఎన్.

సినిమా అంతా 1940ల నాటి వాతావరణం ప్రతిబింబించాలి. తెలంగాణ పల్లె జీవనం ఎట్ల ఉంటదోనన్నది కనిపించాలి. అందుకు నర్సింగరావు, గౌతంఘోష్ బృందం అంతా ఊర్లల్లోకి తెల్లవారుతుండగానే వెళ్ళి ప్రజల ఇండ్లముందు కాపలా కాసేవారు. లేస్తూనే వారి దినచర్య ఎట్లా ఉంటది, స్త్రీలు ఎలాంటి పనులు చేస్తారు, జనాల కట్టు, బొట్టు, ఆహార్యం, అలవాట్లు, వాచికం అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వీటన్నింటి వెనుక ఉన్నది బి.నరసింగరావే. ఇంకా మా భూమిలో ఉపయోగించడానికి ఎలాంటి పాటలుండాలి, బుర్రకథ, పీర్ల పండుగ, దూలా, పోచమ్మ పండుగ, వరినాట్ల పాట, "బండెనక బండి కట్టి" పాట, "పల్లెటూరి పిల్లగాడ" పాట మొ॥ ఇంకా వాటికి సంబంధించిన ట్యూన్లు అన్ని కూడా బి.నర్సింగరావు ఎంపిక చేసినవే. లొకేషన్‌లో అప్పటికప్పుడు డైలాగ్‌లు రాసి షూటింగ్ చేయడంవల్ల సినిమాలో సహజత్వం వచ్చి చేరింది. పెద్ద మనుషులంతా ఒకచోట కూర్చుని వ్యూహ రచన చేసేటప్పుడు మాట్లాడుకునే మాటలు "పెద్దమనిషి తరీఖానేనా ఇది" అని అనడంవంటివి గ్రామీణ సంభాషణలను పట్టిచూపుతవి.

సినిమా షూటింగ్ హైదరాబాదులోని సారథి స్టూడియోస్, పురానాపూల్, హైకోర్టు పరిసరాలు, సిటీ కాలేజి, జూబ్లీహిల్స్, గాంధీనగర్‌లోని పైపుల ఫ్యాక్టరీ, వనస్థలిపురంలోని నయాఖిల్లా, పాతబస్తీలోని జహనుమా, ఖజానా తదితర ప్రాంతాలతోబాటు యాప్రాల్, అల్లీపూర్, దొంతి, నర్సాపూర్ ఫారెస్టు, మంగళపర్తి, మెదక్ లో జరిగింది.

పాత్రధారుల కాస్ట్యూమ్స్ చార్మినార్ ఏరియాలో కొనుగోలు చేశారు. వీటితోబాటు పోలీసుల టోపీలు, డ్రెస్‌లు, బూట్లు, బాడ్జెస్‌లన్నింటినీ కాలానుగుణంగా ప్రత్యేకంగా సంపాయించారు.

**'మాభూమి' చిత్రంలో ప్రసాదరావు, ప్రదీప్ శక్తి ఇతరులు.. (కుడి నుండి ఎడమకు)**





'మాభూమి' చిత్రంలో కాకరాల, సాయిచంద్

ఈ ప్రయత్నాల, ప్రయాసల వెనుక పూర్తిగా బి.నర్సింగరావు పాత్రనే ఉంది.

ఇక్కడ 'మాభూమి' విషయంలో రచయితగా, నిర్మాతగా, సహాయ దర్శకుడుగా బి.నరసింగరావు పూర్తిస్థాయిలో పనిచేసి తాను గతంలో నాటకరంగంలో పొందిన అనుభవాన్ని ఆ సినిమాలో ఆచరణలో చూపించాడు. మా భూమిలో తానెంత కీలకమైన భూమికను పోషించినా ఆ ఘనత అంతా గౌతం ఘోష్‌కి చెందు తుందనంటారు సిన్సియర్‌గా బి.యన్.

సినిమా షూటింగ్ మొదలైంది. మెదక్ జిల్లాలోని మంగళపర్తి, దొంతి, దౌల్తాబాదు గ్రామాలతో బాటు మెదక్‌లో సుమారు 50 రోజుల పాటు మా భూమి చిత్రీకరణ జరుపుకున్నది. ప్రధానపాత్రధారులు విడిగా కనిపించకుండా జనంలో ఒకరుగా కనిపించడం చిత్రీకరణలోని ప్రత్యేకత. గ్రామస్తులుగా నటించినా వారిలో చాలా మటుకు నిజమైన ఊరి జనమే నటించారు. కేవలం 5.5లక్షల చిన్న బడ్జెట్‌లో భారీ కాన్సెప్ట్‌తో నిర్మించిన సినిమా మాభూమి. దొరల మీద దాడి లాంటి సీన్లలో నటించడం కాదు అంతా జీవించారు. 'దొంతి'లో గడిని ముట్టడించే సీన్ తీసే నాటికి వాళ్లేమనుకున్నారో గాని ఆ సీన్ తీయడానికి ఒప్పుకోలేదు. అనుమతి లేకుండానే జనం ఆగ్రహంతో ఉరికి వస్తుంటే సెట్ చేసుకున్న కెమెరాలతో జనం గడి తలుపులు తోసుకొని ముందుకెళ్ళే షాట్‌ను చిత్రీకరించారు. చిత్రీకరణలో చారిత్రక సంఘటనలు చూపిం చేటప్పుడు అప్పటి వార్తా పత్రికలు లైబ్రరీ షాట్స్‌ని వాడటంతో సినిమా స్థాయి మరింత పెరిగింది.

సినిమా అంతా మూడు షెడ్యూల్స్‌లో పూర్తయింది. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ గౌతాఘోష్ చేశాడు. పాటలన్నీ హైదరాబాదులోని జర్మన్ లైబ్రరీలో రికార్డు చేశారు. సినిమా పూర్తయి సెన్సార్‌కి వెళ్లింది. ఏమవుతుందోననే భయం. కానీ సెన్సార్ సభ్యులు నిర్మాతలను లోపలకు పిలిచి అభినందించి సర్టిఫికెట్ ఇచ్చారు. విడుదల చేయడానికి డిస్ట్రిబ్యూటర్స్ ఎవరూ ముందుకు రాలేదు చూసిన వారంతా ఇదేదో రాజకీయ పాఠాలు చెప్పినట్లుగా ఉందని వెనక్కి వెళ్లిపోయారు. చివరికి లక్ష్మీ ఫిలింస్, శ్రీతారకరామా ఫిలింస్ వారు రిలీజ్ చేశారు. ఆ రోజు 1980 మార్చి 23. విడుదలైన చోటల్లా హౌస్‌ఫుల్. టికెట్స్ దొరక్క థియేటర్ల వద్ద జనం గుంపులు గుంపులుగా వెనక్కి వెళ్ళిపోయారు. థియేటర్లు ఈలలు డ్యాన్సులతో మారు మ్రోగినవి. అదో గొప్ప చరిత్రాత్మక విజయం. ప్రజలు ఇండియన్ ఆర్మీ దళాలపై పోరాటం చేసిన చారిత్రక వాస్తవాన్ని దృశ్యమానం చేసిన ఏకైక చిత్రం మాభూమినే. ఇందులోని పాత్రలన్నీ సహజమైన గ్రామీణ భాషలో, ముస్లిం పాత్రలు హైదరాబాదీ ఉర్దూలో మాట్లాడుతై. ఈ సినిమా రాకతో తెలుగు సినిమాకు మంచి రోజులు రానున్నాయని పత్రికలు రాశాయి.

"మాభూమి"లోని ఒక్కో ఎపిసోడ్‌లో ఒక్కో సినిమా ఉంది. ఆ సినిమా ఏడాది పాటు ఏకబిగిన ఆడింది. స్వర్ణోత్సవాలు జరుపుకుంది. ద్వితీయ ఉత్తమ చిత్రం, స్క్రీన్‌ప్లేకు నంది అవార్డులు అందుకున్న మాభూమి ఇండియన్ పనోరమాకు ఎంపికైంది. రాజకీయ కారణాల వల్ల జాతీయ అవార్డు రాలేదు. ఫిలింఫేర్, సిని హెరాల్డ్ అవార్డులతో బాటు ట్రివెంద్రమ్, కార్లీ వివరీ, కైరో, సిడ్నీ, తాష్కెండ్ ఫిలింఫెస్టివల్స్‌లో ప్రదర్శితమైంది. ఏ విధంగా చూసినా వెండి తెరపై తెలంగాణ మట్టి వాసనకు దృశ్యరూపం ఇచ్చిన సినిమా 'మాభూమి'. ప్రజల పోరాటానికి, ఆ చరిత్రకు, సాంస్కృతికి, భాషకు సినిమా ప్రతీక 'మాభూమి'. ఒకనాటి తెలంగాణ సాయుధ పోరాటానికి సహజమైన నలుపు తెలుపులో అద్భుత ఆవిష్కరణ 'మాభూమి'.

**చిత్ర నిర్మాతల్లో ఒకరైన రవీంద్రనాథ్ ఏమంటారంటే**

**"మాభూమి' ప్రజల సినిమా:** జీవితంలో నేనేమైనా మంచిపని చేశానంటే అది 'మాభూమి' సినిమా తీయడమే. 'మాభూమి' తీసిన ఆ రెండేళ్ళు ఒక యజ్ఞంలా భావించాను. రెండో పనిలేదు. ఎందరో ఈ మహాయజ్ఞంలో తోడ్పడ్డారు. ముఖ్యంగా నా భార్య. సినిమా విడుదలైన మూడోరోజు ఆదివారం. మాకు యజ్ఞఫలం దక్కింది. సుదర్శన్ టాకీస్‌లో టిక్కెట్ల కోసం పెద్ద దాడే జరిగింది. అది చూసి ఇంతమంది జనం మా సినిమా కోసం వచ్చారా అన్న ఆనందం ఒకవైపు. అలాగే ఆరోజు పొందిన ఆనందం జీవితంలో మరువలేను. సినిమా అంతగా సక్సెస్ అవుతుందని ఊహించి ఉండలేదు. ఏదో సినిమా తీయాలనుకున్నాం. చేశాం. కానీ నేనొక్కడినే 'మాభూమి' అపూర్వ విజయం సాధిస్తుందని నమ్మాను. ఎందుకంటే ప్రజలకు మనం కావలసింది ఇస్తే వాళ్ళు మనకు ఆదరణ రూపంలో తిరిగి ఇస్తారని నమ్మినవాణ్ణి. అది అక్షరాలా నిజమైంది.

సినిమా తీసినంత కాలం ఏరోజుకారోజు డబ్బులు వెతుక్కుని సెట్స్ మీదికి వెళ్ళేవాళ్ళం. ఇందుకు అమ్మవలసినవన్నీ అమ్మేశాను, కుదువ పెట్టాల్సినవన్నీ కుదువపెట్టేశాను. సినిమా పూర్తయింది. సెన్సార్ చేయించాలి. చివరికి భద్రంగా దాచుకున్న వెడ్డింగ్ రింగ్స్ కూడా కుదువ పెట్టేశాను. (గుర్తుందా భూపాల్?). వచ్చిన 700/- రూపాయలతో సెన్సార్ చేయించాము. అవన్నీ తలచుకుంటే భావోద్వేగం తన్నుకువస్తోంది. ఎంతోమందిమి కలిసి పనిచేశాం. వారంతా హృదయపూర్వకంగా పనిచేశారు. అందరూ తమదైన పాత్ర పోషించారు. తక్కువ, ఎక్కువ అని లేదు. సమిష్టి కృషి ఫలితమే 'మాభూమి'. 'మా భూమి' ప్రజల సినిమా గనుకనే ప్రజలు ఆదరించారు."

దర్శకుడు గౌతమ్‌ఘోష్‌కి 'మాభూమి' మొదటి ఫీచర్ ఫిలిం. ఆయన తెలంగాణ గురించి పూర్తిగా అధ్యయనం చేశాకే ఈ సినిమా చేశాడు. హరీన్ చటోపాధ్యాయ, సుందరయ్యవంటివారు తెలంగాణపై రాసిన పుస్తకాలు, కవితలు, మొదలైన సాహిత్యం చదివాడు. మాభూమి అనుభవాన్ని ఆయనే ఒక ఇంటర్వ్యూలో ఇలా

'మాభూమి' చిత్రంలో సాయిచంద్, రమణి




'మా భూమి' చిత్రం షూటింగ్ సందర్భంగా ఎడమ నుండి కుడికి గద్దర్, దర్శకుడు గౌతం ఘోష్, బి. నరసింగరావు, గౌతం సహచరి నీలంబన ఘోష్

చెప్పుకున్నారు.

"మొత్తానికి సినిమా రిలీజ్ అయింది. ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ లోని సుదర్శన్ థియేటర్‌లో అనుకుంటా....మొదటి షో స్టార్ట్ అయింది. నరసింగ, రవి, ఇంకా టీమ్ అందరూ థియేటర్‌లో సినిమా చూస్తున్నారు. నాకేమో పిచ్చి టెన్షన్. ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి జంక్షన్‌లో ఉన్న ఇరానీ హొటల్లో ఓ మూల టేబుల్ దగ్గర టీ సిప్ చేస్తూ సిగరెట్ కాలుస్తూ కూర్చున్న. అందరూ వెదుకుతున్నారు నాకోసం. 'గౌతం ఏడీ' అంటూ. వాళ్ళకు ఎవరో చెప్పారు 'గౌతం క్రాస్ రోడ్స్ హొటల్‌లో ఉన్నాడని. అంతే మోహన్ కోడా పరుగు పరుగున నా దగ్గరకు వచ్చి 'అక్కడ థియేటర్‌లో ఈలలు, చప్పట్లతో మారుమోగుతుంటే నువ్వేమో ఇక్కడ కూర్చున్నావా?' అని చేయి పట్టుకుని లాక్కుపోయాడు. ఆ మాటలు విన్న తరువాతనే నేను ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాను. తర్వాత షోలో ఆడియన్స్ సంబరాన్ని కళ్ళారా చూసి ఆస్వాదించాను. తెలంగాణ యాసలో డైలాగులు వస్తుంటే ఒకటే చప్పట్లు. అప్పటిదాకా తెలంగాణ యాసను పూర్తి స్థాయిలో ఏ తెలుగు సినిమాలోనూ మాట్లాడించలేదు. ఒక్క చిల్లర దేవుళ్ళలో తప్పించి.

'మాభూమి' విజయం తెలంగాణ ప్రతి పౌరుడి విజయంగా భావిస్తాను. ఈ సినిమాకు వచ్చిన ఆదరణ ఇప్పటికీ నాలో ఒక ఉత్తేజాన్ని నింపుతుంది. అప్పుడు మీడియా పాత్ర చాలా పరిమితమే అయినా నా సినిమాకు మీడియా ఎంతో సపోర్ట్ చేసింది. అందుకే 'మాభూమి' వచ్చి నలభైఏండ్లు దాటినా నాకు నిన్ననో మొన్ననో జరిగినట్లే అనిపిస్తుంది." – గౌతం ఘోష్.

**చరిత్రలో ఒక్కసారే జరుగుతుంది:** 'మాభూమి'లో అన్నీ తానై చేసిన బి.నరసింగరావు హృదయావిష్కరణ ఇలా ఉంది: "మెదక్‌జిల్లా మంగళపర్తిలో షూటింగ్ ప్రారంభించాం. రోజూ షూటింగ్‌లో దెబ్బలు తాకేవి. రోజూ ఒక అయోడిన్ బాటిల్ అయిపోయేది. మామూలు జనంలోనే కొందరిని ఎంపిక చేసుకుని ట్రెయిన్ చేసుకునేవాళ్లం. కొత్త చీరలు, రుమాల్లు, పంచెలు వాళ్లకిచ్చి పాతవి తీసుకుని షూటింగ్స్‌లో వాడేవాళ్లం. నర్సాపూర్ తాలూకా దొంతి గడిలో దాడి చేసే దృశ్యం తీయడం అదో గొప్ప అనుభవం. కొంత హైదరాబాదు, లంబాడి తండాల్లో షూట్ చేశాం. సినిమా విడుదలై జైత్రయాత్ర చేసింది. అభినందనల్లో తడిసి ముద్దైపోయాము. వెళ్లిన చోటల్లా సభలు, సమావేశాలు, అభినందనలు. మహబూబ్‌నగర్‌లో నైతే మాకు పోలీస్ సెల్యూట్ ఇచ్చారు. నల్గొండ, నిజామాబాద్, విజయవాడ అన్ని చోట్లా ఇదే సీను. 'మా భూమి' ప్రజల సినిమా గనుకనే ప్రజలే ఆదరించారు. ఒకసారి సారస్వత పరిషత్తులో ఏదో సభ. ఒకాయన చాలాసేపు నా చుట్టూ తిరుగుతున్నాడు. నేను అడిగాను. 'ఏమిటి విషయం' అని. 'ఏమీ లేదు నేను మీ 'మాభూమి' 22 సార్లు చూశాను." అన్నాడు. ఇంకొకాయన 40 సార్లు

చూశా"నని చెప్పాడు. అప్పట్లో అదొక క్రేజ్. ఇప్పటికీ "మాభూమి నర్సింగరావు" అనే గుర్తింపు గర్వంగా అనిపిస్తుంది. సినిమాకు పేరేం పెట్టాలని అనుకున్నప్పుడు జైత్రయాత్ర, ఇంకా ఏదో అన్నారు. అదంతా నాటకీయంగా ఉంటుందని, భూమి కోసమే పోరాటం జరిగింది కదా" "మాభూమి" అంటే పోతుంది అని నేనే పేరు పెట్టాను. ఆ పేరు చాలా పాపులర్ అయింది. పొలిటికల్ ఓరియెంటెడ్ హిస్టారికల్ చిత్రంగా 'మాభూమి'లో సెమీ డ్రామా, సెమీ డాక్యుమెంటేషన్, (మాంటేజెస్, ఫిక్షనల్ ఎలిమెంట్స్) స్పష్టంగా కనిపిస్తాయి. అవన్నీ జీవితానికి దగ్గరగా ఉంటాయి. చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం ఒకసారే జరిగింది. అలాగే 'మాభూమి' సినిమా నిర్మాణం కూడా."

ఇప్పటికీ 'మాభూమి రామయ్య' అనే అంటారు అని ప్రధాన పాత్ర పోషించిన సాయిచంద్ అన్నారు.. "మాభూమి సినిమా నా జీవితంతో పెనవేసుకుపోయింది. అంతా నిన్న మొన్న జరిగినట్లుగా ఉంది. నా జీవితం 'మాభూమి'కి ముందు తరువాతగా మారింది. నన్ను ఈ చిత్రం జీవితానికి దగ్గరగా తీసుకుపోయింది. అంతకుముందు నేను అలాంటి వాస్తవిక జీవితాన్ని చూడలేదు. సహజత్వం కోసం 1940ల నాటి వాతావరణం ఉట్టిపడేలా వున్న మంగలపల్లిలో సినిమా తీశారు. కరెన్సీ దగ్గర్నుంచి అన్నీ ఆ కాలం నాటివే వాడారు. ముందు రామయ్య పాత్ర పోషించగలనా అని భయపడ్డాను. 'చేయగలనా?' అని అడిగాను. చేయగలననే నమ్మకం పెట్టుకుంటే చేయించుకునే బాధ్యత మాదని నరసింగ, గౌతం అన్న మాటలు నిన్న మొన్న అన్నట్లే ఉంది. థియేటర్ నుంచి వచ్చిన వారవడం వల్ల వారిద్దరు ప్రతీది చేసి చూపేవారు. దాంతో నాకు నటించడం ఈజీ ఐపోయింది. 'రామయ్య' పాత్రలో లీనమయ్యాను. నాతోనేమిటి ఊరి వాళ్లతో కూడా ఉదా॥ కొమరయ్య, నాయక్, సాయిలు మొదలైనవారిని వారి వారి పాత్రల్లో సహజంగా నటింపజేయడం గౌతం, నరసింగల గొప్పతనమే. 'మాభూమి' నా జీవితంలో ఒక అద్భుతం. ఆ సిండ్రోమ్‌లోనే ఉండిపోయాను. అందుకే అప్పటికి ఇప్పటికి ఎప్పటికి 'మాభూమి రామయ్య'గానే ఉండిపోతాను."

### రంగులకల :

**కళలో జీవితావిష్కరణ**

అవి 1966 నాటి రోజులు. హైదరాబాదు మహానగరంలో ఇరవై ఏండ్లు కూడా నిండని కవి, రచయిత, అయిన ఓ యువకుడు జేబులో నయాపైసా కూడా లేకపోవడంతో తిండి లేకుండా పస్తులతో గడుపుతున్నాడు. రోజుల తరబడి నల్లా నీళ్లతో కడుపు నింపుకుని కాలం వెళ్లదీస్తున్నాడు. అదంతా గమనించిన అతని మిత్రుడు భోజనం తీసుకొచ్చి దగ్గరుండి తినబెట్టి ఆకలి తీర్చాడు.

**1983:** భ్రాంతిలో బతుకుతున్న యువ చిత్రకారుడు తిండి దొరక్క ఆకలితో అలమటిస్తున్నాడు. అతని కళ అతనికి తిండి పెట్టదు.

'రంగుల కల' సెట్‌పై సినిమాటోగ్రాఫర్ వేణుగోపాల్ టక్కర్‌తో .. బి. నరసింగరావు





'రంగుల కల'లో రూపతో...

ఇలాంటి పరిస్థితుల్లో ఒక ఫ్యాక్టరీ కార్మికుడు అతడికి అన్నం పెడతాడు. ఈ రెండు దృశ్యాల్లో మొదటిది నిజ జీవితంలోనిదైతే, రెండోది 'రంగులకల' సినిమాలోనిది. ఈ రెండింటికీ ఉన్న ఒకే ఒక సంబంధం 1966లో ఆకలితో ఉన్న ఆ యువకవి, 1983లో సినిమా దర్శకుడు, నాయకుడు ఒక్కరే. అతనే బి.నరసింగరావు.

ఒక సినిమాకు కావలసిన కథ, అందులోని పాత్రలు, సందర్భాలు, సంఘటనలు అన్నీ జీవితంలోంచి ఇంకా చెప్పాలంటే వాస్తవిక సమాజంలోంచి వస్తే వాటికి సహజంగానే జీవం ఉంటుంది. అయినా జీవితంలోనే ఉంది కదా 'జీవం' అనేమాట. కళ కళకోసమేనని భావించి చిత్రకళకు అంకితమైన ఒక యువ చిత్రకారుడు తనూహించుకున్న రంగుల లోకంలా గాకుండా సమాజంలో దానికి భిన్నంగా సంక్షుభిత జీవితాలు దుఃఖంతో కుమిలిపోతుంటాయి. అప్పుడే ఆ కళాకారుడు తన కళకు దిశానిర్దేశం చేసుకుంటాడు. అదే బి.నరసింగరావు 'రంగులకల' సినిమా అవుతుంది.

1980లో 'మా భూమి' విడుదలై ఒక్క తెలుగు సమాజంలోనే గాక దేశ వ్యాప్తంగా ప్రజల సినిమా చరిత్రలో సంచలనం సృష్టించింది. 'మాభూమి' తెలంగాణ సినిమాకు గట్టి పునాది వేయడమే గాక, తెలంగాణలో సినిమాను మేమూ స్పృశించగలమనే ఒక నమ్మకాన్ని కలిగించి ముందడుగు వేయించింది. ఆ ముందడుగే 'రంగులకల'. బి.నరసింగరావు కవి, రచయిత, చిత్రకారుడు భావుకుడు, అభ్యుదయ వాది కావడంతో తమ తరువాతి సినిమాను చిత్రకారుడి దృష్టి కోణంతో సమాజాన్ని ఆవిష్కరించాలనుకోవడంలో మనం ఆశ్చర్యపోనవసరం లేదు. కానీ దాన్ని పకడ్బందీగా తెరపైకి ఎక్కించిన విధానాన్ని చూస్తే ఆశ్చర్యపోతాం. దర్శకునిగా తొలి ప్రయత్నం. మాభూమిలో గౌతం ఘోష్‌తో పని చేసిన అనుభవం ఉంది. అది చాలు తన భావాల్ని తెరపై ఎలా చిత్రీకరించాలో.

నిరంతరం బాహ్య ప్రపంచాన్ని విస్మరించి మనో భావనాత్మక ప్రపంచంలో విహరించే చిత్రకారులు, సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుని, వాటిని ప్రతిబింబించే చిత్రాలు వేసేవారు, తాము ఏ చిత్రాలు వేస్తున్నామో తమకే అర్థం కాని వారు, తమకే అంతా తెలుసునని తమ చిత్రాలే ప్రజలు అర్థం చేసుకోలేక పోతున్నారని వాపోయేవారు. బతుకు తెరువుకు రాజీ పడిపోయే చిత్రకారులు, తమ భావనలోని ప్రపంచం, కనిపించే సమాజం నడుమ సమన్వయం కుదరక సంఘర్షణ పడేవారు ఇలా రకరకాల భావాలున్న చిత్రకారుల జీవితాలు ఎంత విచిత్రంగా ఉంటాయో చూపే చిత్రమే 'రంగులకల'.

చిత్రకారుల మానసిక ప్రవృత్తులను తెరకెక్కేలా రంగులకల తీయడం అప్పట్లో సినిమా అభిమానులకు ఆశ్చర్యం కలిగించిన విషయం. ఇదే విషయాన్ని ఆయన "ఒక పెయింటర్‌నైన నేను

ఒక పెయింటర్ ముఖ్య భూమికగా కథను అల్లుకోవడం పెద్ద కష్టమేమీకాదు. సమాజంలోని ఆర్థిక, సామాజిక సంక్షోభాలను చిత్రకారుడి దృష్టి కోణంతో పరిశీలించాలన్నది నా ఆలోచన. చాలా పాత్రలు నా చుట్టు ప్రక్కల జీవిస్తూ ఉన్నవే. చాలా ఏండ్ల కిందట ఒక అద్దె ఇంట్లో ఉన్నప్పుడు గమనించిన మనుషులు, మనస్తత్వాలు, పరిస్థితులు చూశాను. వాటన్నింటిచే సృష్టించబడినదే కథానాయకుడు 'రవి' పాత్ర" అనంటారు. ఒక చిత్రకారుడి జీవితాన్ని, అతని మనస్తత్వాన్ని సహజంగా చిత్రీకరించడానికి ఎందరో ఆర్టిస్టులను ఇంటర్వ్యూ చేసి ఆ పాత్రకు చిత్రిక పట్టిన నరసింగరావు.

ఇంతకు 'రంగులకల'లో ఏముందంటే నైరూప్య చిత్రకారుడైన రవి తోటి చిత్రకారుడు రమేష్ మాదిరిగా తన చిత్రాలను కూడా ఎక్కువ మొత్తం డబ్బుకు అమ్మి సరదా జీవితం గడపాలనుకుంటాడు. అతని స్నేహితురాలు సరళ కూడా రవి చిత్రకారుడిగా పేరు ప్రతిష్టలు, మంచి సంపాదన వస్తుందని వాటితో తనకు ఖరీదైన చీరలు కొనిపెడతాడని ఆశిస్తుంది. మరోవైపు బ్యానర్లు రాస్తూ జీవితం అంతా అసంతృప్తిగా ఉందని దాన్ని మరచిపోయేందుకు మద్యానికి బానిసగా మారి బతుకుతున్న మరో చిత్రకారుడు జగన్నాథం. తాగి వీధుల్లో తిరిగే రంగయ్య భార్యను బాధ పెడుతుంటాడు. ఇంటి ఓనర్ సుందరయ్య కిరాయి కట్టలేని నిస్సహాయ స్థితిలో ఉన్న కనకమ్మ పై అఘాయిత్యం తలపెట్టి ఇంట్లోంచి బయటికి వెళ్లగొడతాడు. కార్మికుడు సూర్యారావు పోలీసు కాల్పుల్లో చచ్చిపోతాడు. ఇంతలో పాత్రికేయుడు మురళీ విమర్శలు – రవిని తనేమిటో, తానేం చేయాలో తెలియజెబుతాయి. ఆ ప్రభావంతో తను ప్రజల పక్షాన నిలబడి చిత్రకారుడిగా బాధ్యత వహించాలని తన మార్గాన్ని నిర్దేశించుకుంటాడు. సమాజంలోని సగటు మనుషుల సంఘర్షణలు, వాస్తవిక సమాజ స్థితిగతులు 'రంగులకల'లో మనకు ఏ దాపు లేకుండా స్పష్టంగా కనిపిస్తవి. జంట నగరాల్లోని మురికి వాడల్లో, నగర పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకున్నదీచిత్రం. సినిమాలో మూడు పాటల్లో దేవిప్రియ ఒకటి, మరో రెండు గద్దర్, గూడ అంజయ్య రాశారు.

మాభూమిలో గద్దర్ కథలోకి ప్రవేశించి 'బండెనుక బండికట్టి పాటనెలా పాడతాడో' రంగుల కలలోనూ మూడు పాటలను అంతే అద్భుతంగా పాడారు. సూర్యారావు ఫ్యాక్టరీలో 'మేడే' ఉత్సవాలు జరుగుతుండగా వేదికపైకి వచ్చిన గద్దర్ 'భద్రం కొడుకో! నా కొడుకో కొమరన్న' పాట, రామప్ప చెరువు వొద్దున కూర్చుని ఉన్న కళాకారులకు వొక గొర్రెల కాపరి పాడే పాట అలల మీద నుండి వినిపించే 'మదనా సుందారి... మదనా సుందారి' పాట, ఇంకా "జమ్ జమ్మల్ మర్రి వెయ్యి కాళ్ల జెర్రి" పాటలు గద్దర్ పాడటంతో సినిమాకు మరింత నిండుదనం వచ్చింది. ఈ మూడు పాటలకు సంగీతం పొందుపర్చింది బి.నరసింగరావే.'

'సుచిత్ర ఇంటర్నేషనల్' బ్యానర్‌పై 1984 జనవరి 26న

'రంగుల కల'లో రూపతో..





'రంగుల కల' చిత్రానికి పాటలు కంపోజ్ చేస్తున్న బి. నర్సింగరావుతో గద్దర్, బాలయ్య

విడుదలైన రంగులకల కళాత్మకంగా గొప్ప విజయం సాధించింది. తను ఏ లక్ష్యంతోనైతే సినిమా తీయాలనుకున్నాడో ఆ లక్ష్యాన్ని చేరుకున్నాడు దర్శకుడు బి.నరసింగరావు. సితార జనార్దన్‌తో కలిసి సినిమాకు నేపథ్యసంగీతం చేసిందీ నర్సింగరావే. ఈ సినిమాను పార్లమెంట్‌లో ప్రత్యేక ప్రదర్శనకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. 1984 ఇండియన్ పనోరమకు ఎంపికైంది. హరీంద్రనాథ్ చటోపాధ్యాయ, మలయాళ దర్శకుడు అరవిందన్, సేతుమాధవన్, ఆరుద్ర, డాక్టర్ తంబు, కారామాస్టారుతో బాటు దేశ విదేశీ సినిమా ప్రముఖులు రంగులకల చిత్ర దర్శకుడిని అభినందనలతో ముంచెత్తారు. సినిమా విడుదలైన తరువాత చాలా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు, చర్చాగోష్ఠులు జరిగి ఉత్తమాభిరుచి గల ప్రేక్షకుల మన్ననలందుకున్నది రంగులకల. జాతీయ స్థాయిలో (1983) ఉత్తమ ప్రాంతీయ తెలుగు చలన చిత్రంగా జాతీయ అవార్డు అందుకున్నది. కళ కళకోసం కాదని, సమాజం కోసమని చెప్పే గొప్పచిత్రం 'రంగులకల'.

ఫిలింక్రిటిక్ చిదానందదాస్ గుప్తా 'రంగులకల' సినిమాను అద్భుతమైన చలన దృశ్యంగా అభివ్యక్తం చేశారు. "బి.నరసింగరావు 'రంగులకల' చూశాను. ఇది బాక్సాఫీసును బద్దలు చేయగలదో లేదో చెప్పలేము కానీ ఇది తెలుగులో తయారైన మూడో వాస్తవిక చిత్రం. ఒక ఆధునిక చిత్రకారుడు ప్రజా చిత్రకారుడుగా ఎలా మారాడన్న అంశంపై సినిమా తీయడం మాటలు కాదు. ఇందులో దృశ్యాలన్నీ కళాత్మకంగా రూపొందాయి. భూమ్యాకాశాలు కనబడే చోటు నుండి పచ్చగడ్డి మైదానంలో రవి, సరళ కెమెరా వైపుగా నడచిరావడం మనల్ని విస్మయపరిచే అద్భుతమైన చలన దృశ్యం. తాగుబోతు భర్త భార్యను చావబాదే దృశ్యం కూడా ఇలాంటిదే. మరోచోట పల్లె పట్టుల్లోని ప్రకృతి సౌందర్యం, జానపద జీవనశైలిని చిత్రించే రమ్యమైన దృశ్యాలు, తన ఉనికిని వెదుక్కునే చిత్రకారుడి మనోనేత్రం ద్వారా మన కళ్లముందు అందంగా కనిపిస్తాయి."

'రంగులకల'లో మరొక కీలకపాత్ర పోషించిన సాయిచంద్ తనకు ఒక ఫ్రెంచ్ సినిమా చూస్తున్నట్లుగా అనుభూతి చెందానని చెబుతూ "మా భూమి నిర్మాణానికి ముందే నరసింగ ఎప్పుడో రాసి పెట్టుకున్న కథే రంగులకల సినిమా. ఆ కథను సినిమాకు అనుగుణంగా రాసుకున్నాడు. ఆర్నెల్లపాటు సినిమా కథ గురించి, పాత్రల గురించి రీసెర్చ్ చేసి అన్ని పాత్రలకు విడిగా వారి వారి సంభాషణలు, పాత్ర లక్షణాలు అన్నింటిని నోట్స్‌గా రాసి ఇచ్చి ప్రిపేర్ చేయించాడు. ఈ సినిమాలో నాది నెగెటివ్ టచ్ ఉన్న పాత్ర. నా పాత్ర పేరు రమేష్. అసలు నా మనస్తత్వానికి సరిపడని పాత్ర ఇది. కాని చేయాలి. పాత్రలోని నేనుగా ప్రవేశించడం వీలుకాదని తెలుసుకుని ఒకవేళ గౌతంఘోష్ అయితే ఎలా చేస్తాడనుకుని అతనిలా బిహేవ్ చేయాలనుకుని అదే విషయం

నరసింగకి చెప్పాను. అతనికీ నా ఆలోచన నచ్చి ప్రొసీడైపొమ్మన్నాడు. అందుకే ఈ చిత్రంలో నా వేషం గౌతంఘోష్ గెటప్‌లో ఉంటుంది. అప్పట్లో మద్రాసులో చోలమండల్ కాలనీ అని ఉండేది. అక్కడ అంతా ఆర్టిస్ట్‌లే ఉండేవారు. వాళ్లతో కలిసి చర్చించి పాత్రకు మెరుగులు దిద్దుకున్నాను. అసలు ఈ సినిమా 20 ఏండ్లు ముందుగా తీశాడనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పుడు చూసినా కొత్తగానే అనిపిస్తుంది. ఒక తెలుగు సినిమా చూస్తున్నట్లుగా గాక ఒక అంతర్జాతీయ సినిమానో, ఒక ఫ్రెంచి సినిమానో చూస్తున్నట్లుగా ఉంటుంది. జాతీయ అవార్డుల జ్యూరీలో ఉన్న బాలచందర్ రంగుల కల సినిమా చూసి కదిలిపోయారు. దర్శకుడుగా, నటుడుగా, రచయితగా నరసింగరావు విశ్వరూపం కనిపిస్తుంది 'రంగుల కల'లో."

ఇక మన కథానాయకుడు, దర్శకుడు అయిన నరసింగరావు "నగరంలో నాతో బాటు నలుగురు" స్కెచ్‌ను ఎలా సినిమాగా తీయగలిగాడో చెబుతూ "చాలా కాలం నుండి పెయింటింగ్‌తో నాకున్న సంబంధం పెయింటింగ్‌కు సంబంధించిన నేపథ్యంలో జీవిస్తూ రావడం, మీ అందరితో పరిచయాలు, స్వయంగా చిత్రకారుడి జీవితంలోని చీకటి వెలుగులను అనుభవిస్తూ రావడం–ఇవి నన్ను ఈ చిత్రం తీసేందుకు ప్రేరేపించాయి. నేను చిత్రంలో చూపించిన మార్పు–జీవితం. ఒక చిత్రకారుడికే పరిమితం కాదు. అది ఏ కళాకారుడికైనా సంబంధించినది కావచ్చు. చిత్రంలో రవి పాత్ర రూపకల్పనలో నా నిజ జీవితానికి సంబంధించిన అంశాలు ఎక్కడైనా కనబడితే కనబడవచ్చు. చిత్రంలో రవి పాత్రకానీ, రమేష్, జగన్నాథం పాత్రలు కానీ ఎక్కడో ఊహాపథం నుండి ఊడిపడ్డవి కావు. నా జీవితం, ఇతర చిత్రకారుల జీవితాలు, వారితో చేసిన ఇంటర్వ్యూలు–వీటి ప్రభావంతో రూపొందించుకున్న స్క్రిప్ట్ 'రంగుల కల' వెనుక ఉంది. రవి పాత్రను ప్రతి విషయానికి ప్రతిస్పందించే మనస్తత్వంతో చూపించాను. ఏ కళాకారుడి మనస్తత్వమైనా ఇలాగే ఉంటుంది. స్పందన లేనిచోట సృజనాత్మకత ఉండదు."

నేను నా మొట్టమొదటి చలనచిత్రాన్ని నా అనుభవంలోని చిత్రకారుడి జీవితాన్ని చిత్తశుద్ధితో వెండితెర మీదికి మలచగలననే ఆత్మస్థైర్యంతో మొదలుపెట్టాను. ఆలాగే పూర్తిచేశాను. ఇందులో ఎంతవరకు సఫలీకృతుడనయ్యానో నాకంటే మీకే బాగా తెలుసు.

ఒక చిత్రకారుడి జీవితాన్ని, మనస్తత్వాన్ని, సంఘర్షణను యథాతథంగా తీస్తే అది పర్సనల్ సినిమా ఔతుంది. అయితే నా ఉద్దేశం వేరు. దీన్ని నేను ప్రజల్లోకి పంపించాలనుకున్నాను. ఆవిధంగానే చిత్రాన్ని రూపొందించాను. చిత్రకారుడి భావ సంఘర్షణను సంక్లిష్టతను కొంత సరళంగా మార్చాను. కేవలం రవి పాత్రనూ, అతడి అంతుబట్టని మానసిక ప్రపంచాన్నే చూపించి ఉంటే చిత్రకారులందరికీ అద్భుతంగా తోచివుండేది. అలా కాకుండా సామాన్య ప్రేక్షకుల కోసం కథను ఓ క్రమపద్ధతిలో

**'రంగుల కల' పాటల రికార్డింగ్ సందర్భంగా బి. నరసింగరావుతో గద్దర్, దేవిప్రియ, మాస్టర్జీ**





'దాసి' చిత్ర దర్శకునిగా రాష్ట్రపతి వెంకటరామన్‌తో అవార్డు అందుకుంటున్న బి.నరసింగరావు

పెట్టాను. అయితే కథ విషయంలో నేను ఎక్కడా రాజీ పడలేదు... 'రంగులకల' ప్రయోగాత్మక సినిమా. ఇటువంటి సినిమాలో సన్నివేశ క్రమం కథనం, దర్శకుడి ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుంది. 'రంగులకల' లోని ప్రతి రెండు సన్నివేశాల మధ్య అంతర్లీనమైన కొనసాగింపు ఉంది.

ఇక చెప్పే విధానాన్ని తీసుకుంటే... ప్రజల ఆలోచనా పరిధికి అందేట్టుగానే నేను ఆధునిక పద్ధతులను ఉపయోగించాను. కళా రూపం ఏదైనా ప్రజల నుండి వారి జీవితం నుండి సృజించబడవలసిందే.

ఈ సినిమాలోని సన్నివేశ క్రమం, నేను చెప్పదలచుకున్న విషయాన్ని, విధానాన్నీ వివరిస్తుంది. ఇది సరయిందా, కాదా? అన్న విధంగా కాక, నచ్చిందా, లేదా? అనే పద్ధతిలో ఆలోచించాలి. ప్రతి దర్శకుడికీ తనదైన స్వంత శైలి ఉంటుంది.

మన సామాజిక జీవితాన్నే కళాకారుడు తన దృక్పథం నుండి చూసి ప్రతిస్పందిస్తాడు. 'నైరూప్య చిత్రకళ'లోని ఇతివృత్తం, భావం, సంవిధానం కూడా సమాజం నుండి తీసుకునేవే అవుతాయి. అంటే ప్రజల నుండి నేర్చుకున్న విషయాన్ని తిరిగి వారికి అందించడం అన్నమాట!

ఇకపోతే 'రంగులకల' చిత్రం చిత్రకారుల సమస్యల్ని తీరుస్తుందా? అంటే నేనేం చెప్పలేను. కళారూపం అనేది పూర్తిగా వాస్తవం కాలేదు. నేను రూపొందించిన చిత్రకారుడికి మాత్రమే నేను పరిష్కారాన్ని సూచించాను. కళా ప్రయోజనం గురించి చెప్పాను. అంతేకాని నా చిత్రం 'సర్వరోగ నివారిణి'గా రూపొందాలని నేను అనుకోలేదు. నేను చిత్రకారుల జీవితాలను చిత్రిస్తూ, వారు ప్రజల కోసం కళను అంకితం చేయాలనే నా వాదనను, ఆశాభావాన్ని చూపించాను. నా ఆశయాన్ని, ఆచరణనూ ప్రభావితం చేస్తున్నది ఇదే!.

1977 ప్రాంతంలో అనుకుంటాను. ఒక నాలుగిళ్ల చావిడిలో కొంతకాలం నివసించాల్సి వచ్చింది. అక్కడి వాతావరణాన్ని పరిశీలించాక చిత్రకారుడు "రవి" పాత్రను రూపొందించుకున్నాను. అతని చుట్టూ నాలుగిళ్ల పరిసరాల ప్రభావాన్ని సృష్టిస్తూ రాసుకున్న స్కెచ్ "నగరంలో నాతో బాటు నలుగురు". అదే స్క్రిప్టు తరువాత 'రంగులకల' సినిమాగా రూపొందింది. ఇది దర్శకునిగా నాకు తొలిచిత్రం. సంవత్సరం పాటు శ్రమించాను. ఇప్పుడు ఆలోచిస్తే చిత్రంగా అనిపిస్తుంది. రవి పాత్ర లేకుండా 'రంగులకల' చిత్రాన్ని ఊహించలేము. ఈ పాత్ర ద్వారా సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని సహజంగా చూపించే ప్రయత్నం చేశాను.

1982 – 83ల నాటి సజీవ చిత్రం ఈ సినీ ఫ్రేముల్లో కూర్చబడింది. ఇందులోని పాత్రలన్నీ ఆలోచించి పొందికగా కూర్చబడినవిగా కనిపించినా వీటి వెనక 'సమాజం – జీవితం'

ప్రధానంగా కనిపిస్తుంది. ప్రతి పాత్రని దాని సమాజ నేపథ్యంలో అవి ప్రవర్తించే తీరు, ఆలోచించే విధానం, ఆ పాత్రకు మిగతా పాత్రలతో గల సంబంధం చివరికి ఆ పాత్ర సమాజంపై ప్రేక్షకులపై చూపించే ప్రభావం వీటన్నింటి గురించి నెలల తరబడి ఆలోచించి రూపుదిద్దబడినవి. ఇలా 1982 – 83 నా జీవితాన్ని మలుపు తిప్పినవి. రంగులకల విజయం ఇచ్చిన మనోబలంతోనే ఆ తరువాతి చిత్రాలు తీయగలిగాననిపిస్తుంది."

**ఒక బి.ఎన్.రెడ్డి... ఒక బి.నరసింగరావు**

సుప్రసిద్ధ రచయిత మునిపల్లె రాజు 'రంగులకల' సినిమా చూశాక బి.నరసింగరావును అలనాటి సుప్రసిద్ధ కళాత్మక చిత్రాల దర్శకుడు బి.ఎన్.రెడ్డితో పోల్చుతూ "ప్రవృత్తి, నివృత్తి మేళవమైన భావుకతతో, ఆధునిక మానవుడి ఆత్మశోషణనూ, సత్యాన్వేషణనూ ఆధ్యాత్మికానుభవంగా మార్చి ఆ సిద్ధాంతాన్ని కవితా రూపంగా పయనింపజేస్తూ– శ్రీ నరసింగరావు మనకు కనిపిస్తాడు రంగుల కలలో. సంపూర్ణ కళాశాల శిక్షణ పొందిన చిత్రకారుడైనా, రంగస్థల ప్రయోక్తగా మాత్రమే అతనికి ఆత్మానందం కలిగి ఉండాలి అనిపించింది నటన, రచన, ప్రకృతి సౌందర్యోపాసన, జానపద సంగీత సాధన, నిత్య మానసిక సంఘర్షణ – ఒకే వ్యక్తిని ఆవహించిన వరాలయినప్పుడు మాత్రమే రంగులకల లాంటి ఉదాత్త చిత్రం ఊహించబడుతుంది. ఏ వాగాడంబరమూ లేకుండా, ఏ అశ్లీలత చోటుచేసుకోకుండా – మానవుడి చైతన్యాన్ని విస్తరింపజేసేదే కళ. దాని పరమావధి వ్యక్తి దృష్టి గాదు సమిష్టి దృష్టి – అన్న చిన్న సందేశాన్ని అందించటంలో ఈ చిత్రం ఎన్నో కొత్త అభిరుచుల్ని సృష్టించింది.

అభ్యుదయ చిత్ర ప్రవంతికి ఇది జన్మగీతిక కాకపోవచ్చు. మైలురాయి మాత్రం అయి తీరుతుంది. ఆధునికతకు, భావుకతకు, ఆత్మ విమర్శకూ స్పష్టమైన విజయ నినాదం ఇచ్చిన నరసింగరావు, వర్తమాన చిత్ర పరంపరకు శాపం పెట్టలేదు గానీ, నవశకానికి అస్పష్టంగానైనా నాందీవచనం పలికినాడు. జాతీయ అంతర్జాతీయ సినిమాకాశంలో ఏ ఉన్నత స్థానమైనా తెలుగు చిత్రాలకు గూడా కరతలామలకం కాగలదన్న ఆశాగీతాన్ని ఆలపించిన శ్రీ నరసింగరావు నిజంగానే ఆధునిక శక ద్రష్ట. కీ.శే. బి.యన్.రెడ్డిగారిని ఆరాధించే ఈ బి.ఎన్.ఆర్ని గూడా తెలుగుజాతి తప్పక గౌరవిస్తుంది." అని తన భావాల్ని వ్యక్తపరిచారు మునిపల్లి రాజుగారు..

**రంగులకల - అవార్డ్స్:**

- తెలుగులో ఉత్తమ రీజినల్ ఫిల్మ్‌గా జాతీయ అవార్డు, భారతదేశం, 1984
- బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, ఇండియా, 1984.

'శ్రీశ్రీ' డాక్యుమెంటరీ చిత్రీకరణ సందర్భంగా హరీంద్రనాథ్ చటోపాధ్యాయతో..





'దాసి' చిత్రంలో అర్చన

దాసి :

**బంధించబడిన ప్రాణవాయువు**

'మా భూమి' చిత్రం తెలంగాణ సినిమా అభిమానులకు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని నింపింది. మన సినిమాలు కూడా జాతీయ స్రవంతిలో ప్రత్యేకతను సంతరించుకుంటాయని. బహుషా ఇదే ఆత్మవిశ్వాసంతో బి.నరసింగరావు ఆ తర్వాత దర్శక నిర్మాతగా, నటుడుగా, సంగీత దర్శకుడుగా తీసిన చిత్రం "రంగులకల". నగర జీవితాన్ని, సంఘర్షణను కథాంశంగా చేసుకుని తీసిన రంగులకల కూడా మాభూమిలాగే ఆయనకు జాతీయ స్థాయిలో గొప్ప పేరు తెచ్చి పెట్టింది. ఆ తరువాత బి.నర్సింగరావు తీసిన మరో దృశ్యకావ్యం "దాసి" (1988). జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పురస్కారాలు, ప్రశంసలు అందుకున్న చిత్రం ఇది. తెలంగాణలో ఉండే ఒక అనాగరిక సంప్రదాయానికి నిదర్శనంగా నిలిచే ఆడబాపల జీవితాన్ని దృశ్యీకరించిన చిత్రం "దాసి".

ఎప్పుడైనా, ఎక్కడైనా వేశ్యా జీవితానికి గౌరవముంటుంది. ఆమె తన ఇష్టమైన వ్యక్తులతో జీవనం గడిపి ఆ తర్వాత జీవితం చాలిస్తుంది. కానీ తెలంగాణలోని ఆడబాపలకు స్వంత జీవితం ఉండదు. ఆమె దొరల గడీలల్ల ఉండి దొరలు, దొరసానుల చెప్పు చేతల్లో ఉండాలి. వారి అన్ని అవసరాలను తీర్చాలి. ఆ తరువాత అనామకంగా జీవితాన్ని చాలించాలి. అంటే ఆమె సమాజంతో సంబంధం లేకుండా ఏ లెక్కకూ లేని మనిషిలా కాలగర్భంలో కలిసిపోతుంది. ఇలాంటి స్త్రీల గురించిన ప్రస్తావన తెలంగాణలో తప్ప ఎక్కడా చూడలేము. ఇతర ప్రాంతాలలో ఉండే దేవదాసీలకు, వేశ్యా వాటికల్లోని స్త్రీలకు, ఇతర స్త్రీలకు సంగీత, నృత్య సాహిత్యాలలో ప్రవేశం ఉంటుంది. వారికి సమాజంలో గౌరవమూ ఉంటుంది. అంతెందుకు గురజాడ సృష్టించిన పాత్ర మధురవాణికి కార్యగౌరవం ఉంది. కానీ మన తెలంగాణలోని ఆడబాపకు చరిత్రలో కనీస స్థానం దక్కలేదు. అందుకే "కన్యాశుల్కం" సినిమాగా వచ్చింది. కానీ ఆడబాపలపై సినిమా తీసే ఆలోచన తెలుగు సినిమా పెద్దలకు రాలేదు. ఎందుకు తీయలేదంటే ఆడబాపలది బహిరంగ సమాజానికి తెలిసే జీవితం కాదు. వాళ్లదంతా గడీల లోపలి రహస్య జీవితం. కానీ దేవదాసీల జీవితం బహిరంగం. ఆ దేవదాసీ వ్యవస్థ నుండి వచ్చిన వారు గొప్ప గొప్ప కళాకారులుగా వెలుగులోకి వచ్చి జగద్విఖ్యాతమయ్యారు. భారతదేశంలో అత్యున్నత స్థానాలకు చేరి, "భారతరత్నా"లుగా ఎదిగిన సందర్భాలున్నవి. వారి పేర్లను మనమిక్కడ ప్రస్తావించుకోవడం లేదు గానీ వారినంతా ఇపుడు ఈ సమాజం గొప్ప గొప్ప స్థాయిలో ఊహించుకుంటూ, వారిని దేవదాసీ వ్యవస్థకు ప్రతినిధులుగా గాక, ఆయా కళారంగాలకు ప్రతినిధులుగా భావిస్తున్నది. ఈ దేవదాసీలకు వారికి పూర్వీకుల నుండి రాజుల తరాల నుండీ దేవాలయాల్లో ఉంచి నృత్య,

సంగీతాల్లో శిక్షణనిప్పించి అందులో రాణించే అవకాశం ఇచ్చే రాజరికపు సమాజం ఉండింది. ఇంకా వారికి దేవాలయాలున్నవి. దేవాలయ భూములున్నవి. ఆస్తులూ ఉన్నవి. వీటి వల్ల వారు తామెంచుకున్న కళారంగంలో నిపుణతను సాధించి ఎదిగారు. కానీ మన ఆడబాపలకు స్వేచ్ఛనేమో అసలే లేదు. ఈ ఆడబాప గడీలల్లనే ఉండాలే. గడీలల్లనే బతకాలే. ఈ గడీలల్లనే చచ్చిపోవాలే. జీవితాంతం గడీలల్లనే. ఇంతటి దుర్భర జీవితాన్ని పిక్చరైజ్ చేసిన దర్శకుడు బి.నరసింగరావు. కమలాదాస్, అమృతాప్రీతమ్‌లు తమ జీవితాల్ని తాము చెప్పుకున్నట్లు మన తెలంగాణలో ఒక ఆడబాప తన జీవితాన్ని గురించి చెప్పుకున్న దాఖలాలు లేవు. మరే సమాజంలోనైనా మనుషులు వాళ్ల గురించి వాళ్లు మాట్లాడుకుంటున్నారు గానీ మన తెలంగాణలో అట్లా లేదు. గడీలల్ల ఉండే ఆడబాపల కన్నా హీనమైన మాటలను సినిమాలలో వాడుతుంటారు. వాటినే తమ చిత్రాల విజయ సూత్రాలుగా భావిస్తుంటారు.

"దాసి" కథలోకి వెళితే... అరశతాబ్దం దాకా తెలంగాణలో ఒక భిన్నమైన సంస్కృతిని కొనసాగించిన వారు దేశ్‌ముఖ్‌లు, దొరలు. గడిల్లోకి ఒకనాడు చిన్నదొరసాని వెంట ఒక వస్తువుగా వచ్చిన పనిపిల్ల కమలాక్షే దాసి. ఈ దాసి దొరల ఇంట్లో వారి అవసరాలకు పనిపిల్లగానే గాక వీరి శారీరక అవసరాలనూ తీర్చే ఉంపుడుగత్తెగా ఉండిపోవలసిందే. కమలాక్షి దొర ఇంట్లో అన్ని పనులూ చేసే సేవకురాలు. ఇంటిని ఇంటిల్లిపాదిని చక్కదిద్దడమే గాక దొర శారీరక అవసరాలను తీర్చడం ఆమె బాధ్యత. ఇది మాత్రమే గాక ఆయన కోసం వచ్చిన స్నేహితులు, బంధువులకు కూడా శారీరక సుఖం అందించాలి. తనదైన భావాలు, ఆలోచనలు ఏవీ లేకుండా జీవించడమే దాసి లక్షణం. ఆ ఇంటి ముందు కమలాక్షి సొంపిడిగా చల్లబడతది. అలుకుపిడసయితది. ముగ్గుగా కనిపిస్తుంది ప్రేక్షకుడికి. ఆ దొర గడి నుంచి పశువులు బయటికి వెళతాయి కాని, కమలాక్షి బయటి ప్రపంచాన్ని చూడదు. అక్కడ పశువులకున్న స్వేచ్ఛ మనుషులకు ఉండదు.

దొర గడీల చుట్టూ ఎత్తైన గోడలుంటాయి. లోపల ఏం జరిగేది బయటికి తెలిసి రాదు. బయటికి తెలిపే సాహసం ఎవరూ చేయరు. చేస్తే వారి శవాలు కూడా కనిపించవు. కమలాక్షి ఒక సన్నివేశంలో దొర పడగ్గదిలోకి మంచినీళ్ళ మరచెంబు తీసుకుని వెళుతుంది. దొర నెమ్మదిగా మద్యం తాగుతుంటాడు. ఇక తన పనైపోయిందనుకుని కమలాక్షి ఆ గదిలోనుంచి బయటికి వెళ్లడానికి తలుపువైపు కదులుతుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న దొర వచ్చి తన పక్కనే పడక మీద కూర్చోమంటాడు. భయంతో ఉన్న కమలాక్షి ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా తన పశువాంఛను తీర్చుకుంటాడు. ఆ దాష్టికాన్ని ఆమె మౌనంగా భరిస్తుంది. ఇంతలో దొర భార్య ఆ గదిలోకి వస్తుంది. ఆమె వైపు దొర కోపంగా చూడటంతో ఏ ప్రతిస్పందనా లేకుండానే అక్కడి నుంచి ఆమె

**కలకత్తా: అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో 'దాసి' చిత్ర బృందంతో బి.నరసింగరావు**





బి.నరసింగరావు, గౌతం కౌల్ (చిత్ర విమర్శకుడు)

వెళ్లిపోతుంది. దొర భార్యకు ఇదేమి తప్పుగా అనిపించదు. అతను దొర కనుక గ్రామంలోని ఆడవాళ్లందరినీ అనుభవించడం అతని హక్కుగా, అధికారంగా భావిస్తుంది.

ఒకసారి దొర కమిలి (కమలాక్షి)తో ఊరిలోని పేద రైతు భార్యను తన కోరిక తీర్చడానికి నయానో, భయానో తన గడీకి పిలుచుకు రమ్మంటాడు. రైతు భార్య వచ్చి దొర గదిలోకి వెళు తుంది. తర్వాత కమలి తలుపు బయట పడిగాపులు గాచే దృశ్యం దర్శకుడి ప్రతిభకు పరాకాష్ట. కమలాక్షిది దొర ఒక్కని శారీరక అవసరాలే కాదు దొర బావమరిది, దొర బావ, దొర ఇంటికి వచ్చిన అతిథులు అందరికీ పడక సుఖాన్ని అందించే దైన్యమైన స్థితి. అమానవీయంగా అత్యాచారాలకు ఆమె వేదికవుతుంది. విచిత్రమేమిటంటే.. ఆమె ఇవన్నీ తన జీవితంలో భాగం అను కుంటుంది.

నల్లగొండ జిల్లా నారాయణపురానికి చెందిన జయసింహా రావు అనే దొర గడిలో ఉండే "కమలాక్షి" జీవితమే "దాసి" చిత్రకథ. దొరవల్ల కమలాక్షి గర్భవతి అవుతుంది. తాను బిడ్డకు తల్లినవ్వాలనే కోరిక కమలాక్షిది. కానీ దొరభార్య జానకి ఆమెను అబార్షన్ చేయించుకోమని ఆదేశిస్తుంది. అయితే దొర కూతురుకు సీమంతం సంబురాలు జరుగుతుంటై ఒకవైపు. అపుడు మరో పని మనిషితో కమలాక్షి "దొరసాని బిడ్డకు కడుపైతే ఉంచుకుంటది మరి నేనెందుకు తీసేసుకోవాలి?" అని అమాయకంగా అడగడం ద్వారా దర్శకుడు దొరతనాన్ని ప్రశ్నిస్తాడు. చివరకు కమలాక్షి హృదయ విదారకంగా రోదిస్తుంటే నాటు మందులతో గర్భవిచ్ఛిత్తి చేయడంతో సినిమా ముగుస్తుంది. నాటి మొరటు విధానంలో, అశాస్త్రీయంగా, అత్యంత క్రూరంగా గర్భ విచ్ఛితి జరుగుతున్నప్పుడు కమలాక్షి పెట్టే కేకలు ఆ గదిలో ఇమడలేక పై కప్పుకున్న గవాచిలోంచి బయటికి వచ్చి ఆకాశంలో కలిసిపోతాయి. అపూర్వమైన ఒక స్త్రీ జీవన చిత్రణ కలిగిన దృశ్యకావ్యంగా రూపొందిన ఈ సినిమాలో పాటలుండవు. నరసింగరావు రాసిన మాటలే ఉంటవి. కథా నిర్మాణం కూడా ఆయనదే. అర్చన, రూప, భూపాల్ ప్రధాన పాత్రదారులు. దాసి సినిమాలో కాస్ట్యూమ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. "నల్లగొండ జిల్లాలోని స్త్రీల చీరకట్టు, బొట్టు, వేషధారణలపై ప్రత్యేక శ్రద్ధతో రీసెర్చ్ చేసి స్కెచ్చులు వేసుకున్నాము. దొరలతో, దొరసానులతో మాకున్న పరిచయాలను దృష్టిలో ఉంచుకుని వారి వేషధారణను అవగాహన చేసుకుని కాస్ట్యూమ్స్ తయారు చేసుకున్నాము. నిమస్తిని వంటి వస్త్రాలను డిజైన్ చేసుకున్నాము. దొరలు పెట్టుకునే రింగులు, ఆడవాళ్ల కడియాలు అన్నీ ఒరిజినల్‌వే వాడాము. దాసిగా నటించిన అర్చన వేసుకున్న రవికలన్నీ ఒక టైలర్‌తో మిషన్‌పై కాకుండా చేతి కుట్టుతో కుట్టించాము." అంటారు కాస్ట్యూమ్స్ డిజైనర్ సుదర్శన్.

ఈ సినిమా షూటింగ్ అంతా కూడా 14 రోజుల్లో పూర్తయింది. సినిమా కథ మొత్తం నడిచేకాలం ఆరు నెలలుగా ఉంటుంది. ఈ మధ్యకాలంలో కమిలి జీవితంలో జరిగే సంఘటనలు కథలో కనిపిస్తాయి. ఆలోచించే ప్రేక్షకుడికి ఇవే పరిణామాలు దాసి జీవితమంతా జరుగుతాయి అన్న భావన రాగానే ప్రేక్షకుడి వెన్నులో వణుకు పుడుతుంది. హృదయం బరువెక్కిపోతుంది. వందల ఏళ్ల హింసను కళ్లారా చూసి బరువైన హృదయంతో ప్రేక్షకులు థియేటర్ బయటికి వస్తారు. ఈ సినిమా చూసిన ప్రతిచోట బి.నరసింగ రావును ప్రేక్షకులు ప్రశంసలతో ముంచెత్తారు. మ్యూనిచ్ ఫిలిం ఫెస్టివల్‌లో జరిగిన స్క్రీనింగ్ తర్వాత అక్కడి మహిళా ప్రేక్షకులంతా ఆయన చుట్టూ చేరి అడిగిన ప్రశ్న "ఒక పురుషుడివైయుండి ఒక స్త్రీ హృదయంలోకి ఎలా ప్రవేశించ గలిగావు" అని అడిగారు. ఇది ఆస్కార్‌ను మించిన గుర్తింపు ఆయనకు. అసలు దర్శకుడిగా బి.నరసింగరావు ఈ సినిమా మొదట్లో ఎత్తుగడలోనే కమలాక్షి తనను పరిచయం చేసుకోవడం తోనే దర్శకుడు ప్రేక్షకుణ్ణి తన ఆధీనంలోకి తీసుకుంటాడు.

అరవిందన్, గౌతంఘోష్, షాజీకరుణ్, అపర్ణాసేన్ వంటి భారతీయ సినీ ప్రముఖులు, విదేశీ దర్శకులు వేనోళ్ల "దాసి"ని కొనియాడారు. 'న్యూయార్క్ టైమ్స్'లో పనిచేసే అమెరికన్ సినీవిమర్శకులు గతంలో తార్కోవస్కీ సినిమాలు 'ఇవాన్స్ చైల్డ్‌హుడ్', 'సాక్రిఫైస్', 'మిర్రర్', 'స్టాకర్' మొదలైన సినిమాలు ఏవీ కూడా ఒక పట్టాన అర్థంకావని, స్పష్టత లోపించి ఉంటాయని పనిగట్టుకుని ప్రచారం చేశారు. 'దాసి' విషయంలో కూడా బి.నరసింగరావు ఇలాంటి విమర్శనే ఎదుర్కొన్నారు. కానీ అంతర్జాతీయంగా యురోపియన్ ఫిలింక్రిటిక్స్ కొందరు 'దాసి' సినిమాను ఆకాశానికెత్తి రాశారు. దర్శకుడు బి.నర్సింగరావు చెప్పినట్లుగా "ప్రపంచ సినిమా రంగ ప్రవేశానికి నాకే కాదు భారతదేశానికి కూడా ఒక పాస్‌పోర్టుగా 'దాసి' చరిత్రకెక్కింది."

**నా బిడ్డ 'దాసి' సినిమానే**

"ఒకసారి జి.కృష్ణ అనే జర్నలిస్ట్ నన్ను ఇంటర్వ్యూ చేస్తానంటే హిమాయత్‌నగర్‌లోని ఓ హోటల్‌లో కలుసుకున్నాం. మాటల మధ్యలో ఆయన 'పాలమూరు జిల్లాలోని ఒక సంస్థానానికి తను వెళ్లినపుడు ఒక అందమైన అమ్మాయి వచ్చి కాళ్లు కడగటానికి ఉపక్రమిస్తుంది. వద్దు నా కాళ్లు నేను కడుక్కుంటాను. అని వారించాడు. అప్పుడామె "అదేంది ఇక్కడికొచ్చిన వాళ్లు చాలా కడిగించుకుంటారు. మీరేంది కాళ్లే కడుగనిస్తలేరు." అన్నదని చెబుతూ "అదేంది నరసింగరావు అన్నీ కడిగించుకోవడంలో అంత సుఖముంటుందా?" అని నన్ను ప్రశ్నించాడు. ఆశ్చర్యపోవడం నా వంతయింది. ఆ క్షణంలోనే దాసి వ్యవస్థపై సినిమా తీయాలనుకున్నాను. ఇంటికి వెళ్లి మా అమ్మను "దాసీల గురించి ఏమిటి?" అని అడిగాను. నా చిన్నప్పుడు మా యింట్లో దాసీలుండే వారు. మా ఆలనాపాలనా చూసేవారు. అలాంటి పద్ధతులు తాతల

**బి.నరసింగరావు, ఆనంద్ పట్ వర్ధన్, విదేశీ ప్రతినిధితో..**




Archie
Archie
Archie
Archie
WOOF!

కాలంలో ఉండేవి. మీ నాన్న ఆర్య సమాజ్‌లో ఉండేవారు కనుక ఇలాంటి వాటికి దూరంగా ఉండేవారు" అని ఆమె సమాధానం. మొత్తం 40, 50 ప్రశ్నలతో కూడిన లిస్టు తయారు చేసి వరంగల్, కరీంనగర్ జిల్లాలో చాలా మందిని కలిసి ఇంటర్వ్యూలు చేసి 200 పేజీల సమాచారాన్ని కె.ఎన్.టి. శాస్త్రి అందించారు."

"ఈ సమాచారాన్ని అన్వయించుకుని 1920 – 40ల మధ్య దాసి సిస్టం ఎట్లా ఉండేదో, నాకు తెలిసిన కథనాల ఆధారంగా స్క్రిప్టు తయారు చేసుకున్నాను. ఆ కాలంలో కరువుకు పిల్లలను సాదలేక 20, 30 రూపాయలకు అమ్ముకునేవారు. వారే దొరల గడీలలో దాసీలుగా మారేవారు. వారే తరువాత పెళ్లి కూతుర్ల వెంబడి అరణంలో భాగంగా వెళ్లేవారు. అలాంటి దాసిని చూపుతూనే యూనివర్సల్‌గా పురుషుడు స్త్రీ పై ఎట్లా పై చేయి సాధిస్తాడో చెప్పే ప్రయత్నం చేశాం. అణచివేత, భూస్వామ్య పెత్తనం అనేవి చేతితో దండం పట్టుకుని చేసేవి. బలవంతుడైన పురుషుడు స్త్రీని ఎన్ని రకాలుగా హింసిస్తాడో "దాసి"లో చూపాము. దాసి తనే చెప్పుకుంటుంది. ''తానొక నాలుగు గోడల మధ్య బంధింపబడిన ప్రాణవాయువునని".

దాసి సినిమాలో గతంలో ఇంటర్వ్యూలు చేసిన వాళ్లందరు చాలా మంది తమను తాము చూసుకోగలిగారు. సినిమా తీసాక వారి కోసం ప్రత్యేకంగా ఒక ప్రదర్శన వేశాం. ఏదో పని ఉండి ఆ స్క్రీనింగ్‌లో నేను లేను. ఆ సినిమా చూసాక వాళ్లంతా నా ఆఫీసుకు వచ్చి నన్ను కలుసుకుని ఎవరూ ఏమీ మాట్లాడ లేదు. నా చుట్టూ చేరి కావిలించుకొని ఏడుస్తూనే ఉన్నారు. అది చూసి నేను భావోద్వేగాన్ని ఆపుకోలేక పోయాను. నేను ఏడ్వ, వాళ్లు ఏడ్వ, అక్కడ 15 నిముషాలు మాటల్లేవు. వాళ్లంతా వాళ్ల జీవితాన్ని వాళ్లు చిత్రంలో చూసుకుని దుఃఖపడిన సందర్భం. నా సినిమా సక్సెస్ వాళ్లలోనే చూసుకున్నాను.

ఈ సినిమా తరువాత చాలా మంది స్త్రీలు వాళ్ల విషయాలు నాతో చెప్పుకోవడంతో స్త్రీ జీవితాల్లో కనిపించని కోణాలు కనిపించేవి. మహిళా జర్నలిస్టులు, దర్శకులు, విద్యార్థినులు ఇట్లా చాలా మంది. వారంతా ఇతను మాలో ఒక భాగం అని అనుకునే వారు. దాసి సినిమా అనేది చిన్న అణుబాంబులాంటిది. దాన్ని అలా చూసి వదిలాం. అద్భుతంగా పేలింది. అది ఎప్పుడు చేసినా పేలుతుంది. కారణం అందులో సజీవమైన జీవత్వం ఉంది. కమిలి, (కమలాక్షి) ఆ విమోచనలో అరిచే అరుపులు మరిచిపోవడమనేది ఎవరికీ సాధ్యం కాదు. చాలా మంది దాసిలోని దృశ్యాలను చూసి కలత చెందారు. జర్మనీలో నా ఫ్రెండ్ కూతురు 'లా' చేసేది. దాసి స్క్రీనింగ్ తరువాత డిన్నర్‌కి తీసుకెళ్తానన్నది. తీరా షో అయిపోయాక నాకు కనిపించలేదు. మరునాడు కలిసి మీ 'దాసి' చూశాక మిమ్మల్ని కలువాలనిపించలేదు. నిన్ను డిన్నర్‌కి తీసుకుపోవడమేమోగాని నేనే డిన్నర్ చేయలేదన్నది". ఇట్లా చాలా అనుభవాలున్నవి.

ఒకసారి ఏపీ భవన్‌లో దాసి స్క్రీనింగ్ జరుగుతున్నది. ఒక మహిళ తన బిడ్డతో సినిమా చూస్తున్నది. అబార్షన్ దృశ్యాలను చూసి భరించలేక "అమ్మమ్మమ్మమ్మ" అని గట్టిగా అరుస్తూ బయటికెళ్లిపోయింది. గౌతం ఘోష్ దాసి చూసాక నా భుజం మీద చేయి వేసి దగ్గరికి తీసుకుని చాలాసేపు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా మాటల్లేకుండా ఉండిపోయాడు. పక్కనే మోహన్ అగాషే, గిరిష్ కర్నాడ్ అంతా ఉన్నారు. జయంత్ మహాపాత్రో దాసి సినిమా చూసి ఉత్తరం రాస్తూ " 'దాసి'లో ఎవ్రీ సీక్వెన్స్ యీజ్ ఎ హైకూ" అని ప్రశంసించారు. జ్ఞానపీఠ్ గ్రహీత యు.ఆర్.అనంతమూర్తి అయితే గట్టిగా కౌగిలించుకుని "మై కంట్రీ ఈజ్ ప్రౌడ్ ఆఫ్ యు" అన్నారు. మానిక్ బందోపాధ్యాయ, చిదానందదాస్ గుప్తా , రతన్ పరిమూ వంటి వారు దాసి చూశాక నా సినిమాలపై పరిశోధన చేయాలనే తలంపును వెలిబుచ్చారు. స్క్రిప్టుతో మొదలుకుని సినిమా తీసే వరకు ఒక తల్లి బిడ్డను కనడానికి ఎంత వేదన పడుతుందో అంతలా వేదనపడి తీసిన సినిమా 'దాసి', నిజంగా కూడా నా బిడ్డ 'దాసి' సినిమానే." అంటారు.

**ఒక 'దాసి' ఒక 'నరసింగరావు'**

"దాసి' సినిమా కోసం ఎ.కె.బీర్ (సినిమాటోగ్రాఫర్)కి నన్ను ముందుగా సూచించింది బాలూ మహేంద్ర. ఒకరోజు ఎ.కె.బీర్ చెన్నైలో బి.నరసింగరావును వెంటబెట్టుకుని మా యింటికి వచ్చారు. అంతకుముందే నేను బి.నరసింగరావు గురించి రెండు గొప్ప సినిమాలు తీసినట్లు విన్నాను. ఆయన సీరియస్ ఫిలిం మేకర్. 'దాసి'లో నటించేందుకు వెంటనే వొప్పుకున్నాను. ఒక్కలైన్‌తో సినిమా కాన్సెప్ట్ పంపారాయన. అది చూశాక ఆశ్చర్యపోయాను. ఎందుకంటే 20 ఏళ్ల క్రితం అంత పర్‌ఫెక్ట్‌గా వొకలైన్‌లో కథ చెప్పి ఆర్గనైజ్‌డ్‌గా ప్రణాళిక వేసుకున్నారు. అందులో కమిట్‌మెంట్ కనిపించింది. నన్ను కాస్త హోమ్‌వర్క్ చేయాలన్నారు. అవన్నేమో నాకలవాటు లేదు. చీర కట్టుకోవడం, జాకెట్టు ఎలా వుండాలి, ఎట్లా నిలబడాలి, ఎట్లా కూర్చోవాలి, నడక అన్నీ చూపారు. ఒరిజనల్ దాసీల దగ్గరికి తీసుకెళ్లారు. వాళ్లు ఎలా బొట్టు పెట్టుకుంటారు, వాళ్ల జీవనశైలీ కొన్ని రోజుల పాటు వారి దగ్గరుండి పరిశీలించే ఏర్పాటు చేశారు. దాంతో దాసిలోని 'కమలాక్షి' పాత్ర నాహృదయానికి దగ్గరయింది."

"జనజీవన ప్రవంతిలో గుర్తింపు లేని, నాలుగు గోడల నడుమ జీవితాన్ని ముగించే స్త్రీ బ్రతుకును తెరకెక్కించే అపూర్వ ప్రయత్నం చేశారు బి.నరసింగరావు. అమానవీయమైన, నైతిక సూత్రాలకు విరుద్ధమైన హింసననుభవించే కమలాక్షి పాత్ర నాకు దేశ దేశాల్లో పేరు తెచ్చింది. 'దాసి' వంటి సినిమా మళ్లీ వస్తుందనుకోను. అలాంటి ప్రయత్నం చేస్తే మళ్లీ నరసింగరావే చేయాలి. అలా జరిగితే మళ్లీ తెలుగు సినిమాల్లో నటిస్తాను. 'దాసి'తో వచ్చిన ఇమేజ్‌ను చెడగొట్టుకోలేకనే మరో తెలుగు సినిమాలో నటించలేదు.

నాకు తెలిసి ఒకదాసి. ఒక నరసింగరావు. ప్రపంచ సినిమా చరిత్రలో తన సినిమాల ద్వారా భారతీయ సినిమాకు స్థానం కల్పించిన గొప్ప డైరెక్టర్ బి.నరసింగరావు." అని ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'దాసి' కథానాయిక అర్చన పేర్కొన్నారు.

'దాసి' చిత్రంలో దొర (జయసింహారావు పాత్ర) కథానాయిక అర్చనతో పోటీ పడుతుంది. ఇదే విషయాన్ని ఆ పాత్రలో నటించిన భూపాల్‌రెడ్డి మాటల్లోనే "దాసి'లోని దొర జయసింహారావు పాత్రకు ఎంపిక చేయడంతోనే నా హోం వర్క్ మొదలైంది. తెలంగాణ దొర అంటే భారీకాయం, పెద్ద మీసాలు వంటి ఆకారంలో ఉండే విధంగా కాకుండా నడక, కనుచూపుల్లోనే దొరతనం చూపాలనేది నరసింగరావు పాత్ర ఉద్దేశం. కొట్టడు, తిట్టడు దొర. కానీ అతని అంతరంగంలోని క్రూరత్వాన్ని తన మాటలతో, భాషతో, వాయిస్‌తో, హావభావంతో చూపుతాడు. ఊరిలోని పేద రైతు భార్యను తన వద్దకు తీసుకరావాలని ఆదేశించడంలో, 'కమలి'తో తన ఏకాంతాన్ని చూసిన భార్యవైపు చూసే చూపుల్లోనే దొరతనం చూపించాలి. అంత గాంభీర్యంగా జయసింహారావును తయారు చేసుకున్నాడు దర్శకుడు బి.నరసింగరావు."

'దాసి' సినిమా తర్వాత తెలుగు సినిమా వెనుకబడి ఉందనడానికి ఎవరూ సాహసించలేదు. ప్రపంచంలో ఎక్కడ, ఎప్పుడు ప్రామాణికమైన సినిమాలను గురించి చర్చ వచ్చినా, అక్కడ తెలుగు సినిమా గురించి గౌరవప్రదంగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఇండియన్ సినిమాకి అంతర్జాతీయ ప్రతిష్ఠని ఆర్జించిపెట్టిన భాతీయ భాషా చిత్రాలలో ఇప్పుడు తెలుగు సినిమాకి కూడా పెద్ద పీట వేయడం మొదలుపెట్టారు.

కలకత్తా అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో దేశ విదేశీ ప్రతినిధుల, విమర్శకుల దృష్టిని విశేషంగా ఆకర్షించిన భారతీయ దర్శకులలో బి.నరసింగరావు ముఖ్యులని ఒక పరిశీలకుడు వ్యాఖ్యానించడం 'ఇండియన్ పనోరమా'లో 'దాసి' సాధించిన ఘన విజయానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అరవిందన్, గౌతమ్ ఘోష్, షాజీ, బాలూ మహేంద్ర వంటి ప్రసిద్ధ దర్శకులూ, 'షత్రంజ్ కే ఖిలాడీ' నిర్మాత సురేష్ జిందాల్ వంటి నిర్మాతలూ 'దాసి' చిత్రం చూసి నరసింగరావును అదేపనిగా అభినందించిన దృశ్యం చూసి చలన చిత్రోత్సవానికి హాజరైన తెలుగు సోదరులు మురిసిపోయారు. గోవింద్ నిహలానీ, తపన్‌సిన్హా వంటి దర్శకులు నరసింగరావు సినిమా శైలిని గుర్తించి అభినందించారు. 'దాసి'కి భారతీయ ప్రతినిధుల నుంచీ, పత్రికల నుంచీ లభించిన ప్రశంసలు అటుండగా, పనోరమా ప్రదర్శన ముగిసినప్పుడు విదేశీ ప్రతినిధులూ, ప్రముఖ విదేశీ పత్రికల నుంచి వచ్చిన విమర్శకులు ప్రకటించిన అభిప్రాయాలు ఎంతో ఉత్తేజకరమైనవి.

'దాసి'ని మాస్కోలో కూడా చూశాను...చివరి సన్నివేశంలో, 'దాసి'కి గర్భస్రావం చేసే దృశ్యంలో ఆ చీకటి గదిలో నుండి వెలుతురు చూపించిన తీరు నన్ను నిశ్చేష్టురాలిని చేసింది. అన్నారు ఇంగ్లాడు పత్రిక 'వెరైటీ'కి చెందిన డిబ్రాయాంగ్.

'దాసి' దర్శకుడు నరసింగరావు, ఈ తరహా దర్శకులలో తనదైన ఒక ప్రత్యేక శైలి ఉన్నవాడు. 'దాసి'లోని ప్రతి సన్నివేశంలోనూ దర్శకుడి కళా దృష్టి మనకి కనిపిస్తుంది. ఫోటోగ్రఫీ చాలా గొప్పగా ఉంది అని ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవపు డైరెక్టర్ వెటలూ కొనియాడారు. 'ఈ మధ్య కాలంలో, నాకు బాగా నచ్చిన చిత్రం దాసి. ఇందులో అర్చన నటన అద్భుతం. భారతీయ సినిమాలో 'దాసి' నిస్సందేహంగా ఒక విభిన్న చిత్రం. అని జపాన్‌లోని 'ఐజా ఫిలిం ఫెస్టివల్' నిర్వాహక అధికారి సూ–మైదా వ్యాఖ్యానించారు.

దాసిలో అన్ని శాఖలూ అద్భుతంగా వున్నాయి. దర్శకత్వ ప్రతిభ అపురూపంగా ఉంది. నేటి భారతీయ చిత్రాలతో పోలిస్తే దాసి చాలా ప్రభావపూరితమైన చిత్రం అన్నారు. న్యూయార్క్‌కి చెందిన టెలివిజన్, సినిమా నిర్మాత థామస్‌డువార్ట్. 'దాసి నాకెంతగానో నచ్చింది. శక్తివంతమైన ఇమేజెస్‌తో తనదైన ఒక కొత్త సినిమా భాషను సృష్టించుకున్నాడు దర్శకుడు నరసింగరావు' అని ప్రముఖ బెంగాలీ పత్రిక అమృత బజార్ పత్రికలో చంద్రలేఖా బసు రాశారు.

'ఒక్క మాటలో చెప్పాలంటే 'దాసి' పూర్తిగా దర్శకుడి చిత్రం. ఈ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో చూపిన సినిమాల్లో నాకు పూర్తిగా తృప్తి కలిగించిన సినిమా ఇదే' అన్నారు. దేశ దేశాల సినిమాలను పాఠాలుగా చదువుకునే పూనా ఫిలిం ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి కిషోర్‌వ్యాస్.

'దాసి దర్శకుడు నరసింగరావు ప్రతిభ అద్భుతం. నాకు తెలుగు సినిమా విపరీతంగా నచ్చింది. అందుకే ఇటలీకి ప్రదర్శన హక్కులు వెంటనే కొనుగోలు చేయాలనుకుంటున్నాను' అన్నారు ఇటలీకి చెందిన ఫిలిం డిస్ట్రిబ్యూటర్ శాంతో బ్లతారూ. 'దాసి'కి దాని దర్శకుడు నరసింగరావుకీ, నటీ నటులకీ, సాంకేతిక నిపుణులకీ కలకత్తా చలన చిత్రోత్సవంలో లభించిన అశేష ప్రశంసలలో ఇవి కొన్ని మాత్రమే.

**దాసి - అవార్డ్స్:**

ఐదు జాతీయ అవార్డులు

- ఉత్తమ నటి
- ఉత్తమ సినిమాటోగ్రాఫర్
- ఉత్తమ కళా దర్శకుడు
- ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్
- ఉత్తమ ప్రాంతీయ చిత్రం – 1989
- డిప్లమో ఆఫ్ మెరిట్ – 1989, మాస్కో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్





'మట్టి మనుషులు' చిత్రంలో అర్చన, మోహిన్ అలీబేగ్

## 'మట్టి మనుషులు'

### ఛిద్రమైన వలస జీవనం

బి.నరసింగరావు కమర్షియల్ ఫిలిం డైరెక్టర్ మాదిరిగా ఏడాదికి నాలుగు, అయిదు, కనీసం ఒకటి రెండైనా సినిమాలు తీసే కోవకు చెందినవారు కాదు. 1977–79 కాలంలో 'మాభూమి' కి ఒకానొక నిర్మాతగా, నటునిగా, సాంకేతిక నిపుణుడిగా పనిచేసిన ఆయన దర్శకుడిగా మారి మళ్ళీ సినిమా తీయడానికి మూడేళ్ళు పట్టింది. 1983లో 'రంగులకల' తీస్తే ఆ తరువాత 1988లో 'దాసి' తీశారు. నాలుగేళ్ళు పట్టింది 'దాసి' సినిమా తీయడానికి. ఆయనదంతా ఒక విభిన్న శైలి. సినిమా కథను తీసుకున్నపుడే దానిపై పూర్తిస్థాయి పరిశోధన చేస్తాడు. మరోవైపు అదే అంశంపై మరో బృందాన్ని పరిశోధనకు వినియోగిస్తారు. తానెక్కడైనా పొరబడినా, ఏదైనా అవసర సమాచారాన్ని విస్మరించినా పరిశోధనా బృందం ఇచ్చిన సమాచారంతో స్క్రిప్టును పటిష్ఠంగా రూపొందించుకుంటారు. 'దాసి' కథకు సంబంధించిన ఔట్‌లైన్స్ జర్నలిస్ట్ జి.కృష్ణ చెబితే దానిపై ఆయన చేసిన రీసెర్చ్ అంతా సినిమాలో కనిపిస్తుంది మనకు.

అట్లనే బి.నరసింగరావు గతంలో రాసిన 'చలి' అనే కథనే ఆ తరువాత1990లో తీసిన 'మట్టిమనుషులు' సినిమా. ఈ కథ 1980లో 'జ్యోతి' మాసపత్రికలో అచ్చయింది. లిటిల్ ఇండియా బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా బి.నరసింగరావు భిన్నమైన ఆలోచనలకు, ఆవిష్కరణకు దర్పణం పడుతుంది. "మట్టి మనుషులు" (1990). తెలంగాణ పల్లెల్లో ప్రధానంగా పాలమూరు వంటి జిల్లాలో బతుకుదెరువు లేక వలసపోయిన కూలీల జీవితాలు నగరాల్లో ఎలా ఛిద్రమవుతున్నవో ఈ చిత్రం చూపుతుంది. పల్లెటూళ్లలో పనులు దొరక్క పెళ్లాం బిడ్డలతో తట్టాబుట్టా మోసుకుని పట్నాలకు వెళ్లే లక్షలాది కూలీల దుర్భర జీవితాలకు ఈ చిత్రం దర్పణం పడుతుంది.

"దాసి" కథనంలాగే "మట్టి మనుషులు" కథాకథనాలు కూడా పరాధీనంగా బ్రతికే స్త్రీ జీవితం ఎంత దయనీయంగా ఉంటుందో చూపుతుంది. పల్లె నుండి పట్నం వచ్చిన పోచమ్మ, నర్సయ్య భవన నిర్మాణ కార్మికులుగా పొట్ట పోసుకుంటుంటారు. వారికో బిడ్డ. ఎంత తొందరగా నాలుగు రూపాయలు జమ చేసుకుని మళ్లీ తమ పల్లెకు ఎప్పుడు వెళదామా అన్నట్లు పోచమ్మకు ఉంటుంది. కానీ నర్సయ్య దుబారా ఖర్చుతో విలాసాలకు మరుగుతాడు. తాగుడు, అనారోగ్యం, అప్పులు పెరిగిపోతాయి. వాటికి తోడుగా వారి జీవితాల్లోకి గౌరమ్మ అనే కొత్త కూలి అడుగు పెడుతుంది. దాంతో పోచమ్మ – నర్సయ్యల మధ్య సంబంధాలు చెడిపోతాయి. అప్పులు పోచమ్మకు వదిలి గౌరమ్మతో తన సరదాలు తీర్చుకుంటుంటాడు. చివరికి నర్సయ్య పోచమ్మని వదిలి గౌరమ్మను తీసుకుని వెళ్లిపోతాడు.

భవన నిర్మాణ కార్మికుల్లో ఉండే ఆర్థిక, శారీరక దోపిడీ యత్నాలకు పోచమ్మ లక్ష్యమవుతుంది. అనారోగ్యంతో అసహాయం గా ఉన్న పోచమ్మను మేస్త్రీ బలవంతం చేయడానికి యత్నిస్తాడు. నర్సయ్య చేసిన అప్పులు తీర్చాలనే ఒత్తిడి ఆమెపై పెరుగుతుంది. గుడిసెలు వేసి ఇస్తానన్న స్థానిక చోటా నాయకుడి దృష్టి పోచమ్మపై పడుతుంది. జబ్బులో ఉన్న పోచమ్మను దవాఖానా కు తీసుకెళ్లే నెపం మీద వెంట వెళ్లి అతి దీనస్థితిలో ఉన్న ఆమెపై అత్యాచారం చేస్తాడు. చివరకు ఆమె నడిరోడ్డుపైనే ప్రాణాలు వదుల్తుంది. ఏం జరిగిందో తెలియని పసిబిడ్డ పడి పోయిన తల్లిని చూసి బిగ్గరగా ఏడుస్తుంది. ఆ జనారణ్యంలో ఆ పసివాడి రోదనను ఎవరు పట్టించుకుంటారు? ఇది కథాంశం.

1990లో జాతీయ అవార్డు పొందిన "మట్టి మనుషులు" చిత్రం గురించి "ది డైలీ" పత్రిక కఠినమైన వాస్తవాలను ఎనభైయేడు నిమిషాల్లో చూడవచ్చని ప్రశంసించింది.

మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పాల్గొన్నపుడు భారతీయ సినిమా ప్రాభవాన్ని చాటింది 'మట్టిమనుషులు'. అక్కడి ప్రావ్దా, ఇస్‌వెస్టియా, ట్రూడ్ పత్రికలు నరసింగరావు దర్శకత్వ ప్రతిభను, అర్చన నటనను ఆకాశానికెత్తి రాసినవి. మరో పత్రిక లోనైతే బి.నరసింగరావును 'ది కిల్లర్ ఆఫ్ ది కిష్చ్' అంటూ గొప్పగా రాసింది.

బి.నరసింగరావు సినిమాల్లోని పాత్రలన్నీ సహజసిద్ధంగా ఉంటవి. సమాజంలో మనకు కనిపించే మనుషులను పోలి ఉంటాయి. 'రంగులకల', 'దాసి' చిత్రాల మాదిరిగా 'మట్టి మను షులు'లో కూడా ప్రధాన పాత్రలన్నీ మనకు కనిపించే సమాజం లోనివే. అందుకే ఆయా పాత్రధారులు ఆయా రంగాల మనుషుల మధ్య ఉండి పాత్రల స్వభావాలను అర్థం చేసుకుంటారు. అట్లానే మట్టిమనుషులు లో పోచమ్మ పాత్రలో నటించిన అర్చన, మరో కొత్త కూలీగా గౌరమ్మగా నటించిన నీనా గుప్తా కొంతకాలం పాటు భనవ నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల నడుమ జీవించి పాత్రల స్వభావాన్ని ఆకళింపు చేసుకున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవలసిన విషయం ఒకటుంది. బి.నరసింగరావు 'దాసి' చిత్రం చూశాక నీనాగుప్తా ఆయన చిత్రాలలో నటించాలన్న కోరికతో గౌరమ్మ పాత్ర చేస్తానని అడిగి మరీ చేసింది.

'మట్టిమనుషులు' చిత్రం మద్రాసు ఫిల్మోత్సవ్‌లో ప్రదర్శించి నపుడు మన దేశానికి చెందిన హృషికేష్ ముఖర్జీ, అమోల్‌పాలేకర్, సాయిపరంజేపీ, చిదానంద్‌దాస్ గుప్తా వంటివారే గాక, అమెరికా లోని ఆసియన్ సినిమా స్టడీ సొసైటీకి చెందిన మిరెంబిన్‌ఫోర్డ్, హాలీవుడ్ రిపోర్టర్ జానెట్ ఫైన్, ఆస్ట్రేలియాలోని షిడ్ని ఫిలిం ఫెస్టివల్‌కి చెందిన పాల్ బైరన్స్, జపాన్ సినీ పాత్రికేయుడు చుమెడా, న్యూయార్క్ విలేజ్ వాయిస్ ప్రతినిధి యం.హాఫెజ్, బ్రైట్లైడ్ రేడియో

'మట్టి మనుషులు' చిత్రం సెట్‌పై భానుప్రకాశ్, అర్చన, ఏ.కె.బీర్‌లతో బి.నరసింగరావు





'మట్టి మనుషులు' చిత్రంలో అర్చన, మాస్టర్ వసంత్

ప్రతినిధి నేనాడ్‌మాకిక్, బ్రిటన్ నుండి వెలువడే గార్డియన్ పత్రికకు చెందిన క్రిటిక్ డిరెక్ మాల్కం వంటి విదేశీ ప్రముఖులు ఈ చిత్రాన్ని వేనోళ్ళ కొనియాడారు.

'మట్టిమనుషులు'లో దర్శకుడుగా బి.ఎన్. చిత్రీకరణలో తనదైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడు. ప్రాణం లేని వస్తువులు, ప్రాణం ఉన్న మనుషులను సమన్వయం చేస్తూ అద్భుతంగా దృశ్యమనాం చేస్తారు. హాలీవుడ్‌లో చేయి తిరిగిన దర్శకులకు ఏమాత్రం తీసిపోకుండా ఛాయాగ్రహణం ఉంటుంది. తక్కువ సంభాషణలు ఉండేలా నిజ జీవితంలో కనిపించే మనుషుల దర్శకుడు నేర్పుగా మర్మాలను వ్యక్తీకరిస్తాడు.

"సినిమా రూపకల్పనలో దర్శకుడు చెప్పదలచుకున్న అంశాలను వెలుగునీడల్లో సమర్థవంతంగా చెప్పలేని సందర్భాలలో సంగీతం నృత్యాలపై ఆధారపడవలసివస్తుంది. అయితే రేఖా మాత్రంగా సంగీతాన్ని ఉపయోగించడాన్నే ఇష్టపడతానంటా రాయన.

మాస్కోలో 'మట్టిమనుషులు' ప్రదర్శన తరువాత అక్కడి విమర్శకులు ఒక్కసారిగా బి.ఎన్.ని చుట్టుముట్టారు. ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. మాస్కో రేడియో, టి.వి.ల్లో ఈ సినిమా ఆడ్స్ ప్రసారం చేశారు. ఒకరకంగా బి.ఎన్. "మట్టిమనుషులు" కు మాస్కో "సలాం" చేసింది.

ప్రసిద్ధ మాస్కో పత్రిక "ప్రావ్దా" సున్నితమైన తీపి చేదు కలయికలతో కూడిన భారతీయ సినిమాలో తరచూ కనిపించే దృశ్యాలు ఈ చిత్రంలో ఉండవు. నాటకీయమైన ప్రభావాలుండవు. భారతీయ సినీ ప్రేక్షకులకు ఆహ్లాదాన్నిచ్చే ఆటలు, పాటలు ఈ చిత్రంలో లేకపోవడం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. ఒక గ్రామీణ జంట తమ వూరు విడిచి నగరంలో జీవించవలసి వచ్చి నప్పుడు ఏం జరిగిందోనన్నదానికి తనదైన శైలిలో దృశ్యరూపంలోకి మార్చారు. భారతీయ సమాజంలో జీవించే సాధారణమైనవారి జీవన గాథని అత్యంత సహజంగా క్లుప్తంగా కళాత్మకంగా దర్శకులు చూపించారని రాసింది.

**మట్టి మనుషులు - అవార్డ్స్:**

- డిప్లొమా ఆఫ్ మెరిట్, మాస్కో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్, రష్యా, 1991
- జాతీయ అవార్డు, ఉత్తమ ప్రాంతీయ చిత్రం, భారతదేశం, 1990



'మట్టి మనుషులు' చిత్ర దర్శకుడిగా రాష్ట్రపతి వెంకటరామన్‌చే అవార్డు అందుకుంటున్న బి. నరసింగరావు



'హరివిల్లు' స్క్రీనింగ్ తరువాత ఎ.పి. గవర్నర్ సూర్జీత్‌సింగ్ బర్నాలతో బి.నరసింగరావు

**హరివిల్లు:**

**ఇంద్ర ధనుస్సు పాడిన శైశవగీతం:**

సినిమాలు తీయడం అన్నది బి.నరసింగరావుకు ఒక మహా యాగం వంటిది. ఈ మాట ఎందుకు చెప్పవలసి వస్తున్నదంటే ఏదో పదో, పాతికో సినిమాలు తీసేసి రికార్డు నెలకొల్పాలనుకున్నవారైతే ఏడాదికి ఒక్క సినిమా అయినా తీస్తారు. కానీ మన బి.ఎన్. అట్లకాదు. సినిమా సినిమాకు ఏండ్లతరబడి సమయం తీసుకుంటారు. రంగులకలకు 'దాసి'కి, 'మట్టిమనుషులు'కు మూడేండ్లు నడుమ సమయం తీసుకున్నారు. అయితే ఆతరువాత 'మట్టిమనుషులు', 'హరివిల్లు'కు పదమూడేండ్ల సమయం తీసుకున్నారు. ఈ రెండు చిత్రాల నడుమ 1991లో 'ఆకృతి' డాక్యుమెంటరీ ఒకటి తీశారు. ఆయన తలుచుకుంటే తీయాలనుకుంటే ఏటా ఒక సినిమా తీయగలరు. కానీ పదేళ్ళకో సినిమా తీస్తారు. అదే వంద చిత్రాలతో సమానమవుతుంది.

2003లో 'హరివిల్లు' సినిమాతో దశాబ్దం తరువాత డైరెక్టర్‌గా సెట్స్ మీదికి వచ్చారు బి.నరసింగరావు. సుప్రసిద్ధ సురేష్ ప్రొడక్షన్స్ అధినేత డి.రామానాయుడు. ఆయన ఫక్తు కమర్షియల్ ప్రొడ్యూసర్. అలాంటాయన నరసింగరావుతో సినిమా తీయడానికి ముందుకు రావడం అంత మామూలు విషయం కాదు. ఒక బాలుడి మానసిక సంఘర్షణ ఆధారంగా రూపొందిన సినిమా ఇది. బి.ఎన్. ఈ కథను 11 సంవత్సరాల క్రితం తయారుచేసుకున్నారు. మూడేళ్ళపాటు కథపై పరిశోధన చేశారు. చలం కొడుకు జీవిత కథ, టాగురు పోస్టాఫీస్‌లతో పాటు పిల్లల మనస్తత్వంపై ప్రపంచవ్యాప్తంగా పలువురు సైకాలజిస్టులు రాసిన పుస్తకాలు, పలు దినపత్రికలలో వచ్చిన వార్తా కథనాల ఆధారంగా స్క్రిప్టును రూపొందించుకున్నారు.

హరివిల్లు చిత్రానికి సంబంధిం బి.నరసింగరావుకు ప్రధాన ప్రేరణ 'గీతాంజలి' అనే అమ్మాయి. కేన్సర్ వ్యాధి సోకడంతో ఆ అమ్మాయి చిన్నవయసులోనే కాలంచేసింది. మీరట్‌లో పుట్టిన గీతాంజలి కాన్సర్ బారినపడి బొంబాయిలో 1977లో చనిపోయింది. అయితే కేన్సర్ విషాదం ఆ అమ్మాయిచేత అద్భుతమైన కవిత్వం రాయించింది. ఆ అమ్మాయి మరణించాక, ఆ కవిత్వాన్ని ప్రితీష్‌నంది 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' లో ప్రచురించి ఆమె కవిత్వంలోని గొప్పతనాన్ని అందరికీ తెలియజెప్పారు. రోజురోజుకూ మరణం దగ్గరవుతుందని తెలిసిన ఆ లేత మనసు కవిత్వం రాయడం నరసింగరావులోని సినిమాకారుడిని ఒకచోట స్థిరంగా ఉండనీయలేదు. గీతాంజలిని తన సృజనాత్మక ప్రపంచంలోకి తీసుకువచ్చి సినిమా తీయాలనుకున్నారు. అట్లా రూపొందిన కథనే 'హరివిల్లు'.

**అసలు హరివిల్లు సినిమా కథేమిటంటే-**

ఆకాశంలో వానపడి వెలసినపుడు ఏర్పడిన హరివిల్లును చూడగానే పిల్లలు ఆనందంతో అద్భుతం చూసినంతగా కేరింతలు కొడతరు. ఆనందంతో గంతులువేస్తారు. ఆ ఇంద్రధనుస్సు తమకోసమే

ఆకాశంలో ఏర్పడిందని ఆనందపడతారు. అయితే ఇంద్రధనుస్సుది అల్పాయిష్షు. అది ఎంతోసేపు ఆకాశంలో నిలిచి ఉండదని వారికి తెలియదు. అది అదృశ్యమయితే ఆకాశం మళ్ళీ నిర్మలంగా మారి పోతుంది. రవి జీవితం కూడా హరివిల్లువంటిదే.

పట్టుమని పదేళ్ళుకూడా నిండని రవి అంతుచిక్కని వ్యాధి బారిన పడతాడు. మృత్యువు రోజురోజుకూ అతనికి చేరువవుతుంటుంది. అయితే రవి కూడా అందరి పిల్లల్లాగే క్రికెట్ ఆడాలని, సైకిల్ తొక్కాలని, స్కూలుకెళ్లాలని ఉన్నా అవి సాధ్యపడవు. తల్లిదండ్రులు ఎంతమంది డాక్టర్లకు చూపించినా జబ్బు తగ్గే మార్గం లేకపోయింది. ఇక రవికి అంతిమ ఘడియలు చేరువకావడానికి ఎన్నోరోజులు పట్టవని తేలిపోతుంది. దాంతో ఆ కుటుంబం విషాదంలో మునిగి పోతుంది. రవి తండ్రి తన బాధను మద్యంతో పంచుకుంటాడు. మనసు కుదుటపరుచుకోవడానికి తల్లి ధ్యాన కేంద్రాలకు వెళుతుంది. ఆ ఇంట్లో రవి బాగోగులు చూసుకోవడానికి పదేళ్ళ గౌరిని కుదురు స్తారు. అప్పటివరకూ తన ఈడువారితో కలువలేని రవిలో గౌరి రాకతో ఒక్కసారిగా ఆనందం విరబూస్తుంది. గౌరికి తను వేసిన పెయింటింగ్స్, కంప్యూటర్ గేమ్స్, తన బొమ్మలూ అన్నీ చూపిస్తూ సంతోషపడతాడు. వాటితో గౌరిని కూడా ఆడుకోమంటాడు. ఇంట్లో తనకేమి కొనిచ్చినా వాటిని గౌరికి కూడా కొనివ్వమంటాడు రవి. తెల్లారింది మొదలు రాత్రివరకు గౌరి తనవెంట ఉండవలసిందే. తను తినే తిండినే గౌరికి కూడా పెట్టాలంటాడు. తల్లి కాదంటే మారం చేస్తాడు. అయితే తల్లికి ఇవన్నీ ఇష్టం ఉండదు. పనిపిల్లతో రవికి చనువు పెరగడం తల్లి సహించదు. ఇదే సంగతి భర్తతో చెబితే ఆఖరి క్షణాల్లోనైనా రవిని ఆనందంగా గడపనివ్వమని చెబుతాడు.

ఇటు రవి, గౌరిల మధ్య స్నేహం మరింత బలపడుతుంది. ఒకరిని విడిచి మరొకరు ఉండలేని స్థితికి వస్తారు. ఒకరోజు ఇద్దరూ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికైనా వెళ్ళిపోయి ఆనందంగా గడపాలని అనుకుంటారు. అనుకోవడమేగాదు అనుకున్నట్లుగానే కొన్ని బట్టలు, తినే పదార్థాలు, కొంత డబ్బు తీసుకుని ఆటోలో బయటికి వచ్చేస్తారు. ముందుగా కుతుబ్‌షాహీ టూంబ్స్‌కి వెళ్తారు. అక్కడ తమకిష్టమైన ఆటలు ఆడుకుంటారు. అట్లా ఆడుతూ, పాడుతూ రోజంతా తిరుగుతారు. అయితే రవి అలసటతో నీరసించిపోతాడు. చివరకు నిలువలేక పడిపోతాడు. ముక్కు నుండి రక్తం కారుతుండగా రవికి స్పృహ తప్పుతుంది. ఇది స్థూలంగా హరివిల్లు కథ.

రవి, గౌరి ఆడుకుంటున్నపుడు ఒక సీతాకోకచిలుక చనిపోతుంది. దాన్ని అట్లే వదిలివేయక గుంత తీసి బొందపెట్టి దానికి అంతిమ సంస్కారం చేస్తారు. ఒక ప్రాణిపట్ల దర్శకుడికుండే గౌరవభావం ఈ దృశ్యంలో కనిపిస్తుంది. ఈ సినిమా చూసిన డా॥కాకర్ల సుబ్బారావు 'తన బాల్యంలో కూడా ఒక సీతాకోక చిలుక చనిపోతే ఇట్లానే అంతిమ సంస్కారం చేశానని, ఆ దృశ్యం తనను మళ్ళీ తన బాల్యం లోకి తీసుకెళ్ళిందని చెప్పుకున్నారు. అలా చాలామంది 'హరివిల్లు' చిత్రంలో తమ బాల్యాన్ని తిరిగి చూసు కున్నారు.

బి.నరసింగరావు తన సినిమాల్లో మనకు తెలిసిన, మన

చెన్నై అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో మీటావసిస్ట్, శ్యాంబెనగల్, గోవింద్ నెహలానీలతో బి.నరసింగరావు





**మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో నాన్స్ (ఫ్రాన్స్) చలన చిత్రోత్సవ డైరెక్టర్ అలెన్ జల్లడోతో బి.నరసింగరావు**

జీవితంలో ఒక భాగంగా చుట్టూరా భ్రమించే సంఘటనలనే చిత్రీకరిస్తారు. కాకపోతే అప్పటిదాకా మనం పట్టించుకోం. వాటి విలువనూ అర్థం చేసుకోం. తీరా ఆయన సినిమాల్లో వాటిని చూడగానే అంతర్లీనంగా వాటిలో ఉండే శక్తిని చూసి మనం పక్కలో బాంబు పేలినంతగా ఉలిక్కిపడతాం. అట్లా మనకు తెలిసిన వాటినే చూస్తున్నాం అనుకునేలా దృశ్యయానం చేయిస్తూ చేయి పట్టుకుని ఒక మార్గదర్శిలా ముందుకు తీసుకెళ్తాడు. అప్పటిదాకా మనం కోల్పోయినదేమిటో మనకు చూపిస్తాడు హరివిల్లులో. నాగరికత పేరుతో మన జీవితాల్లోకి ప్రవేశించిన వారిని విడగొడుతూ, ఆధునికత అనే వడగాడ్పులను పక్కకు జరిపి పిల్లతెమ్మెరలాంటి తాత్వికతను దర్శింపజేస్తాడు.

రవి జీవితంలోకి పల్లెనుండి వచ్చిన గౌరి రాకనే ఒక హరివిల్లు అని చెప్పకనే చెబుతాడు. గౌరి రావడంతో రవిలోని పిచ్చివాని భయం, అసంబద్ధ ఊహలు గాలికెగిరిపోయి అశల పల్లకిలోకి ఎక్కి కూర్చుంటాడు. తన మనోనేత్రం నుండి భూమిని-ఆకాశాన్ని ఒకేసారి ఆస్వాదిస్తాడు. నిరాశావాదం నుండి ఆశాభావంతో జీవనకాంక్ష ద్విగుణీకృతమవుతుంది. తల్లిదండ్రులు, పనివాళ్ళు, డాక్టర్లు ఎవరూ రాలేని అతని అంతర్ ప్రపంచంలోకి తెలంగాణ పల్లె జీవనానికి ప్రతీకగా కనిపించే గౌరి సునాయాసంగా వచ్చేస్తుంది. అతన్ని సంతోషంతో అలరింపజేస్తుంది. తాంబాళంలోని నీటిలో చూసే ప్రతిబింబంలో ఆకాశం కిందుగా వారిద్దరే రవి-గౌరి సగం సగం.

గోలకొండ కోటలో రవి గౌరి ఇద్దరు శత్రురాజుల్లాగా యుద్ధం చేయడాలు, మూలుగులు ఇవన్నీ రవికి నిజంగా దెబ్బలు తగిలాయే మోనన్న ఆందోళన కలుగుతుంది. అప్పుడు బాధపడిన గౌరి "ఈ కొట్టుకోవడాలు ఆటలుగానైనా వద్దు. పాత ఆటలే ఆడుకుందాం" అంటుంది. ఈ ఒక్కమాట తెలంగాణ పల్లెలపై శతాబ్దాలుగా జరుగుతున్న విభిన్న రూపాల దాడులను పరోక్షంగా గుర్తుకుతెస్తుంది. అలా పల్లె వేదనను విశ్వజనీన రూపంలో చూపుతారు బి.ఎన్. చివరికి రవి ఆఖరిక్షణాలు. గౌరి పల్లెనుండి వచ్చిన దుస్తుల్లో ఉంటుంది. గౌరీతో తమ పని తీరింది కనుక తాము అప్పటివరకూ కొనిచ్చిన దుస్తులను తిరిగి తీసుకుంటారు. ఈ దృశ్యంను తెరపై అద్భుతంగా చూపుతారాయన. తల్లిదండ్రుల పిలుపుకందని రవిని కూడా "బిట్వీన్ ద ఫ్రేమ్స్"లో ఉంచుతూ గౌరి పిలిస్తే స్పందిస్తాడే మోనని సైక్యాట్రిస్ట్ మందాకినితో చెప్పించడం, "తల్లిదండ్రులు పిల్లలను కంటారు. వారి ఆలోచనలను కాదు" అనే ఖలీల్ జీబ్రాన్ వాక్కును గుర్తుకుతెస్తుంది. సినిమాలో చాలాచోట్ల మాటల్లో చెప్పలేని భావాలను సంగీతాన్ని మాధ్యమంగా చూపుతారు దర్శకుడు బి.ఎన్. గౌరి దూరాన్ని భరించని తన మానసిక స్థితిని ఫోర్కుతో పళ్ళాన్ని గీరిన శబ్దం ద్వారా, వాళ్ళిద్దరూ సంతోషంతో ఆడిపాడేటప్పుడు నెమలి సైతం కుతూహలంగా చూడడం మనకు ఒక అద్భుత శబ్ద సౌందర్యాన్ని దర్శింపజేస్తుంది.

"నిజానికి బాలల చిత్రాలు ఏమీ రావడంలేదు అంటే తీయడం లేదు. పెద్దలకు మాత్రమే సినిమాలు తయారుచేయడంలో కనబరిచే శ్రద్ధ బాలల చిత్రాల విషయంలో ఎవరూ కనబరచడంలేదు.

ఇందుకోసం ఏమైనా భిన్నంగా తయారుచేయగలిగే బాలల సినిమా తీయాలన్న ఆలోచన చాలా ఏళ్ళకిందనే వచ్చింది. మంచి కథ కోసం వెదుకుతున్న సమయంలో ఈ కథ మనసుకు తట్టింది. ఏదో బాలల చిత్రం తీయాలన్న సంకల్పంతో తయారు చెసుకున్న కథ కాదిది. దీని వెనుక ఎంతో శ్రమ, పరిశోధన ఉంది. పిల్లల మానసిక ప్రవృత్తులకు సంబంధించి దాదాపు 150కి పైగా పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే హరివిల్లులోని సంఘటనలు మనకు ఎన్నో కనిపిస్తాయి. నాకు తెలిసిన చాలామంది ఈ సినిమా చూసి “ఇలాంటి సంఘటనలు మాకు తెలిసినవారి ఇంట్లోనే జరిగినవి. సినిమా చాలా చక్కగా తీశారు అని మెచ్చుకున్నవారున్నారు. పిల్లల మానసిక ప్రవృత్తులకు సంబంధించి 60-70 కేసులను పరిశీలించాక ఆలోచనల్లోపడి స్క్రిప్టు రాయడం జరిగింది. ఏరికోరి కొన్నింటిని మాత్రమే ఈ కథకు వాడుకున్నాను” అంటారాయన.

జీవితంలో ఒకానొక సందిగ్ధావస్థలో మరణాన్ని ఎదుర్కొంటున్న బాలుని మానసిక స్థితి ఎలా ఉంటుంది? అనే విషయాన్ని లోతుగా వెళ్ళి చేసిన చిత్రం ఇది. ఆయన తీసిన అన్ని చిత్రాల్లోనూ అంతర్లీనంగా చావు స్థితి ఉంటుంది. జీవితానికి సంబంధించిన ఒక చీకటి కోణాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించారు బి.ఎన్. సినిమా మొదటి సగంలోనే పిల్లవాడు చనిపోతాడని ప్రేక్షకులకు తెలుసు. అలా తెలిసినా సినిమా చివరివరకు ఉత్కంఠ కలిగించేలా తీశారు. ట్విస్ట్ ముందుగానే చెప్పేసి, సినిమాను ఎమోషన్‌గా తీయడం బహుశా బి.ఎన్.కొక్కరికే సాధ్యమవు తుందనిపిస్తుంది. అందమైన జీవితాన్ని మృత్యువు కబళిస్తుందని తెలిశాక బాధితుడే కాదు అతని చుట్టూ ఉన్నవారు ఎలా ప్రవర్తిస్తారు, వారి మానసిక ప్రవృత్తులను అతి సున్నితంగా చర్చించిన చిత్రం హరివిల్లు.

హరివిల్లు సినిమా ‘కల్ హెూ న్య హెూ’ లో షారూఖ్‌ఖాన్, ‘ఆనంద్’లో రాజేశ్‌ఖన్నా, ‘మిలీ’లో జయాబచ్చన్, ‘గీతాంజలి’లో గిరిజ వంటి పాత్రలను ముందుకు దాటివచ్చి తీసిన సినిమాగా మనకు కనిపిస్తుంది.

అదే ఇంటర్వ్యూలో బి.ఎన్. “1992లో మృత్యువు వచ్చి మా ఇంటి తలుపువద్ద ఆగిపోయిన అనుభవం ఉంది. కానీ ఆరోజు తలుపువద్ద నిలబడిన మృత్యువు నన్ను వెంటాడుతూనే ఉంది. ఆ తరువాత ఇల్లస్ట్రేడ్ వీక్లీలోని గీతాంజలి కవిత్వం కూడా. ఈ రెండే ‘హరివిల్లు’ సినిమా తీయడానికి కారణాలు అని అంటారాయన.

దాసి, మట్టిమనుషులు, చిత్రాలకు ఛాయాగ్రహణం చేసిన ఎ.కె.బీర్ ‘హరివిల్లు’కూ పనిచేశారు. సెన్సిటివ్ ఇమేజెస్‌ను అంత పకడ్బందీగా తీయడం బీర్‌కె సాధ్యమవుతుందనిపిస్తుంది. సంగీతం చేసిందికూడా బి.నరసింగరావే. ఆర్ట్ డైరక్టర్ పనితనం ఈ సినిమాకు అదనపు ఆకర్షణ. తెలుగులో డిజిటల్ డాల్బీ సౌండ్ సిస్టమ్‌లో తయారైన తొలి చిత్రం కూడా ఇదే. పతంజలి శాస్త్రి ఈ చిత్రానికి సహ రచయిత. సాంకేతికంగా ఈ చిత్రం అద్భుతంగా చిత్రీకరించ బడింది. ఇంకా చెప్పాలంటే బి.ఎన్.హరివిల్లు చిత్రం ఇంద్రధనుస్సు పాడిన ఓ శైశవగీతం.

బి.ఎన్.వి విభిన్న ఆలోచనలు, భిన్న భావనలు. వీటన్నింటికీ

**మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో మిస్ ఫెస్టివల్‌గా ఎన్నికైన లెబనీస్ నటీమణితో బి.నరసింగరావు**





ఒక సమగ్ర స్వరూప స్వభావాలు అద్ది ఆవిష్కరించాలనుకుంటాడు. కొన్నింటిని చిత్రకారుడిగా తన పెయింటింగ్స్‌లో చూసుకుంటాడు. మరికొన్నింటిని సంగీతంలో, ఇంకొన్నింటిని తనకు అత్యంత ఇష్టమైన కవిత్వంలో. సినిమా రూపకంగా సరేసరి. కొన్ని దృశ్యాలు ఫ్రేముల్లా ఆయన మస్తిష్కంలో అట్లానే నిలచిపోయి ఉంటాయి. వాటిని డాక్యుమెంటరీలుగా తీసి అందులోనూ సఫలీకృతుడైనారు. ఆయన తీసిన డాక్యుమెంటరీలు మూడు 'దిసిటి' (1987) 'మావూరు'(1988), 'ఆకృతి' (1991).

**హరివిల్లు - అవార్డ్స్:**

- బెస్ట్ జువెనైల్ ఆడియన్స్ అవార్డ్, 8వ ఢాకా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్ట్, బాంగ్లాదేశ్, 2004
- డబ్ల్యూహెచ్ఒ అవార్డు, 14వ కైరో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫర్ చిల్డ్రన్, ఈజిప్ట్, 2004
- బంగారు పతకం, బాలల చిత్రాల ఉత్తమ దర్శకుడు, ఎ.పి., 2004
- వెండి నంది, బెస్ట్ మేక్ అప్ ఆర్టిస్ట్, ఎ.పి. 2004

**ది సిటి:**

నరసింగరావు సినిమాకు ఒక గ్రామర్ ఉంటుందనీ, సినిమా దర్శకుల భాషలోనే దానిని వ్యక్తీకరించాలని, దానికి నాటకాల, భాషను వాడకుడదనంటారు. అలాగే డాక్యుమెంటరీల నిర్మాణంలో కూడా ఆయన తనదైన శైలిలో పనిచేస్తారు. ఆయన తీసిన 'దిసిటి' డాక్యుమెంటరీలో తన కళ్ళతో 30 ఏళ్ళుగా చూసిన హైదరాబాదు నగరాన్ని చిత్రీకరించారు. 450 ఏండ్ల చరిత్రగల హైదరాబాదు నగరాన్ని తన కళ్ళతో మనకు చూపించే ప్రయత్నం చేశారు. 96 నిమిషాల ఈ డాక్యుమెంటరీని ఏ మతాన్నీ, కులాన్నీ దృష్టిలో పెట్టుకుని తీయలేదు. సర్వమత సామరస్యాన్ని, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని హైదరాబాదు నగరం కాపాడుకుంటూ వస్తున్నదన్న విషయాన్ని 'దిసిటీ' డాక్యుమెంటరీలో అంతర్లీనంగా చెప్పానంటారాయన.

కాకతీయులు నిర్మించిన మట్టికోటల్ని 1518లో కుతుబ్‌షాహిలు గోల్కొండ రాజ్యంగా మార్చారు. 1551లో చార్మినార్ నిర్మాణం కూడా మొదలైంది. అది మొదలు మధ్యయుగ కాలపు శోభను హైదరాబాదు సంతరించుకున్నది. ఎందరో హైదరాబాదుకు వచ్చి స్థిరపడిపోయారు. కుతుబ్‌షాహిలు తెలుగుకు ప్రత్యేక హోదా ఇవ్వడంతోబాటు దక్కని భాషను పరిచయం చేశారు. అదే తరువాతి తరంలో ఉర్దూగా మారింది. సమాధులు, గోలకొండ శిథిలాలు భవంతులు, మసీదులు, సరస్సులు, చెరువులు, వాస్తుకళ... అప్పటి హైదరాబాదు అద్భుతాలు. అసఫ్‌జాహీల కాలంలో బ్రిటిషర్లు హైదరాబాదులో స్థావరం ఏర్పరచుకున్నారు. 1857 తొలి స్వాతంత్ర్య సమరంలో నిజాం బ్రిటిషర్లకు అండగా నిలబడ్డాడు. మొదటి సాలార్జంగ్ పాలనలో హైదరాబాదు అభివృద్ధి మొదలైంది. 7వ నిజాం పాలనలో పారిశ్రామికంగా వ్యాపారపరంగా ముందడుగులు పడినవి. జాతీయోద్యమ కాలంలో హైదరాబాదు మౌనంగా కూర్చోలేదు. నాటి భారతదేశంలోని ఇతర రాజ్యాలను మేల్కొలిపింది. ఈ కాలంలోనే గ్రంథాలయాలు, వార్తా పత్రికలు మొదలైనవి. ప్రజలు నిజాం క్రూర పాలనకు ఎదురుతిరగడం మొదలైంది. తెలంగాణ విమోచన, మిగతా ఎన్నో ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. 1948లో హైదరాబాదు స్టేట్ ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. ఇంత ప్రాభవం ఉన్న హైదరాబాదు నగర చారిత్రక సౌందర్యాన్ని 'దిసిటీ' డాక్యుమెంటరీగా తీశారు బి.ఎన్.

"మనం చరిత్రను చదువుతాము, వింటాము కూడా. ఆ చరిత్రను తవ్విపోసుకునే సమయంలో బయల్పడిన వాస్తవాలను ఒక అపురూపమైన ఒక స్మారకాలుగా చూస్తాము. ఆ చారిత్రక సమయంలోని పరిణామ వికాసాలు మనకు నమ్మలేని నిజాలను చూపిస్తాయి. అది చూసి ఆశ్చర్యపోవడం మనవంతు అవుతుంది. కానీ ఆ తరువాత క్షణమే మన చారిత్రక వైభవాన్ని అర్థం చేసుకుని పొంగిపోతాము. చరిత్ర అవశేషాల నడుమ నిటారుగా నిలబడుతాము. మనం మళ్ళీ ఇరవయ్యో శతాబ్దంలోకి తిరిగివస్తాము. వర్తమానంలో ఆకాశహర్మ్యాల మాదిరిగా కళ్ళెత్తి చూస్తే మనకు కళ్ళు చెదిరిపోయే కాంతులు కనిపిస్తుంటాయి. నెత్తుటి స్నానాన్ని ఆస్వాదించిన చరిత్రకు, నడుస్తున్న కాలానికి తేడా ఏమీలేదు. చరిత్రలో మనకు కనిపించని కోణాన్ని వర్తమాన దృష్టితో 'ది సిటి' డాక్యుమెంటరీ ద్వారా చూపించాను" అనంటారు బి.నరసింగరావు.

హైదరాబాదు మహా నగరపు హడావుడి జీవన సరళిలో ఇరుక్కోలేని నరసింగరావు అప్పటికి గత ముప్పై ఏళ్ళుగా ఈ నగర జీవితంలో ఒకడుగా జీవించారు. ఈ క్రమంలో ఆయనకు తీపి, చేదు అనుభవాలు, విభిన్నమైన అనుభూతులున్నాయి. ఈ హైదరాబాదు జీవితాన్ని తన సంతోషంలో ఖైదు చేశారాయన. అదే ఈ డాక్యుమెంటరీలో కనిపిస్తుంది.

'సూర్యుడిని అరచేతిలో ఖైదు చేయడం అనేది ఎలా సాధ్యపడదో, ఒకరి జీవితాన్ని తన చేతుల్లో పెట్టి ఖైదు చేయడం కూడా అంతే. 'ది సిటీ' దీన్ని ప్రతిబింబించేలా ఉంటుందనంటారు బి.ఎన్. ఈ డాక్యుమెంటరీ రూపకల్పనలో బి.ఎన్.కి గతం, వర్తమానం అనేవి ఏవీ కూడా ఆయనకు సమస్యలు కాలేదు. 'ది సిటీ' నిర్మాణమంతా కూడా ఒక భావావేశంలో తీయని అనుభూతులతో సాగిందంటారాయన. సృజనాత్మక కళారంగంలో పనిచేసే బి.ఎన్. వంటివారు తమను తాము అంతర్లీనం చేసుకుని పనిచేస్తారు. హైదరాబాదు నగరంలోని చారిత్రక వైభవాన్ని రాజులు, నవాబుల కోటలు, కట్టడాలు, ఉద్యాన వనాలుతో పెనవేసి చెబుతారాయన.

'చరిత్ర'ను చెప్పడమా? సృష్టించడమా? పెద్ద పెద్ద భవంతుల వాస్తుకళా వైభవమా? మనిషి ఊపిరి పీల్చుకోవడం లేదా భూమిపైన ఎదురు తిరిగిన వారిని వారి సృజనాత్మకతను అంతం చేస్తారా? చరిత్ర అసహ్యించుకుంటుంది...' అనేది బి.నరసింగరావు భావన. ఇవన్నీ 'ది సిటీ'లో మనకు కనిపిస్తవి.

'ది సిటీ'లో కదిలే దృశ్యాలు నిశ్శబ్దంగా ఎన్నో కథలు చెబుతాయి. వీటిని వినేందుకు శక్తి ఉంటే మనం ఆ కథల కడలిలో మునిగిపోతాం. ఎందుకంటే మనం ఇరానీ టీ కప్పును ముందుంచు కుని తాగకుండా ఉండలేము. 'ది సిటీ' చూశాక ప్రేక్షకుడు తనలోని సున్నితత్వాన్ని తెలుసుకుంటాడు.



**ది సిటి చిత్రీకరణలో కౌల్‌తో బి.నరసింగరావు**

హైదరాబాదు నగర ప్రజల ప్రత్యేకమైన, సంస్కృతి, సాంప్రదాయాలు, నిత్య జీవనశైలి, వీటితోపాటు నగరాన్ని అల్లుకు పోయిన పేదరికపు గాలి, చరిత్రకు సాక్ష్యంగా నిటారుగా నిలిచిన చార్‌మినార్, కుతుబ్‌షాహీల సమాదులు, మక్కామసీదు వంటి పురాతన నిర్మాణాలు, నాగరకత పెరిగిన నగర జీవన విలాసం అన్నింటినీ 'దిసిటి' కళ్ళముందు నిలుపుతుంది. 'ది సిటి' తీసింది 1987లోనే అయినా, 1950ల నాటికి హైదరాబాద్ నగర సౌందర్యాన్ని దృశ్యబద్ధం చేశారు బి.నరసింగరావు.

'దిసిటీ' డాక్యుమెంటరీలో ఉస్తాద్ బడేగులాం అలీఖాన్, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, పండిట్ జస్రాజ్, విలాయత్‌ఖాన్, అక్బర్ అలీఖాన్ తదితర సంగీత విద్వాంసుల స్వర విన్యాసాలతో అనిర్వచనీయమైన అనుభూతిని కలుగజేస్తుంది.

**ది సిటీ -అవార్డు:**

- వెండి నంది, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, భారతదేశం, 1987

**మావూరు:**

'నా జ్ఞాపకాలన్నీ బాల్యంతోనే ముడిపడి ఉన్నవి. అలాగే నేను పుట్టి పెరిగిన మావూరిలోనే నా బాల్యం గడిచింది. మావూరు అంటే కొన్ని ఇండ్లు, పొలాలు మాత్రమేకాదు స్వచ్ఛమైన గాలి, ప్రకృతి సౌందర్యం, కల్మషం ఎరుగని మనుషులు, ఆత్మీయత, అనురాగం అన్నీ ఉన్నవి. ఏ ఊరులో లేని ప్రత్యేకత మా ఊరుకి ఉంది. ఆ ప్రత్యేకత ఏమిటో చూపటానికే 'మావూరు'ను తెరకెక్కించాను' అంటారు బి.ఎన్.

ఆయన తన బాల్యం నుండి సొంతవూరులో చూసినవాటిని తన అంతరాంతరాలలో నింపుకుని తీసిన డాక్యుమెంటరీ 'మావూరు'. మావూరు అంటే తాటి గుడిసెలు, పొడవాటి మట్టిరోడ్లు, పారుతున్న చెరువు నీరు, నీటిలో పడి దొర్లే పశువులు, కొండలు, కోనలు, గుట్టలు.... అన్నీ కలిస్తే 'మావూరు' ప్రకృతి దృశ్యం. ఇదే ఆయనకు ఊరిపైనున్న అవగాహన. తను అనుకున్నది అనుకున్నట్లుగా దృశ్యబద్ధం చేశారు. పిల్లల ఆటలు, జానపదాలు, తెల్లవారుజామున ప్రకృతి సౌందర్యం, ఉదయకిరణాలు, ఇరుకైన దారులన్నీ కలిసి 'మావూరు'లో కళాత్మక దృశ్యాలుగా కనిపిస్తవి.

పొలాల్లో రైతుల పనిపాటలు, తలపొగరున్న భూస్వాములు, ఎన్నో దుఃఖకరమైన కథలు. రైతులు బీదలే కావచ్చు. కానీ వారి మనసులు ఉదారమైనవి. జానపదులు వూరికి గుండెకాయవంటివారు. వారి ఆశలు, కలలు అన్నీ వారి పనితనంలో కనిపిస్తాయి. వూరిలోని ప్రజలు వయోభేదం లేకుండా వారి వారి పనుల్లో ఒదిగిపోతారు. వారి సృజించిన నైపుణ్యాలు, కళలు వారి శ్రమ నుండే పుట్టినవి. ఇవన్నీ వారి జీవన సౌందర్యాన్ని వ్యక్తంచేస్తాయి. కమ్మరి, వడ్రంగి, కంసాలి, వేరువేరు వృత్తి కులాలవారు గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తారు.

వూరిలోని ప్రతి గుడిసెలో కవ్వం చిలికిన సడి వినిపిస్తది. రోకట్లో దంచే శబ్దం, ఆకుపచ్చ గడ్డి, మెల్లిగా కదిలే ఆవులు, దున్నలు కనిపిస్తుంటవి. పాలు పితికే సన్నివేశం గ్రామసీమల్లో మనోహర దృశ్యం. రైతు నడుముకు తువ్వాలు కట్టుకున్న మనిషిలా చేలకి కాపలాగ నిలబడటం ఒక సుందర దృశ్యం. పండుగలు, పాటలు, జాతరలు ఇవన్నీ మనిషికి రోజువారీ శ్రమ నుండి ఊరటనిస్తాయి. ప్రతి పనిలో అంతరార్థం ఉంటుంది. సామరస్య జీవనశైలి వూరి బతుకు చిత్రంను కళ్ళముందు కనిపింపజేస్తుంది. ఈ డాక్యుమెంటరీ జీవితాన్ని చూపిస్తుంది. సహజ రంగుల్లో ఆవిష్కరిస్తుంది.

'మావూరు' 51 నిమిషాల నిడివిగల డాక్యుమెంటరీ. ఈ డాక్యు మెంటరీని తన గ్రామీణ జీవన ప్రేరణతోనె తీశారాయన. 1953-55 సంవత్సరాల మధ్యకాలంలో తెలంగాణ గ్రామం అన్నది ఎలా ఉండే దో ఈ డాక్యుమెంటరీలో చూపే ప్రయత్నం చేశారు. అప్పటి వాతా వరణాన్ని మళ్ళీ సహజంగా చిత్రీకరించడానికి 100 గ్రామాలు తిరిగి సుమారు ఆరువేల కిలోమీటర్లు ప్రయాణించి చిత్రీకరణ జరిపారు.

"నా ఆలోచనేమిటంటే గ్రామీణ తెలంగాణ అన్ని కోణాల్లోంచి చిత్రీకరింపబడాలి. మొదటిది వూరిలో జీవనశైలిని ప్రదర్శించడం, రెండోది వూళ్ళలోని ప్రదర్శనకు నోచుకునే జానపద కళలు, భజనలు, పిల్లల ఆటలు, చలిమంటలు, మూడోది ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, నాలుగోది రైతు దృష్టిలోంచి చూడటం, పశువులు కాసే పిల్లవాడు మందను వదిలి ఇంటికెళ్ళి తిరిగి వచ్చేవరకు అదేచోట గడ్డిమేస్తూనే ఉండే పశువులు. ఇక చివరిది ఆరోదీ అయిన 1950 నుండి 1980ల దాకా గ్రామీణ వాతావరణంలో మారుతున్న జీవన శైలిని చూపడం." అనంటారాయన.

'మావూరు' డాక్యుమెంటరీని టివిలో చూసిన సుప్రసిద్ధ సమాంతర చిత్ర దర్శకుడు శ్యాం బెనెగళ్ బి.ఎన్‌కి లెటర్ రాస్తూ "ఇప్పటిదాకా తెలంగాణ మీద వచ్చిన చిత్రాలన్నింటిలోకి 'మావురు' అత్యుత్తమమైనది" అని అభినందించారు. ఆ తరువాత ఆయన ఎవరు కలిసినా "మీరు బి.నరసింగరావు తీసిన 'మావూరు' చూశారా"? అని ఆసక్తిగా అడుగుతారు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో 'మావూరు' చూసిన అమెరికన్ 'డైరెక్టర్ గాడ్ ఫేరిగ్గో'' మంత్రముగ్ధులయ్యారు.

**మా ఊరు - అవార్డ్స్:**

- ప్రధాన బహుమతి, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్, గైర్, హంగరీ, 1992
- ఉత్తమ ఆంత్రోపోలాజికల్ / ఎథ్నోగ్రఫిక్ ఫిల్మ్ గా జాతీయ అవార్డు, ఇండియా, 1989
- వెండి నంది, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, భారతదేశం, 1989
- ఉత్తమ ఫోటోగ్రఫీ - ఐడిపిఎ, ముంబై, ఇండియా - 1989

మొదటి హైదరాబాద్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో గిరీష్ కౌసరవెల్లితో బి.నరసింగరావు



**ఆకృతి :**

**శిలలు పాడే మౌనగీతం:**

'దాసి', 'మట్టిమనుషులు' చిత్రాలు తీసిన తరువాత బి.ఎన్.తీసిన మూడో డాక్యుమెంటరీ 'ఆకృతి'. పలుచోట్ల నెలకొన్న శిల్పాకృతుల చిత్రీకరణ 'ఆకృతి'. పలురకాల శిల్పాకృతులతో కూడిన ఈ డాక్యుమెంటరీ మనకు వాతావరణ పరిణామాలవల్ల ప్రకృతిలో సహజసిద్ధంగా ఏర్పడిన శిలల ఆకృతులు మనకు కళాత్మకంగా సాక్షాత్కరిస్తాయి. ప్రతి దృశ్యం బి.ఎన్ కళాత్మక దృష్టిని పట్టి చూపుతుంది.

ఆకృతి తీసిన నేపథ్యాన్ని నరసింగరావు ఇలా చెబుతారు "ఒకసారి జూబిలీహిల్స్‌లో స్థలం కొనటం కోసం వెళ్ళినప్పుడు అక్కడ కొండల్ని తొలిచేస్తున్నారు. పీల్చేస్తున్నారు. ఒక రకమైన బ్లడ్‌షేడ్‌లా అనిపించింది. ఆ బాధలోంచి పుట్టింది. హైదరాబాద్ 'రాక్స్'పై డాక్యుమెంటరీ ఆలోచన. చాలా అడ్డంకుల్ని అధిగమించి తీయగలిగాను. ఎ.కె.బీర్ ఫోటోగ్రఫీ, ప్రఖ్యాత వేణు వాద్య కళాకారుడు హరిప్రసాద్ చౌరాసియా వేణువు వాయించాడు. బొంబాయిలోని నేషనల్ సెంటర్ ఫర్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ థియేటర్‌లో ఆ సినిమా చూసిన దర్శకుడు మణికౌల్ ఉద్వేగాన్ని అణచుకోలేక బయటకు వచ్చి "హా" అంటూ చేతుల్ని గాల్లోకి ఎగరేయడం ఓ తీయని అనుభూతి నాకు.

హైదరాబాద్ నగరం బిర్యానీ, బ్యాంగిల్స్, ముత్యాలకు ప్రసిద్ధి. కానీ వీటన్నింటికన్నా ముందు కోట్లాది ఏళ్ళ నుండి ఇది శిలలకు, కొండరాళ్ళకు ప్రసిద్ధి. రుతువులకు, కాలమార్పులకు లోనై ఎండకు ఎండి, వానకు తడిసిన ఈ శిలలు ప్రకృతి అనే శిల్పకారుడి చేతిలో వింత వింత ఆకృతులుగా, వైవిధ్య రూపాలతో అలరారుతున్నాయి. ఈ ప్రాకృతిక సౌందర్యాన్ని ఈ బండరాళ్ళ విలక్షణ అందాలను ఆసరా చేసుకొని నర్సింగరావు రూపొందించిన డాక్యుమెంటరీ – 'ఆకృతి'!

"భాష అన్ని భావాలను పలికించగలదు. కానీ భావాలు భాషాతీతమైనవి. వాటి విషయములో భాష 'హ్యాండీక్యాపే' అని సాహిత్యకారులు చెపుతారు. అలాంటి భాషాతీతమైన భావాలను, భావనలను ఎన్నింటినో ఈ డాక్యుమెంటరీలోని శిలలు మౌనంగా వ్యక్తీకరిస్తుంటాయి. మెదడుతో కాకుండా మనసుతోను, అంతర్నేత్రంలతోనూ చూసి అనుభూతి చెందాల్సిన నైరూప్యత సౌందర్యాన్ని మన కళ్ళముందు సాక్షాత్కరింపచేయడంలో నర్సింగరావు దృక్కోణం అద్వితీయం. తెరపై ఓ మిస్టికల్ పోయెట్రీని ఆవిష్కరించిన ఈ 'ఆకృతి' హరిప్రసాద్ చౌరాసియా అందించిన వేణుగానం దృశ్యశ్రవణానందాన్ని కలిగిస్తుంది. 'ఆకృతి'కి దర్శకత్వం – స్క్రీన్‌ప్లేలనే కాక సహ సంగీత దర్శకత్వాన్ని నరసింగరావు వహించడం విశేషం.

'సేవ్ ది రాక్స్ సొసైటీ' వంటి సంస్థల ఎదుగుదలకు ప్రేరణనిచ్చిన ఈ డాక్యుమెంటరీ, సామాజిక ప్రయోజనాన్ని కూడా సాధించడమే కాక, అనేక ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించ బడింది."

**ఆకృతి-అవార్డ్స్:**

- ప్రత్యేక జ్యూరీ అవార్డు, నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, *1991*
- వెండి నంది, *ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇండియా, 1991*

బి.నరసింగరావు నాలుగు దశాబ్దాల చలనచిత్ర జీవనంలో నాలుగు సినిమాలు, మూడు డాక్యుమెంటరీలు, నిర్మాతగా ఒక సినిమా కాగా, దూరదర్శన్‌కోసం తీసిన 8 డాక్యుమెంటరీలకు నిర్మాతగా వ్యవహరించారు. దాదాపు తన సినిమాలన్నింటికీ తానే సంగీతం సమకూర్చుకున్నారు. అర్చనకు 'దాసి'తో మరోసారి ఊర్వశి అవార్డు తెచ్చిపెట్టారు. 1980 దశకాల్లో భారతీయ చలనచిత్ర రంగంపై బి.ఎన్.తన చిత్రాల ద్వారా వేసిన ముద్ర చెరిగిపోనిది.

'దాసి', 'మట్టిమనుషులు' రెండు చిత్రాలు బి.నరసింగరావును హిమాలయ శృంగంపై నిలబెట్టినవి. 1990లో అక్కినేని నాగేశ్వరరావుకు దాదాఫాల్కే అవార్డు వచ్చింది. అదే సంవత్సరం బి.నరసింగరావు 'మట్టిమనుషులు' చిత్రానికి జాతీయ అవార్డు వచ్చింది. ఆ తర్వాత ఒక సందర్భంలో అక్కినేని అన్నపూర్ణా స్టూడియోలో ఒక విందు ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా నిర్మాత వేదకుమార్‌తో కలసి వెళ్ళారాయన. బి.ఎన్‌ని చూడగానే అక్కినేని లేచి ఎదురు వస్తూ 'ఎ గ్రేట్‌మాన్ అరైవ్‌డ్' అంటు స్వాగతం పలికారు.

ఇంకొకసారి ఏదో సమావేశంలో కలుసుకున్నపుడు అన్నపూర్ణా పిక్చర్స్ దుక్కిపాటి మధుసూదనరావు "మేమెంత విజయవంతమైన సినిమాలు తీసినా తెలుగు సినిమాకే గాదు, మా తెలుగువారందరికీ అంతర్జాతీయ గౌరవం తెచ్చింది మాత్రం మీరేగదా!" అని బి.నరసింగరావును ప్రశంసించారు.

అయితే ఇండియన్ పనోరమలో ప్రదర్శించే చిత్రాల్లో నటించిన నటీనటులకన్నా దర్శకులకే అధిక ప్రాధాన్యత ఉంటుంది. బి.ఎన్. 'మాభూమి'తో మొదలుకుని సినిమాలు తీయడమే కాదు, సమకాలీన నవ్య సినిమా రంగాన్ని సీరియస్‌గా అధ్యయనం చేస్తూ తనలోని దర్శకుడిని రూపొందించుకున్నారు. వ్యాపారం ప్రధాన లక్ష్యంగా ఉన్న సినిమాలు అధికంగా తయారు అవుతున్న 1970 దశకంలో సినీరంగ ప్రవేశం చేసిన ఆయన తను తీయబోయే సినిమాలు ఎలా ఉండాలో, ఎలా తీయాలో అన్న విషయాలపై నిర్దిష్టమైన అవగాహనకు వచ్చి సినిమాలు తీశారు. సమాజాన్ని, రకరకాల మనుషుల జీవితాలను, వారిలో కనిపించని కోణాలను దర్శించి తన సినిమాలకు రూపకల్పన చేసుకున్నారు. అందుకే వాటిలో ఉన్నత ప్రమాణాలు, సామాజిక విలువలు, సహజత్వం ఉట్టిపడతాయి. విశ్వసినీ వేదికలపై తెలుగు సినిమా పక్షాన ఆయనే ఏకైక ప్రతినిధిగా నిలిచారు. గడచిన మూడున్నర దశాబ్దాల కాలంలో





భారతీయ (ఢిల్లీ) అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో బుదదేబ్‌దాస్ గుప్తా, సంగ్మా (కేంద్రమంత్రి), బి.నరసింగరావు, భాస్కర్ ఘోష్, బసు (డైరెక్టర్, దూరదర్శన్), ఇతరులు

50కి పైగా ఫిలిం ఫెస్టివల్స్, 30కి పైగా సెమినార్స్‌లో పాల్గొన్నారు బి.నరసింగరావు.

మరోవైపు చిత్రకారుడిగా హైదరాబాదు, ఢిల్లీ, ముంబై తదితర నగరాల్లో వ్యక్తిగత ప్రదర్శనలు నిర్వహించారు. ఇంకా భారతదేశంలోని కొన్ని నగరాల్లో వీరి ఫోటో ఎగ్జిబిషన్లుకూడా ఏర్పాటు చేశారు.

**ముగింపు:**

బి.నరసింగరావుకి కళా జీవితం, వ్యక్తిగత జీవితం అనేవి వేరువేరుగా కనబడవు. బాల్యంలో గ్రామీణ జీవన సౌందర్యాన్ని ఆస్వాదించడంతో మొదలైన ఆయన కళాభిరుచి ఇంతింతై వటుడింతైనట్లుగా సాగింది. అయితే ఒక్క రంగంలో ఆయన స్థిరపడిపోలేదు. ప్రవాహంలాగా ముందుకుసాగి పాయలుగా విడిపోయి చివరికి అన్నీ కలిసిన సినిమారంగంలో ఆయన సమగ్ర కళా స్వరూపం మనకు కనిపిస్తుంది. ఇవన్నింటినీ ఒకరకంగా చెప్పాలంటే సినిమాల్లో కథ మలుపు తిరిగినట్లే కనిపిస్తవి.

మొదటినుండి బి.నరసింగరావుకు పెయింటింగ్ అంటే ఇష్టం. కానీ ఫొటోగ్రాఫీ కోర్సులో చేరారు. ఫొటోగ్రఫీలోని అన్ని పనులు చేశారు. డార్క్ రూంలో ప్రింటింగ్ నేర్చుకోవడంవంటివి చేశారు. అయితే ఆయన మనసల్లా పెయింటింగ్స్ వేయడంమీదనే. ఇంతలో అజ్మత్ అలీ అనే మిత్రుడిని ఫోటోగ్రఫీలోంచి పెయింటింగ్స్ లోకి మార్పించమని సాయమడిగారు. అప్పటికే ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చదువుతున్న మిత్రులు గురుమూర్తి, ఇంకొందరు ఉండేవారు. కాలేజీకెళ్ళి అడిగితే సీటు ఇస్తాంగానీ ఇక్కడ మేం పెట్టె పరీక్ష పాసవ్వాలన్నారు. సరేనని అందుకు సిద్ధపడి వెళ్ళారాయన. ఈ పరీక్ష నిర్వహించే విఠల్‌కి బి.ఎన్. మంచి నటుడన్న విషయం గురుమూర్తి చెప్పారు. ప్రవేశ పరీక్షకు వెళ్ళగానే విఠల్ అడిగారు మీరు నటిస్తారా అని. అవునన్నారు బి.యన్. అంతే ఏదో నామమాత్ర స్కెచ్‌లు వేయించి పెయింటింగ్ కోర్సులో సెలక్ట్ చేశారు విఠల్.

బి.నరసింగరావు కాలేజీలో చేరగానే విఠల్ రాసిన 'జీవనజ్యోతి' నాటకంలో హీరోగా నటించారు. కాలేజీలో వేసిన ఆయన నాటకానికి అవార్డుకూడా వచ్చింది. అట్లా ఆయన చిత్రకళ నేర్చుకోవడానికి నటించాల్సివచ్చింది. ఆ తరువాత మరో సంవత్సరం ఉత్తమ నటుని అవార్డు కూడా. ఒకసారి అక్కినేని, మరోసారి శివాజీ గణేషన్, ఇంకోసారి భానుమతి గార్లచే అవార్డులు అందుకున్నారు. ఇవన్నీ ఇలా ఉండగా మొదట ఓ రెండేళ్ళపాటు డ్రాయింగ్స్ ఏమీ వేయకుండానె నెట్టుకొచ్చినా మూడో సంవత్సరం అజంతా, ఎల్లోరా ఎక్స్‌కర్షన్ వెళ్ళినపుడు తన సీనియర్ ప్రేరణతో వేసిన అజంతా కేవ్స్ బొమ్మలు అద్భుతంగా వచ్చినవి. అందరూ

మెచ్చుకున్నారు. ఆయనకు తానుకూడా చిత్రాలు వేయగలనని ఆత్మవిశ్వాసం వచ్చింది. కాలేజీకి వెళ్ళగానే నటరాజు ఆయిల్ పెయింటింగ్ చేశారు. చాలా బాగా వచ్చింది. ఆ తరువాత కాలేజి ఎగ్జిబిషన్‌లో కన్సొలేషన్ ప్రైజ్ కూడా వచ్చింది. దాంతో ఆయనలో పట్టుదల ఇంకా పెరిగింది. తనలో మంచి పెయింటర్ ఉన్నాడన్న ఆత్మవిశ్వాసం కలిగింది. అప్పట్లో టి.వైకుంఠం ఆయన సహాధ్యాయి, ఆ తర్వాత కొండపల్లి శేషగిరిరావు వంటి తన మాస్టర్ చేతనే 'నరసింగరావు నా స్టూడెంట్' అని గర్వంగా చెప్పుకునే స్థాయికి ఎదిగాడు.

'ఆర్ట్ లవర్స్' సంస్థ ఏర్పరిచాక జానపద గీతాలను రికార్డు చేయడం మొదలుపెట్టాడు. కొంతమంది జానపద గాయకులను పిలిపించి పాడించడం వాటికి కొత్త ట్యూన్లు కట్టడం ట్యూన్‌లకి తిరిగి రాయడం, వాటిని సామాజిక అంశాలతో ముడిపెట్టి తిరిగి కంపోజ్ చేయడం మొదలుపెట్టారు. ఇవన్నీ కూడా ఆయనకు సంగీతంలో పట్టు సాధించేందుకు తొలి పాఠాలైనవి. ఇలా జానపదాలకే కాదు తమ సంస్థ వేసే నాటకాలకు కూడా సంగీతం ఎట్లా ఉండాలో అలా చేయించుకోవడం మొదలుపెట్టారు. ఇది ఇంకొద్దిగా ముందుకుపోయి తాను స్వీయదర్శకత్వంలో తీసిన చిత్రాలకు, డాక్యుమెంటరీలకు స్వయంగా సంగీత దర్శకత్వం నెరుపుకునే స్వర ప్రావీణ్యాన్ని సాధించారు. నాటకాలతో నటనను, పెయింటింగ్స్‌లో అంతర్లీనంగా కవిత్వపు సొబగులను అద్దడాన్ని ఫోక్‌తో సినిమాలకు సంగీతం చేయడం మెల్లమెల్లగా ఆకళింపు చేసుకుని నిష్ణాతుడైనారు. ఇంకొద్దిగా నాలుగడుగులు ముందుకువేసి హిందుస్థానీ, కర్ణాటక, గజల్ వంటి శాస్త్రీయ సంగీతాలు, పాప్, జాజ్ మ్యూజిక్‌ల గురించి మెళకువలు నేర్చుకున్నారు. మొదటి నుండీ సినిమాలపట్ల ఉన్న అభిరుచే ఆయనలోని నటుడిని మేల్కొల్పి ఉండవచ్చునిపిస్తుంది. రంగస్థలంపై పలు సాంఘిక నాటకాల్లో నటించిన ఆయన రంగులకలలో 'రవి' పాత్ర అనితరసాధ్యంగా నిర్వహించారు. దర్శకునిగా అనుభవం ఉన్నవాడికన్నా ఎక్కువగా పరిణతిని ప్రదర్శిస్తారు. ఇవన్నీ ఆయన స్వీయ అధ్యయనంతో ఒంటబట్టిన ప్రతిభావ్యుత్పత్తులే.

నటన, సంగీతం, కవిత్వం, రంగస్థల దర్శకత్వం, నాటక రచన, చిత్రకళ, మరొకటి ఫోటోగ్రఫీ... వీటన్నిటి సమ్మేళనమైన సినిమారంగ ప్రవేశం చేశారాయన. తీరా నిర్మాతగా తీసిన 'మాభూమి'లో ఆయన పనిచేయని డిపార్ట్‌మెంట్ లేదు. ఒకరకంగా ఆయనకిది అప్రెంటిషిప్‌లాగా పనిచేసింది. 'రంగులకల'లో సొంతముద్రతో తన ప్రత్యేకతను నిలుపుకున్నారు. సినిమాల్లో సెట్స్‌మీదే అరగంటముందు సంభాషణలు రాసి పాత్రధారుల కివ్వడం ఆయన ప్రత్యేకత. భట్టీపట్టి అప్పజెప్పే విధానం ఆయనకు నచ్చదు. అక్కడికక్కడే పాత్రలోకి పంపి తాజాగా డైలాగ్‌లు చెప్పించడం ఆయన చేసిన నూతన ప్రయోగం. ఆ ప్రయోగం ఆయనకు గొప్ప ఫలితాలనిచ్చింది. ఇదంతా నటీనటులకు

**అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో (హైదరాబాద్) బి.నరసింగరావు, కె.విశ్వనాథ్ మరియు విదేశీ ప్రతినిధులు**



ఒరిజినల్ మూడ్‌ను క్రియేట్ చేయడానికి పనికివస్తుంది.

అతికొద్దిమంది రచయితలు, కవులు, సంగీతకారులు, చిత్రకారులు, చలనచిత్రకారులు ముందుగా తమ కళాకృతులను స్వప్నిస్తారు. ఆతరువాత వాటిని సృజిస్తారు. అలాంటివారిలో ఒకరు బి.నరసింగరావు. అయితే పైవాటిలో ఆయన ఏఒక్కదానికో పరిమితం కాలేదు. అన్నింటిలోనూ అభినివేశం కలిగిఉన్న బహుముఖ ప్రతిభాశాలి ఆయన. 1960, 70ల కాలంలో ఆయన సాహిత్యం, చిత్రకళ, నాటకరంగం, ఫోటోగ్రఫీ, నటన, సంగీత రంగాలలో చెప్పుకోదగిన స్థాయిలో పనిచేశారు. అయితే పూర్తిస్థాయిలో నటుడిగా స్థిరపడిపోవాలనుకున్నారు. కానీ సృజనాత్మకతను చూపడానికి నటనకన్నా స్క్రిప్ట్ రూపకల్పన దర్శకత్వ విభాగాల్లో ఎక్కువ అవకాశం ఉంటుందని ఆ శాఖల్లో చేరిపోయారు. అయితే మిగతావాటిని ఆయన దూరం చేసుకోలేదు. తన సినిమాలకు తానే సంగీతం చేసుకున్నారు. కవిత్వం రాయడం మానలేదు. పెయింటింగ్స్ వేయడం మానలేదు. ఫోటోగ్రఫీకీ దూరం కాలేదు.

అయితే బి.ఎన్. కళా ప్రయాణం మాత్రం అనితరసామాన్య మైనది. నాటకరంగం నుండి సాహిత్య రంగంలోకి వస్తారు. సాహిత్యం నుండి ఫోటోగ్రఫీలోకి, అందులోనుండి సంగీతంలోకి ప్రవేశిస్తారు. పెయింటింగ్ ఇక సరేసరి. వీటన్నింటిని సమ్మేళనంగా కనిపించే సినిమారంగంలోకి వచ్చాక ఆయన నిలబడ్డ స్థానం తెలుగు సినిమారంగంలోనేగాదు, భారతీయ చిత్రసీమలో తనదైన ముద్రతో ఆగకుండా అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమా వైభవానికి ప్రతీకగా నిలిచారు. ఇక తెలంగాణ సినిమాకైతే ఆయనే తొలి వెలుగు. నాలుగు దశాబ్దాల బి.ఎన్. సినీ జీవితమే ఇందుకు ప్రబల నిదర్శనం.

1992లో సత్యజిత్‌రే కాలంచేసినపుడు 'ది హిందూ'లో గౌతమ్‌కౌల్ అన్న ఫిలింక్రిటిక్ 'ఆఫ్టర్ రేహూ' (రే తరువాత ఎవరు?) అన్న శీర్షికన ఒక వ్యాసం రాశారు. బి.నరసింగరావు, ఆదూర్ గోపాలకృష్ణన్‌ల ఫోటోలు పెట్టి వ్యాసంలో శ్యామ్‌బెనగల్, గౌతం ఘోష్‌లను కూడా చర్చిస్తూ వీళ్ళెవరూ 'సత్యజిత్‌రే' స్థానాన్ని భర్తీ చేయలేరని ఒకవేళ ఎవరైనా చేయగలిగినవారుంటే ఒకరు బి.ఎన్., మరొకరు ఆదూర్‌లేనని రాస్తూ, మొదట బి.ఎన్ హైట్ రేను రిసెంబుల్ చేస్తుంది. ఆతరువాత ఆయనా ఆర్టిస్టు, ఈయనా ఆర్టిస్టు. ఇద్దరికీ సంగీతం తెలుసు. కవిత్వం తెలుసు. కథా రచనా తెలుసు. ఆని ఇద్దరిలో చాలా లక్షణాలు సరిపోల్చదగినవి ఉన్నవి. ఇంకా చెప్పాలంటే 'రే' కన్నా నరసింగరావుకు రెండు కళలు ఎక్కువనే ఉన్నవి. కనుక భవిష్యత్తులో 'రే'ను మరిపించగలిగిన దర్శకుడు బి.నరసింగరావు కావొచ్చు' మనం చేచి చూద్దాం! అని ఆ వ్యాసాన్ని ముగించారు. బహుశా దేశంలో మరే దర్శకుడి గురించి ఇలా రాసిఉన్న సందర్భాలు లేకపోవచ్చు.

భారతీయ నవ్య సినిమా ఉద్యమంలో సత్యజిత్‌రే, మృణాల్‌సేన్, రిత్విక్ ఘటక్, శ్యాం బెనెగల్ వంటివారి పరంపరలో బి.నరసింగరావు వంటి మన దర్శకుడు చేరడం మనందరికీ గర్వకారణం. త్వరలో ఆయన తీయబోయే సినిమాకోసం అభిరుచి గలిగిన సినిమా ప్రేక్షకులు ఆతృతతో ఎదురుచూస్తున్నారు.

జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన మీరు నవ్య సినిమా, సమాంతర సినిమా, వాస్తవిక సినిమాల్లో ఏ కోవకు చెందిన దర్శకునిగా భావిస్తారంటే–

"నేను స్వతహాగా చిత్రకారుడిని, కవిని, సంగీతకారుడిని, నటుడిని, రచయితను, శిల్పిని, ఇలా ఇతర కళల్లో కూడా నాకు ప్రవేశం ఉంది. ఒకదాంట్లోంచి మరొక దాంట్లోకి ప్రవేశిస్తూ చివరికి సినిమాల్లోకి వచ్చాను. అయినా నాకు అబ్బిన ప్రతి కళని అధ్యయనం చేయడం మాత్రం మానలేదు. పైన పేర్కొన్న కళలన్ని నా చలన చిత్రకళ నిర్మాణానికి ఎంతో వన్నె తెస్తాయి. నాసొంత శైలితో సినిమానైనా, డాక్యుమెంటరీనైనా కళా ఖండంగా రూపొందించాలనే ప్రయత్ని స్తాను. 'దాసి', 'మట్టిమనుషులు', 'హరివిల్లు' ఈ సినిమాలన్ని నా సొంత ముద్రతో రూపొం దినవి. ఇవన్నీ కలిసి ఒక ప్రవ హించే జీవనదిలా రాపాడుతాయి. నన్ను నేను ఒక సృజనాత్మక కళాకారుడిగానే భావిస్తాను" అంటారు బి. నరసింగరావు.





**రంగులకల - పాల్గొన్న చలన చిత్రోత్సవాలు**

తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఫెస్టివల్, హైదరాబాద్, 2016

టిఆర్‌సి, హైదరాబాద్, ఇండియా, 2013

టైమ్స్ ఆఫ్ ఇండియా సిటీ ఫిల్మ్ వీక్, హైదరాబాద్, 2006

హైటెక్స్ గ్యాలరీ, హైటెక్ సిటీ, హైదరాబాద్, 2005

రీజనల్ ఫిల్మ్ ఫెస్టివల్, కటక్, ఇండియా, 1984

నేషనల్ ఫిలిం ఫెస్టివల్, న్యూఢిల్లీ, 1984

ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా, ముంబై, 1984

**ది సిటీ - పాల్గొన్న చలన చిత్రోత్సవాలు**

తెలంగాణ ఆవిర్భావ దిన వేడుకలు, ఎల్. కె.టి. హైదరాబాద్, ఇండియా, 2015

టిఆర్‌సి, హైదరాబాద్, ఇండియా, 2013

హెరిటేజ్ కన్జర్వేషన్ కమిటీ కోసం స్క్రీనింగ్, హైదరాబాద్, 2002

ఇన్‌టాక్, ఆక్సిస్, హుడా స్టడీ ప్రోగ్రామ్స్, హైదరాబాద్ 1987–92

ముంబై ఇంటర్నేషనల్ షార్ట్ అండ్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, 1990

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అఫ్ ఇండియాలో ప్రత్యేక స్క్రీనింగ్, టివిఎం, 1988

నంది అవార్డ్స్ ఫిలిం ఫెస్టివల్, హైదరాబాద్, 1988

న్యూఢిల్లీ, ముంబై, కలకత్తాలలో నేషనల్ ప్రీమియర్స్, 1987.

స్టేట్ ఆర్కైవ్స్, హైదరాబాద్, ఇండియా 1987

**మా ఊరు - పాల్గొన్న చలన చిత్రోత్సవాలు**

సాలర్జంగ్ మ్యూజియం, హైదరాబాద్, 2014

టిఆర్‌సి, హైదరాబాద్, ఇండియా, 2013

హంగేరియన్ కల్చరల్ సెంటర్, న్యూఢిల్లీ, 2008

నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్, కరీంనగర్, ఏ.పి. 2007

స్టేట్ ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్, 2004

లోక్‌విద్య ఆందోళన్ సమ్మేళన్, చీరాల, 1999

కాలా ఘోడా ఆర్ట్ ఫెస్టివల్, ముంబై, 1999

ఎకోటోప్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్, బ్రస్టిస్లావియా, 1995

ఎంటె మోస్ట్రా సినిమాటోగ్రాఫికల్ ఇంటర్నేషనల్, విటెర్బో, ఇటలీ, 1993

రూరల్ ఇమేజెస్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్, ఇండియా, 1992

ఐఎఫ్ఎఫ్ఐ, కోల్‌కతాలో ప్రత్యేక స్క్రీనింగ్, భారతదేశం, 1990

ముంబై ఇంటర్నేషనల్ షార్ట్ అండ్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, 1990

నేషనల్ ఫిలిం ఫెస్టివల్, న్యూఢిల్లీ, ఇండియా, 1989

న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతాలలో నేషనల్ ప్రీమియర్స్ 1989

మ్యూనిచ్ ఫిల్మ్ ఫెస్ట్ (జర్మనీ)లో ఇంటర్నేషనల్ ప్రీమియర్ 1989

**దాసి - పాల్గొన్న చలన చిత్రోత్సవాలు**

డాక్టర్ ఎంసిఆర్ హెచ్ఆర్‌డి ఇనిస్టిట్యూట్, హైదరాబాద్, ఇండియా, 2016

తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఫెస్టివల్, హైదరాబాద్, ఇండియా, 2015

నీస్ ఫెస్టివల్ – 'ఫోకస్ ఆన్ విమెన్' – నీస్, ఫ్రాన్స్, 2006

కోల్‌కతా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, 2004

ల–కార్నో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్ట్ లో ఇండియన్ పనోరమా, స్విట్జర్లాండ్, 1999

మూవీ మేళా, ఇంటర్నేషనల్ మూవీ ఫేర్, హైదరాబాద్, ఇండియా, 1999

తెలుగు సినిమా – ఫోకస్ – ఐఎఫ్ఎఫ్ఐ, హైదరాబాద్, 1999

ఫెస్టివల్ ఆఫ్ ఇండియా, వార్సా, ఇటలీ & జర్మనీ, 1999

యాభై ఏళ్ళ భారత స్వాతంత్ర్య వేడుకలు – స్విట్జర్లాండ్, స్వీడన్, ఫ్రాన్స్, ఇటలీ, యూకే 1997

ఎన్‌సీపీఏ, నారీమన్ పాయింట్, ముంబై, ఇండియా, 1997

వెనిస్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం, ఇటలీ, 1996

బెర్గమో ఇంటర్నేషనల్ ఫిల్మ్ మీట్, ఇటలీ, 1994

డబ్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఐర్లాండ్, 1994

హికోమిండ్ ఫిల్మ్ ఫెస్టివల్, శ్రీలంక, 1992

ఏషియన్ ఫిలిం సెంటర్, కొలంబో, శ్రీలంక, 1992

ఫెస్టివల్ ఆఫ్ ఇండియా, బెర్లిన్, జర్మనీ, 1992

యూరప్‌లో ఫెస్టివల్ ఆఫ్ ఇండియా 1991–92

మ్యూజియం ఆఫ్ మోడరన్ ఆర్ట్, న్యూయార్క్, 1991

లింకన్ సెంటర్, న్యూయార్క్, అమెరికా, 1991

ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా, కోల్‌కతా, ఇండియా, 1990

కైరో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్, ఈజిప్ట్, 1990

నాంటెస్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్, ఫ్రాన్స్, 1990

కార్లోవి వేరి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, చేకోస్లోవకియా, 1990

ఇంటర్నేషనల్ మేథమేటిక్స్ కాన్ఫరెన్స్, హైదరాబాద్, ఇండియా, 1989

నేషనల్ ఫిలిం ఫెస్టివల్, న్యూఢిల్లీ, ఇండియా, 1989

మ్యూనిచ్ ఫిల్మ్ ఫెస్ట్ (జర్మనీ)లో ఇంటర్నేషనల్ ప్రీమియర్ 1989

**మట్టి మనుషులు - పాల్గొన్న చలన చిత్రోత్సవాలు**

టిఆర్‌సి, హైదరాబాద్, ఇండియా, 2013

చిత్ర యాత్ర, ప్రపంచ చిత్రోత్సవ వేడుక, హైదరాబాద్, ఇండియా, 2007

జెరూసలేం ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్, ఇజ్రాయెల్, 1993

అమెరికన్ ఫిలిం ఇనిస్టిట్యూట్, కాలిఫోర్నియా, అమెరికా, 1992

సినిమాతిక్యూ, మాంట్రియల్, వాంకోవర్, టొరొంటో; కెనడా, 1992

ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా, చెన్నై, ఇండియా, 1991

స్క్రీనింగ్ డేస్, ట్రావెలింగ్ ఫిల్మ్ ఫెస్ట్, స్వీడన్, 1991

రూరల్ ఇమేజెస్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్, ఇండియా, 1991

నేషనల్ ఫిలిం ఫెస్టివల్, న్యూఢిల్లీ, ఇండియా, 1991

*(ఈ చలన చిత్రం 1992 లో అమెరికాలోని ప్రధాన యూనివర్సిటీలలో ప్రదర్శించబడింది)*

**ఆకృతి - పాల్గొన్న చలన చిత్రోత్సవాలు**

డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్ట్, లామకాన్, హైదరాబాద్, 2011

నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్, కరీంనగర్, ఎ.పి., ఇండియా, 2007

చిత్రమయి, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్, ఇండియా, 2004

ఇమేజెస్ ఆఫ్ ది సిటీ, ఫోటో వర్క్‌షాప్, సికింద్రాబాద్, ఇండియా, 1998

ఆల్ ఇండియా ఆర్టిస్ట్స్ వర్క్‌షాప్, హైదరాబాద్, ఇండియా, 1998

ఎకోటోప్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్, బ్రాటిస్లావియా, 1995

ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్, మ్యూనిచ్, జర్మనీ, 1994

మీడియావేవ్, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్, గైర్, హంగేరి, 1993

రోష్ద్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్, టెహ్రాన్, ఇరాన్, 1993

ఇంటర్నేషనల్ ఎవిఇ ఫిల్మ్ ఫెస్టివల్, ఆర్న్హెం, నెదర్లాండ్స్, 1993

ఎంటె మోస్ట్రా సినిమాటో గ్రాఫికల్ ఇంటర్నేషనల్, వెటెర్బొ, ఇటలీ, 1993

జెరూసలేం ఫిలిం ఫెస్టివల్, ఇజ్రాయెల్, 1993

నేషనల్ ఫిలిం ఫెస్టివల్, న్యూఢిల్లీ, ఇండియా, 1993

ముంబై ఇంటర్నేషనల్ షార్ట్ అండ్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, 1992

ప్రత్యేక ప్రదర్శన – ఐఎఫ్ఎఫ్ఐ, బెంగళూరు, భారతదేశం, 1992

**హరివిల్లు - పాల్గొన్న చలన చిత్రోత్సవాలు**

గీతాంజలి, శాంతి నికేతన్, పశ్చిమ బెంగాల్, ఇండియా, 2004

ఎఫ్ఎఫ్ఐఐ & ఎన్ఎఫ్ఐ, భారత ప్రభుత్వం, పుణె, ఇండియా, 2004

సత్యజిత్ రే ఫిలిం ఇనిస్టిట్యూట్, కోల్‌కతా, ఇండియా, 2004

9వ కోల్‌కతా ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, 2003

13వ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, హైదరాబాద్, ఇండియా, 2003

9వ జంషెడ్‌పూర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, 2003

ఇండియా హాబిటట్ సెంటర్, న్యూఢిల్లీ, ఇండియా, 2003

2వ పుణె ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, 2003

తిరువనంతపురం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియా, 2003

ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్, న్యూఢిల్లీ, ఇండియా, 2003

**అతని, అతని సినిమాలపై, వెలువడ్డ రచనలు**

**అంతర్జాతీయం...**

విలేజ్ వాయిస్, ఇండియా అబ్రాడ్; యూఎస్ఏ, వెరైటీ; యూకే, ప్రావ్దా (మాస్కో),

మ్యూనిచ్, బెర్లిన్ (జర్మనీ), స్టాక్ హోమ్ (స్వీడన్), కార్లోవివారీ (చెక్), రోమ్, బెర్గమో (ఇటలీ),

కైరో (ఈజిప్ట్), కొలంబో (శ్రీలంక), ఢాకా (బంగ్లాదేశ్) జర్నల్స్, ఇండియా పర్‌స్పెక్టివ్ (ప్రపంచవ్యాప్తంగా సర్క్యులేట్ ఉన్న ఇండియన్ మ్యాగజైన్)

**భారతదేశం**

ఇండియా టుడే, ది వీక్, ఫ్రంట్ లైన్, ది హిందూ, సినిమా ఇన్ ఇండియా, సినిమా ఇండియా ఇంటర్నేషనల్, డిస్కవర్ ఇండియా, ఫ్రీ ప్రెస్ జర్నల్, మిడ్ డే, టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూస్తాన్ టైమ్స్, డీప్ ఫోకస్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఇండియన్ సినిమా, పాట్రియాట్, పయనీర్, స్టేట్స్‌మన్, టెలిగ్రాఫ్, దక్కన్ క్రానికల్, న్యూస్ టైమ్, దక్కన్ హెరాల్డ్, ట్రిబ్యూన్, బ్లిట్జ్, సండే, సహారా టైమ్స్, స్క్రీన్ & మెట్రోపొలిస్.

**టీవీ ఛానల్స్**

బిబిసి, *లండన్, యూకే*

మాస్కో & తాష్కెంట్ టీవీ, రష్యా

మ్యూనిచ్ మరియు బెర్లిన్ టీవీ, జర్మనీ

దూరదర్శన్, ఆజ్ తక్

స్టార్ టీవీ, జీ టీవీ

డిడి, ముంబై / కోల్‌కతా / హైదరాబాద్ / న్యూఢిల్లీ

**ఫిల్మ్ ఎంట్రీలు**

ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ఇండియన్ సినిమా,

ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ (యు.కె)

ఎన్నో సినిమాలు...

గార్గ్ *(అగ్రగామి భారతీయ సినీ విమర్శకుడు)*

ఇండియన్ సినిమా,

థొరావాల్, *(ఫిల్మ్ ఆర్కైవ్స్, పారిస్, (ఫ్రాన్స్)*

ఇండియన్ పనోరమా పబ్లికేషన్స్,

డిఎఫ్ఎఫ్ *(సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం)*

తెలుగు చిత్ర నిర్మాతల చరిత్ర,

తెలుగు ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, హైదరాబాద్, ఇండియా

**సినిమా అధ్యయనాలు**

ఎల్.బి. శాస్త్రి ఇనిస్టిట్యూట్, ముస్సోరీ, ఇండియా

ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా, పుణె, ఇండియా

ఫిల్మ్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా, పుణె, ఇండియా

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇండియా

డాక్టర్ ఎంసిఆర్ హెచ్ఆర్‌డి ఇనిస్టిట్యూట్, హైదరాబాద్, ఇండియా

ఐఐఐటి, హైదరాబాద్, ఇండియా

మ్యూనిచ్ ఫిలిం ఇనిస్టిట్యూట్, జర్మనీ

ఫిలాడెల్ఫియా విశ్వవిద్యాలయం, పెన్సిల్వేనియా, యూఎస్ఏ

మొదలైన చోట్ల ఆయన సినిమాలు పాఠ్యాంశాలుగా ఎంచుకోబడ్డాయి.

**అందుకున్న అవార్డులు**

జీవిత సాఫల్య పురస్కారం *(ఇండీవుడ్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం)*

టిఎస్‌పి వార్షిక అవార్డు *2017*

ఇండీవుడ్ సినీ అవార్డు, *2016*

విశిష్ట పురస్కారం, *పిఎస్‌టియు, 2015*

శాంతి దూత అవార్డు, *2014*

సుద్దాల హనుమంతు అవార్డు, 2011

'ఏఎస్‌సీఏ' అవార్డు, *2011*

బి.ఎన్. రెడ్డి నేషనల్ అవార్డు, 2010

ఎక్స్‌లెన్స్ అవార్డ్ ఇన్ సినిమా *2007*

బొల్లిముంత సాహిత్య అవార్డు, *2007*

డబ్ల్యూహెచ్ఓ అవార్డు, 2004

యునెస్కో అవార్డు, 1992

విజయలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు, 1989

**ఫిల్మ్ రెట్రోస్పెక్టివ్స్**

కరీంనగర్, ఎ.పి. ఇండియా, *1994*

విజయవాడ, ఎ.పి., *ఇండియా, 1994*

తెనాలి, ఎ.పి., *ఇండియా, 1994*

న్యూఢిల్లీ, ఇండియా, 2007

లామకాన్, *హైదరాబాద్, ఇండియా, 2013*

**ప్రొఫైల్**

డిడి, *ముంబై, ఇండియా, 1997*

డిడి, *హైదరాబాద్, ఇండియా, 1991*

ఐ-న్యూస్, *హైదరాబాద్, ఇండియా, 2008*

టి- న్యూస్, *హైదరాబాద్, ఇండియా, 2012*

ఎన్టీవి, *హైదరాబాద్, ఇండియా, 2015*

వి6, *హైదరాబాద్, ఇండియా, 2015*

ఐ డ్రీం, *యుట్యూబ్ ఛానల్, ఇండియా, 2017*

డి.డి., *హైబా, హైదరాబాద్ 2017*

ఆల్ ఇండియా రేడియో, హైదరాబాద్, ఇండియా

*(1986, 1988, 2003, 2009, 2015 మరియు 2017)*

**బయోగ్రఫీ**

*'ఆంధ్రప్రభ' దినపత్రికలో ప్రచురితం*

హైదరాబాద్, ఇండియా, 2007

**హెరిటేజ్**

*(ఎథ్నోగ్రఫీ, ఆంత్రోపాలజీ మరియు ఆర్కియాలజీ)*

తెలంగాణ అన్ని జిల్లాల వ్యాప్తంగా వారసత్వ స్థలాలను కనుగొనడానికి ఫోకస్, ఫ్యాక్ట్, డాక్రిలతో కలసి దశాబ్దాల పాటు ప్రయాణించి అన్వేషించారు. హైదరాబాద్ వారసత్వ కట్టడాలకు సంబంధించి ఇంటాక్ మరియు హెరిటేజ్ కన్జర్వేషన్ కమిటీలతో కలసి పనిచేశారు.

**ఫోటోగ్రఫీ; అంతర్జాతీయ మ్యూజియం**

6,000 ఛాయాచిత్రాల (1860 - 1960) కలెక్షన్ భద్రపర్చబడింది.

(మ్యూజియం ఇంకా నెలకొల్పవలసి ఉంది).

**నరసింగ్ రావు సంగీతం**

**డిజిటల్ ఆర్కైవ్**

50, 000 ప్రపంచవ్యాప్త గ్రామ్‌ఫోన్ రికార్డులు (78 ఆర్‌పీఎం, 45 ఆర్‌పీఎం,మరియు 33 1/3 ఆర్‌పీఎం) సేకరణ; 2001లో ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) (హైదరాబాద్)కు విరాళంగా ఇవ్వబడ్డాయి.

**తాళాలు ; తలుపుల మ్యూజియం**

3,000 తాళాలు (మానవ తయారీ), 500 మినియేచర్ తలుపులు; 200 అసలు సిసలైన తలుపుల సేకరణతో ఒక మ్యూజియం ఏర్పాటు కావలసి ఉంది.

**జానపద ఆర్కైవ్స్**

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన జానపద పాటలు మరియు కళారూపాలు గణనీయ సంఖ్యలో సేకరించబడ్డాయి. అవి వీడియో మరియు ఫిల్మ్ ఫార్మాట్లలో డాక్యుమెంట్ చేయబడ్డాయి. జానపదంపై ఒక విశిష్ట గ్రంథాలయం ఏర్పాటు చేయబడింది.

**రీసెర్చ్ మెటీరియల్**

విభిన్న సామాజిక నేపథ్యాలతో కూడిన 35 అంశాలపై పరిశోధనా సామగ్రి అందుబాటులోకి తీసుకు రాబడింది. ఉదా: జానపద సాహిత్యం, వలసలు, పశువులతో మనుషులకు అనుబంధం, బహురూపి, సూఫి, ప్రముఖుల జీవితచరిత్రలు, ఆడపాపలు, బాల్యం, గ్రహణంమొర్రితో బాధపడే చిన్నారులు, భారత స్వాతంత్ర్య ఉద్యమం, 50 ఏళ్ళ భారతదేశ స్వాతంత్ర్యం, సినిమా చరిత్ర, ఫిల్మ్ ఈస్తటిక్స్, వరకట్న చావులు, బాలకార్మికులు, ప్రాంతీయ సినిమా గుణగణాలు, యజ్ఞం (కథ)పై అధ్యయనం మొదలైనవి వీటిలో ఉన్నాయి. వీడియో, ఆడియో మరియు ట్రాన్స్‌స్క్రిప్ట్ రూపాల్లో ఈ సామగ్రి ఉంది.

**జానపద పెయింటింగ్స్ మరియు కుడ్యచిత్రాలు**

నకాషి కళ (గ్రామీణ స్క్రోల్ పెయింటింగ్స్)పై అధ్యయనం. ప్రస్తుతం తెలంగాణ కుడ్య చిత్రాలపై అధ్యయనం జరుగుతుంది.



DECCAN
ACADEMY
"BHOOPATHI SADAN" 3-6-716, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.
Telangana, INDIA.
Phone: 040-27635644
E-mail: vedakumar52@gmail.com



## హెచ్ రమేష్‌బాబు:

తెలంగాణ నుండి సినిమా జర్నలిస్టులుగా సీరియస్ రచనలు చేస్తున్న అతి కొద్దిమందిలో ఒకరు హెచ్.రమేష్‌బాబు. గత ముప్పై ఏళ్ళుగా రచనా వ్యాసంగాన్ని వృత్తిగా చేపట్టిన హెచ్.రమేష్‌బాబు కవిగా, రచయితగా, జర్నలిస్టుగా, సినీకళారంగ విమర్శకుడిగా బహుముఖీనంగా తన కృషిని కొనసాగించినా, ఆయన ప్రధాన రచనా స్రవంతి సినిమానే. ఇప్పటివరకూ ఆయన రాసిన సుమారు 4000 వ్యాసాల్లో సినిమారంగ వ్యాసాలే 2000కు పైగా ఉంటాయి. ఫాల్కే అవార్డు విజేతలు (2003) వెంకయ అవార్డు వెలుగులు (2004),  సినీ పితామహుడు (2004), కాంచనమాల జీవన చిత్రాలు (2006), నంది అవార్డు విజేతలు (2006), ధృవతార కన్నాంబ (2003), మహానటి సావిత్రి (2008), మార్గదర్శకుడు కె.వి.రెడ్డి (2012), దర్శక చక్రవర్తి ఆదుర్తి సుబ్బారావు (2013),  తొలినాటి సినిమా పాటల పుస్తకములు (1933-1940)-(2011) వంటి సినిమా పుస్తకాలను వెలువరించారు. వీటిలో కొన్ని స్వతంత్ర రచనలు, కొన్ని సంపాదకత్వాలు. మరోవైపు పాలమూరు జిల్లా చరిత్ర, ప్రముఖులపై డజను పుస్తకాలను వెలువరించారు.

తెలంగాణ ఉద్యమంలో స్వయంగా పాల్గొనడమేకాదు, ఆ ప్రేరణతో భారతీయ సినిమారంగంలో తెలంగాణను అన్వేషించే ప్రయత్నం చేసి తెలంగాణ సినిమాకు 120 ఏండ్ల చరిత్ర ఉందని 1896లోనే హైదరాబాదులో మూకీ చిత్రాల ప్రదర్శన జరిగిందని తేల్చిచెప్పారు. అప్పటిదాకా తెలుగు సినిమా చరిత్రలో తెలంగాణలోని సినిమా పరిణామాలు ఒక ఉపశీర్షికగా పేర్కొంటే హెచ్.రమేష్‌బాబు తెలంగాణకు సినిమా చరిత్రనే ఉందని నిరూపించారు.ఆ తెలంగాణ సినిమా చరిత్రను త్వరలోనే గ్రంథంగా వెలువరించనున్నారు.

అవార్డులు: జిల్లా యువ సాహిత్యవేత్తగా నెహ్రూ యూత్ అవార్డు (1997), జయప్రకాష్ నారాయణ మెమోరియల్ అవార్డు 2002, అమ్మ సంస్థాన్ ట్రస్ట్ విశాఖ వారి పురస్కారం 2007, తెలుగు యూనివర్సిటీ సత్కారం 2015, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సత్కారం 2015, తెలంగాణ ఎన్ఆర్ఐ 'తానా' వారి ప్రా।। జయశంకర్ అవార్డు 2017, తెలంగాణ ప్రభుత్వ రాష్ట్రస్థాయి అవార్డు 2017, డజనుకు పైగా సెమినార్లలో పత్ర సమర్పణ.

DECCAN ACADEMY